ఆంధ్రపత్రిక

సచిత్ర వార పత్రిక

4 అణాలు

17-9-'52



పంచతంత్రం

మిత్రభేదం


కర్త... విశ్వాత్ముల నరసింహమూర్తి




































సంవత్సరం చందా
రు 12-0-0
విడిప్రతిక 4 అ


ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder K NAGESWARA RAO

సంపుటము 45
సంచిక 4
17.9-52

నందన భాద్రపదబహుళ త్రయోదశి బుధవారము



మైసూరు, బృందావన గార్డెన్సులో ఒక దృశ్యం

—ఫోటో తీసినవారు: సినీనటుడు శ్రీ ఎ. నాగేశ్వరరావు

విషయానుక్రమణిక

ముఖచిత్రం: "నాజ్" హిందీ చిత్రంలో నళినీజయవంత్.

కృష్ణానది ప్రాజెక్టులు 3

డిస్కవరీ ఆఫ్. నెహ్రూ —సవ్యసాచి 4

కాలక్షేపం—దాసు వామనరావు 5

రెండు మహానగరాలు— చార్లెస్ డికన్స్ 9

ఎదురుప్రశ్న—శ్రీ పోతుకూచి సాంబశివరావు 12

నెల్లోస్తాను—"ప్రభాకరం" 13

పెత్తనం—"సులోచన" 20

పరారి—జాన్ గాల్స్‌వర్దీ 24

విజ్ఞాన వీథులు— 26

అదృష్టవంతుడు—శ్రీ యం. రామారావు 29

బావిలోచందమామ— భుజంగ్ 30

డాన్ క్విక్ సెట్— 31

మెట్టవేదాంతం—శ్రీ పినపాక నరసింహామూర్తి 35

పండి పెళ్లి—శ్రీ రావి కొండలరావు 36

జంతుకోటిలోనూనవలతు లాలు 39

సినిమా— 44

ప్రశ్నలు-సమాధానాలు 51

కృష్ణానది ప్రాజెక్టులు

కృష్ణానది మీద ప్రాజెక్టుల్ని గురించి మద్రాసు ప్రభుత్వంతో ఏకీభవించనివారిలో ఆంధ్రదేశ రాజకీయ నాయకులే కాకుండా పెద్ద పెద్ద ఇంజనీర్లు కూడా ఉన్నారు. కృష్ణా - పెన్నార్ ప్రాజెక్టు నిర్మిస్తే కృష్ణా తీరవాసులికి నీరు బొత్తిగా తక్కువై మామూలు పంటలకి కూడా దెబ్బతగుల్తుందన్నవారిని మద్రాసు ప్రభుత్వం నిరసించింది. ఇప్పుడా మాటనే కేంద్ర ప్రభుత్వపు ఇంజనీరుగారు డా॥ కె. యల్. రావుగారుకూడా అన్నారు. ఇంతేకాదు. కృష్ణానదిపై ఎక్కడ ఎన్ని ప్రాజెక్టులు నిర్మించినా, పులిచింతల ప్రాజెక్టుని నిర్మించక తప్పదన్నారు.

కోట్లు ఖర్చుపెడితే రాగల ప్రతిఫలాన్ని బట్టిచూస్తే నందికొండ ప్రాజెక్టుని ప్రపంచంలోకెల్ల ఉత్తమోత్తమమైనదిగా పరిగణించాలన్నారు డా॥ రావుగారు. మద్రాసు ప్రభుత్వం తలపెట్టిన కృష్ణా – పెన్నా ప్రాజెక్టు నిర్మాణంలో మొదటి మెట్టుకి (మొత్తం ఆరు దఫాలుగా నిర్మాణాన్ని సర్దవచ్చునని ప్రభుత్వం అంచనా) ఖర్చు రు 80 కోట్లు అయితే సాగు కిందికి వచ్చేభూమి (ఒకే పంట) ఆరులక్షల ఎకరాలు; ఇప్పుడు సాగులో ఉన్న భూమిలో 12 లక్షల ఎకరాలలో



కృష్ణానది బోటు ప్రమాదంలో మరణించిన ఇంజనీర్ శ్రీ వేపా కృష్ణమూర్తిగారు

రెండో పంటకు సదుపాయం కలుగుతుంది. అయితే ఈ భూమిలోనే కొంత మునిగిపోతుందిటకూడా. నందికొండ ప్రాజెక్టు ఇంతకంటె తక్కువ ఖర్చుతో కోటి ఎకరాలభూమిని సాగులోకి తెలుస్తుందిట.

ఖోస్లాకమిటీవారు కూడా కృష్ణా-పెన్నార్ ప్రాజెక్టుకంటె (దీన్నే చెంగల్పట్ – ఉత్తరార్కాట్ ప్రాజెక్టు అని తెన్నేటి విశ్వనాధంగారన్నారు.) నందికొండ ప్రాజెక్టే ముఖ్యమని భావించినట్లు అనధికారవార్త వచ్చింది.

కృష్ణానదిపై ప్రాజెక్టుల్ని గురించి ఆంధ్రదేశ ప్రజలకేకాక ఇతరులకు కూడా ఇటువంటి దృఢాభిప్రాయాలున్నాయంటే, మద్రాసు ప్రభుత్వం తమ కార్యక్రమాల్ని మరొకసారి తరిచి చూసుకోడం అవసరం. ఖోస్లా కమిటీ రిపోర్టునిగురించి పత్రికా ప్రతినిధుల సమావేశంలో ఒకరు ప్రశ్నిస్తే ముఖ్యమంత్రి రాజగోపాలాచారిగారు సమాధానమిస్తూ కొత్తప్రాజెక్టుల్ని ఇప్పుడెలాగూ ప్రారంభించబోరన్నారు. అంటే కృష్ణా-పెన్నా ప్రాజెక్టుకి ప్లానింగ్ కమిషన్ సమ్మతించకపోతే, కృష్ణా, గోదావరి నదులపైన ప్రాజెక్టుల్ని పూర్తిగా విరమించుకోవాలని వారి ఉద్దేశమేమో తెలియదు. అదే వారి ఉద్దేశమైతే తక్షణం ఆంధ్రరాష్ట్రాన్ని మద్రాసు రాష్ట్రంనుంచి విడదీసుకోండని రాజాజీ చెప్పేస్తున్నారన్నమాట. ఆంధ్రరాష్ట్రోద్యమానికి సత్యాగ్రహాలకంటె ఇటువంటి ప్రభుత్వచర్యలే బలం అనుకోవచ్చు.

"ఎత్తిచ్చికరగబోసిన ఇత్తడి బంగారమౌనె?"

క్రీస్తుపుట్టక పూర్వము మనదేశంలో జైనపండితులు రసశాస్త్రములో పరిశోధనలు చాలా చేశారు. పాదరసంతో అనేక మహాద్భుతములైన ప్రక్రియలుచేసి చూపించినారట. తక్కువరకపు లోహములను రసశాస్త్ర ప్రక్రియలద్వారా బంగారముగా చేయగల్గిరట. కొంతకాలము క్రిందట ఒక సాధువు పశ్చిమగోదావరిజిల్లాలోని భీమవరమునకు వచ్చి రాగితీగెను మేల్మిబంగారు తీగెగా మార్చెను.

ఇదిగాక—

ఢిల్లీలో శ్రీ ఘనశ్యామదాసు బిర్లాగారి మందిరమున వారియజ్ఞశాలలో ఒక స్తంభముమీద శాసనరూపంగా హిందీభాషలో లిఖింపబడిన విచిత్ర విషయము యిప్పటికీ ఎవరైనా చదువవచ్చు. ఆ స్తంభం మీద శాసనంలో యీక్రిందిరీతిగా వ్రాయబడింది.

"1941 సం లో న్యూఢిల్లీయందలి బిర్లాగారి గృహమున శ్రీ పండిత కృష్ణపాల శర్మగారు మా సమక్షమునందే ఒకతులము పాదరసమును ఇంచుమించుగ ఒక తులము బంగారముగ మార్చి చూపించియుండిరి......ఆ సమయమున అఖిలభారత హరిజన సంఘ ప్రధానమంత్రియగు అమృతలాలు వి. ఠక్కరుగారు; ఢిల్లీలోని బిర్లామిల్లు కార్యదర్శి సీతారాంజీ ఖేంకాగారు; ఛీఫ్‌యింజనీరు విల్సనుగారు, వియోగీ హరీగారు ఉండిరి - శ్రీమాన్ శేట్ జుగుత్ కిశోర్ బిర్లాగారు మాకందరకు దయతో యీ క్రియను చూచుటకేర్పాటుచేసిరి.

విక్రమసంవత్సరము 2,000 మార్గశీర్ష కృష్ణపంచమి.
సంతకములు (1) అమృతలాలు వి-ఠక్కర్, (2) శీతారామ్ ఖేంకా (3) వియోగీహరీ

అని శాసనంలో వ్రాయబడి ఉంది—

పంజాబ్ నివాసియైన యీ శ్రీ కృష్ణపాల శర్మగారూ ఋషీకేశములో మహాత్మ గాంధీగారికి మంత్రియగు మహదేవదేశాయి, శ్రీ గణేశదత్తు గోస్వామి, శ్రీ జుగుల్ కిశోర్ బిర్లాగార్లు మొదలైనవారి సమక్షంలో 200 తులముల పాదరసమును ఓషధీ చూర్ణములతో కలిపి అరగంటసేపు అగ్నితప్తంచేసి 14 శేర్లు బంగారము అనగా సుమారు రూ 75 వేల కిమ్మతుగల బంగారం తయారుచేశారు. దానము చేయుటకొరకై యీ బంగారంతైన జెప్పఁడినవారికి యివ్వబడెను అని కూడా ఆ స్తంభశాసనంలో ఉంది. ★

డిస్కవరీ ఆఫ్ నెహ్రూ

(అంటే నెహ్రూచేసిన డిస్కవరీ అనిగాని, నెహ్రూను
డిస్కవర్ చెయ్యటం అనిగాని అర్థం చెప్పుకోవచ్చు.)

నెహ్రూ :—

పాపం ఆంధ్రులకు రాష్ట్రం ఇద్దామని నేను
చాలకాలంనుంచీ కలలుకంటున్నాను.
ఏమిటో మరి ఎంత ప్రయత్నించినా
కాస్తయినా వీలుపడితేనా ?

ఆంధ్రులకు రాష్ట్రంలేకపోతే ఎల్లాగని
ఎన్నిసార్లు ఎందరితో దెబ్బలాడానని ?
ఏమిటో నేనెంత ఇదవుతున్నా
ఒక్కరైనా మరి కలిసివస్తేనా ?

ఇంతకీ మీరాష్ట్రం నాజేబులో ఉంటేనా
ఒక్కదెబ్బతో మీకిచ్చేవాణ్ణికానా ?
పోనీ మీ నాయకులైనా నాజేబులోఉంటే
ఫరవాలేదు — కాని అదీకుదరదంటుంటే...

ఊరుకున్నవారు ఊరుకోక మీ స్వాములారు
ఈ సత్యాగ్రహా లెందుకు మొదలుపెట్టారు ?
నన్ని బ్బంది పెట్టటానికి కాకపోతే ?
ఆయన దేంపోయింది రాష్ట్రంలేకపోతే ?

ఆంధ్రులు ముఖ్యంగా ఒకటిగమనించాల్సివుంది ;
ప్రపంచస్థితి మహా విషమించిపోయింది.

రష్యాలోశాంతి యుద్ధం, కొరియాలో యుద్ధశాంతి,
ఎటుచూసినాభయభ్రాంతి, నామనస్సులోఅశాంతి.

ఇవన్నీ చక్కపడగానే రాష్ట్రం ఇచ్చేస్తాను.
ఈలోగామటుకు తొందరచేస్తే ఊరుకోను.
రాష్ట్రంఇస్తే కమ్యూనిస్టులుపై కొస్తారనేభయం
నాకెన్నడూ లేదనిఇస్తున్నాను అభయం.

నిజానికి మార్క్సిజానికి కాలదోషంపట్టిందని
నేను ప్రధానినైనప్పుడే డిస్కవర్ చేశాకాని
మొన్నటిదాకా ఎందుకు చెప్పలేదంటే —
పోనీగదాఅని ఊరుకున్నాను — అంతే.

ఎక్కడో రష్యాలోను, చైనాలోను,
తెలంగాణాలో కొన్నిప్రాంతాల్లోను
తప్పిస్తే, నాకు సంబంధించినంతవరకు
మార్క్సిజంలో ఎంతమాత్రం లేదుసరుకు.

సవ్యసాచి :—

మీరుప్రధానికాగానేమిమ్మల్ని డిస్కవర్ చేశాం.
ఎందుకు చెప్పలేదంటె పోనిఅని ఊరుకున్నాం.
మీమాటలకి పట్టకముందే కాలదోషం
మా రాష్ట్రంమాకిచ్చివేస్తే సంతోషం.

—సవ్యసాచి.

అయితే ఈలోగా నష్టమయ్యేది ప్రజల సొత్తు.

ప్రజా-సోషలిస్టుపార్టీ

ప్రజాపార్టీ సోషలిస్టుపార్టీలో లీనమైపోడానికి ఉభయపార్టీల నాయకులూ ఒక అంగీకారానికొచ్చారు ఇలా కలిసిన పార్టీకి మొదట సోషలిస్టు-ప్రజాపార్టీ అని పేరు పెట్టాలనుకున్నారు. ఇప్పుడు ప్రజాసోషలిస్టుపార్టీ అనిపేరు పెట్టుకున్నారు తాత్కాలికంగా. ముందు జరగబోయే సమిష్టి సమావేశంలో స్థిరంగా ఏ పేరు పెట్టుకోవాలో నిర్ధారణజేస్తారట. సోషలిస్టు పార్టీ ఉన్నట్టుండి ప్రజలమధ్యకి దూకిందనో, లేదా ప్రజాపార్టీకి సోషలిస్టు తత్వం అబ్బిందనో అనుకోవాలి కాబోలు ఈ మార్పులో. ఈరెండుపార్టీల కలయికవల్లనూ దేశంలో నూతన రాజకీయచైతన్యం చెలరేగుతుందని సోషలిస్టుపార్టీ కార్యదర్శి అశోకమెహతాగారన్నారు. రాజకీయ విషయకమైన నిద్రకొత్తగా ప్రజలకి అబ్బుతుందన్నారు. కొందరు మాత్రం ప్రజాపార్టీ కాళ్లుచాపేసింది అనీ, అలాటి చెడ్డపేరు రాకుండా కాపాడుకోడానికి సోషలిస్టుపార్టీతో చేరిందనీ అన్నారు (ఒక బాంకుదివాలాకి వొస్తే ఇంకో బాంకులోలీనమైపోయినట్టు) అసలు ఈ పార్టీలలో సత్తాలేదనీ, ఇప్పుడు రెండుపార్టీల నాయకులూ కలిసినందువల్ల అసలే ఖంగాళీగా ఉన్న నాయకవర్గం బలగం పెరిగితే మరింత ఖంగాళీ కావడం తప్ప భారతరాజకీయాల్లో కొత్త ఉద్యమం ఏదీ రాబోదనీ మాంచెస్టర్ గార్డియన్ వ్యాఖ్యానించింది.

(8-వ పేజీ చూడండి)

కాలక్షేపం :

వంకాయ...

"వంకాయవంటి కూరయు
పంకజముఖిసీతవంటి భామామణియున్
శంకరునివంటి దైవము
లంకాపతి వైరివంటి రాజునుగలడే"

కాలము మారినట్లుగానే ప్రజల అభిరుచులు కూడా తదనుగుణంగా మారుతూ ఉంటాయి. కాని, యీ అభిరుచులు విధిగా మారవలెననే సృష్టినియమం ఏమీ లేదు. ఆ మాటకు వస్తే మతి స్థిరములేకుండా "ప్రొద్దొక సింగారముతో ముద్దియ చనుదెంచె" నన్నట్లుగా ప్రవర్తించేది నవనాగరిక విలాసవిహారియైన మానవుడేగాని తదితర జీవజాలములు కావు. ఫ్యాషనులు మారిన విధంగానే పాకములు కూడా మారుతూ ఉంటాయి. ఈవిధంగా మారుతూ ఉండడమే ఒక ఫ్యాషనుగా ఉంది. కాఫీహోటల్సులో చూడండి. రోజుకొక స్పెషలు పాకము, స్పెషలు పిండివంట, తయారుచేసి భోక్తలైన ఖాతాదార్లకు కాఫీహోటలు అంటే విసువు పుట్టకుండా, మీదు మిక్కిలి రోజుకొక మోజు కలిగేటట్లు చేయడం హోటలు ఆసాముల వ్యాపార ధర్మం. ఏ జీవిత వ్యాపారంలోనైనా నిరంతర క్రమవికాసం, పోటీవల్లనే ఏర్పడగలదని ఆధునికార్థిక సిద్ధాంతం. హోటలు వ్యాపారంలో కూడా పోటాపోటీలు ఉంటాయి. అది సహజమే. కాని, భోజనశాలల వ్యాపారంగాని, ఫలాహారమందిరముల వ్యాపారంగాని వృద్ధిలోకి రావాలంటే భోక్తలసంఖ్య వృద్ధి కావాలి. భోక్తలసంఖ్య వృద్ధఅయితే చాలదు. ఒక్కొక్క భోక్తయొక్క భోజనశక్తి కూడా వృద్ధికావాలి. జీర్ణశక్తి వృద్ధి అయినా, కాకపోయినా, జిహ్వాచాపల్యమైనా వృద్ధికావాలి. అందుచేత భోక్తల జిహ్వాభిరుచికి ఉద్దీపన కలుగజేసే,

"ధారాళమైన వంటలు
నోరూరగ వండబడును నూనెతో
సుమతీ!"

అన్నట్లుగా అనేక రకములైన పిండివంటలు, అంతర్జాతీయ పచనాప్రావీణ్య ప్రదర్శనంలాగున నేటి కాఫీహోటల్సులో వృద్ధిపొంది, సర్వేంద్రియ నిగ్రహులైన వారినికూడా ఆకర్షిస్తున్నాయి. తాము ఆకర్షించిన జనుల మూలంగా అపార వ్యాపారలాభాలను ఆసాములు గడిస్తున్నారు. ఒక రోజున మైసూరుపాకం, మరొకరోజున మంగుళూరు వడ, ఇంకో రోజున కాశీహల్వా లేదా కాంచీపురం ఇడ్లీ, అటుపిమ్మట బొంబాయి జిలేబీ యీవిధంగా, ఏడువారాల సొమ్ములు అన్నట్లుగా, అనేక ప్రాంతాల ప్రసిద్ధ పాకవిశేషములను తయారుచేసి ప్రదర్శిస్తూ ఉన్నారు. ఒక్కొక్క రాష్ట్రం ఒక్కొక్క పిండివంటవల్ల ప్రసిద్ధిలోకి వస్తోంది; ఎన్నిరాష్ట్రాలకైనా యీ విధముగు ప్రసిద్ధి ఆయా పిండివంటల మూలంగా వస్తోంది. కాని, ఆంధ్రరాష్ట్రానికి మాత్రము తగినంత ప్రసిద్ధి ఏ ప్రత్యేక పాకాభిమానమువల్లనూ రాలేదు - రాలేదు అనడంకంటె రానివ్వడంలేదు అనడం మేలు. అరవఅయ్యర్ సోదరులు తమ కాఫీహోటళ్ళయందు "విజయవాడ వడ" అని గాని, "కడపగారె" అని గాని, "బందరు పకోడీ" అనిగాని, "గుంటూరు చట్నీ" అనిగాని ఏదైనా ఒకటి వ్యాప్తిలోనికి తెచ్చారా అని చూస్తే, యింతవరకూ ఏ అరవ హోటలుయందున్నూ అటువంటి పని చేయలేదు. ఇటువంటి విషయాలు తరచి చూచినట్లయితే ఆంధ్రులహృదయం ఒక్కొక్కప్పుడు తరుక్కొనిపోతుంది. నిజమే. కాని, ఆంధ్రులకు జరుగుచున్న అనేకఅన్యాయాలలోను అపచారాలలోను ఇది కూడా ఒకవంచన అని ఎంచుకొని తలవంచుకొని ఇంచుక ఓర్పు వహించాలి. అంతకంటె ప్రస్తుతం గత్యంతరం కన్పించదు. కాకపోతే, యిక సత్యాగ్రహం చెయ్యాలి. అంటే నిరశనదీక్షావ్రతం సాగించాలి. అంటే ఏమిటి? అరవ కాఫీ హోటలుమీద కోపంవచ్చి తెనుగువాళ్లు తిండిమాని కడుపు మాడ్చుకొనడం!— ఛీ!

ఇంతకూ చెప్పవచ్చిన దేమిటంటే, ఆంధ్రులకు ఒక అభిమాన పాకంగాని, ఒక ప్రత్యేక అభిరుచిగాని ఏదైనా, ఎప్పుడైనా ఒక స్థిరరూపంలోనికి వచ్చి ప్రసిద్ధమై శిలాశాసనంగా నిర్ణయమైనదా? లేక గ్రంథస్థప్రమాణంగా ఎక్కడైనా కన్పించుచున్నదా? అనే పరిశోధన పండితులూ, పరిశోధకులూ, ఆంధ్రప్రరోభివృద్ధి కాములూ, ఆంధ్రరాష్ట్ర విశ్వాసాభిరాములూ ముఖ్యంగా ఆలోచించవలసిన విషయం. అశ్రద్ధచేసినకొలదీ, కాలహరణంచేసినకొలదీ శ్రీమాన్ రాజగోపాలాచార్యులవారు చెప్పినట్లుగా, ఆంధ్రులకు యింకా చిక్కులు ఎక్కువై, పాకం ముదిరిపోతుంది. ఇప్పటికే ఏ రైలు స్టేషనులో చూచినా అరవపాకం పరిపాటియైపోయింది. సాంబారు అనేది, ఇడ్లీఅనేది అరవ నిఘంటువులోని మాటలయినా, తెనుగు నిఘంటువులోకి ఎక్కవలసివచ్చింది. తెనుగు వారికి కూడా అరవభోజనం అలవాటైపోతే, ఇక వారికి అరవభాష అవలీలగా జీర్ణమైపోతుంది. అదే రాజగోపాలాచారిగారి ఊహకూడా కావచ్చు. అరవతిండికి అలవాటుపడ్డ ఆంధ్రులకు అరవసోదరులను అరవ అమాత్యులను ఎదిరించగల ధైర్యంకూడా ఉండదు. బొడ్డులో చెయ్యివేసి నిలబెట్టి 'ఆంధ్రరాష్ట్రం యిస్తారా యివ్వరా?' అని ధీమాగా అడుగగల జవసత్వాలు కూడా ఉండవు. అందుకే అరవ భోజనం అనేది అరవ కాఫీ హోటల్సు ద్వారా ఆంధ్రులకు అలవాటు చేయబడుచున్న

నాలుగు కుంటలు

కందపద్యము

క్రీ॥ శ॥ 1500 ప్రాంతములో "మల్కిభరాం" అని పిలువబడుచున్న ఇబ్రహీం పాదుషా తెనుగుప్రాంతమును పాలించాడు. అతను పట్టమునకు నాలుగువైపులను నాలుగు కొలనులను (కుంటలను) త్రవ్వించాడు. ఒక్క పద్యంలోనే నాలుగు కుంటల ప్రస్తావన వచ్చేటట్లుగా ఒక పద్యం చెప్పవలసినదని కందుకూరి రుద్రకవిని ఇబ్రహీం ప్రభువు అడిగినాడట-అప్పుడు కందుకూరి రుద్రకవి యీ క్రిందికంద పద్యమును యుక్తిగా చెప్పి ప్రభువును మెప్పించెను-

క॥ ఆకుంటే ఫలవ్రతము
ఈకుంటేలోభితనము
-యెన్నటి కైనన్
మీకుంటే మాకిచ్చుట
మాకుంటె యడుగనేల
-మల్కిభరామా.

తాత్పర్యం :- ఆకు ఉంటేనే ఫలవ్రతు మౌతుంది. ఇవ్వకుంటా ఉంటే ఎన్నటికైనా అది లోభితనమే మీకు ఉంటేనే మాకు యివ్వడం అంటూ ఉంటుంది.

మాకు (అయిశ్వర్యం) ఉంటే (మిమ్మలను) అడగడం ఎందుకు ఓ మల్కిభరామా!

దేమో అని భయం కూడా కలుగుతోంది. ఈ పాకదాస్యంలోనుంచి ఆంధ్రులను ఉద్ధరించడం అవసరమని ఆంధ్రోద్యమ నాయకులు నిజంగా గ్రహించినట్లయితే, ఏ విధమైన తిండీ తినకుండా, ఆంధ్రులకు అన్నహితవు కూడా లేదన్నట్లుగా ప్రవర్తించడం గాని, అన్నహితవు లేకుండా చేయడం గాని ప్రశస్తమూ కాదు—భావ్యమూ కాదు. నిజంగా ఆంధ్రుల విశిష్టాభిరుచులు, ప్రశస్తిలోకి వచ్చి దిగంత విశ్రాంత విఖ్యాతి పొందవలెనంటే, ఆంధ్రుల కొక ప్రత్యేక వ్యక్తిత్వమున్నూ ప్రత్యేక జిహ్వాభిరుచియున్నూ ఉన్నదని చాటించాలి. ఆంధ్రులు అంటే జిహ్వగల జాతి అని నిరూపించాలి. ఆంధ్రులంటే నాలుక లేని జాతి కాదని రాజేంద్రబాబూ మొదలుకొని రాజాజీ వరకు గ్రహించేటట్లు చెయ్యాలి.

కొంతకాలం క్రిందట ఢిల్లీలో రాజాజీగారు గవర్నరు జనరలుగా ఉండినప్పుడు అరవ భోజనం ఎంత అమృతతుల్యమైనదో అచటి గోధుమసీమవాసులకు బోధపరిచారట. నెహ్రూ పండితునకుకూడా "రసము" వంటకములలో రసరాజం అని హర్షించి ఒప్పుకున్నాడట. ఢిల్లీవర్గాలలో "రసము" శిరసావహింపబడిన భోజ్యమైనది. దేశాన్ని పాలించగల, రక్షించగల నిజమైన రసపుత్రులు దక్షిణదేశంలోనే ఉన్నారనిన్నీ ఉద్భవించగలరనిన్నీ నెహ్రూ ప్రధాని కూడా అంగీకరించవలసివచ్చింది. "తమిళ రసమహిమ" అనే గ్రంథం అన్నిభాషలలోను ప్రచురించె ఏర్పాట్లుకూడా త్వరలో జరగవచ్చును.

ఇటువంటి స్థితిలో ఆంధ్రుల వ్యక్తిత్వం అడుగంటిపోవలసినదేనా? ఒకప్పుడు గాంధీమహాత్ముడు, ఆకుకూరల విషయములో పట్టుదలగా సేవాగ్రామమందున్నప్పుడు విమర్శ చేశారు. ఆ సందర్భములో ఆంధ్రులు గోంగూర విషయమై ఆయనకు బోధపరచి దానిమూలంగా కలిగెడి రక్తవృద్ధిని, ధాతువృద్ధిని, వీర్యవృద్ధినిగూర్చి విశదపరచి దాని గుణగణములను కీర్తించి "దశగణమన అధినాయక" అన్నట్లుగా, తను గోంగూర దశగుణసంకీర్తనమే ఆంధ్రజాతీయ కీర్తన యన్నట్లుగా ఆలాపన చేశారు. ఆంధ్రుల యీ విశిష్టాభిరుచి ఉత్కృష్టమని మహాత్ముడభినందించితే చాలు. కాని, ఆవిధంగా ప్రశస్తి వచ్చినట్లయితే, ఆ సేతుహిమాచలము 'ఆంధ్ర గోంగూర' అఖండవ్యాప్తిలోకి వచ్చిఉండేది. కాని, యీ అదృష్టము మనకు అదృష్టమైనది. 1921 సం॥లో ఒకప్పుడు, సన్నని శ్రీకాకుళం రవసెల్లాలు అనగాపొందూరు సన్న నేతవస్త్రములు బెజవాడలో మహాత్మునకు మన ఆంధ్రులు చూపించారు. అంత సన్నని పొందూరు నూలు 100 నెంబరు వరకు ఏ రీతిగా వడుకుచున్నారాయని, మహాత్ముడు విస్మయం పొంది, విజయవాడనుంచి సబర్మతీఆశ్రమానికి వెళ్లి 'యంగు యిండియా' పత్రికలో "బెజవాడ ఖద్దరు" అనే శీర్షికతో ఆంధ్రదేశపు సన్నని చేనూలు చేనేతవస్త్రాలను వేనోళ్ళ కొనియాడుతూ కొండంత వ్యాసం స్వయంగా వ్రాసి ప్రకటించాడు. ఆ ఒక్క వ్యాసంతో ఆంధ్రదేశంనుంచి ఉత్తరహిందూస్థానానికీ మద్రాసుకూ రవాణాఅయిన ఆంధ్ర ఖద్దరువస్త్రాల బేళ్లకు మితి మేర లేదు.

చివరకు పొందూరు చేనూలువస్త్రాలకు బదులుగా పందలపాకమిల్లు నూలుతో చేమగ్గాలపై నేసిన మిల్లునూలు చేనేత వస్త్రాలనే బెజవాడ వ్యాపారస్థులు ఆసేతుహిమాచలం రవాణాచేసి అసలైన ఖద్దరుగా చలామణీ చేశారు. ఈ వ్యాపారంతో "ఆంధ్రా ఖద్దరు" అంటే ఇంటి పేరు "కస్తూరివారు" అన్నట్లయింది.

పూర్వ మొక విశ్వబ్రాహ్మణుడు బంగారు ఉంగరం చేయుటకై ఒకరు తనకిచ్చిన బంగారంలో చాలా భాగం అపహరించి. లోపల లక్క పెట్టి పైన బంగారు రేకు పొదిగి తూకం తగ్గకుండా ఉంగరం చేసి యిచ్చాడు. కొంతకాలానికి పై బంగారు రేకు అరిగిపోయి లోపలి లక్క బయటపడింది. అది లక్క ఉంగరమని తెలిసింది. ఆ కంసాలియే తనవద్ద ఉన్న గేదెను ఆ ఉంగరంచేయించుకొన్న ఆసామీకి అమ్మజూపెను. ఈవిశ్వబ్రాహ్మణుడు లక్క ఉంగరం చేసియిచ్చి మోసగించిన విధంగానే, లక్క గేదెను తనకు అమ్మజూపి మోసగించదలచినాడని సదరు ఆసామీకి గట్టి అనుమానం కలిగి, ఆ గేదె తనకు అక్కరలేదన్నాడు ఆ విధంగానే "ఆంధ్రా ఖద్దరు" అంటే శుద్ధ కల్తీశాల్తీ అని స్పష్టంగా వెల్లడిఅయిన తర్వాత "ఆంధ్రా గోంగూర" మాత్రము కల్తీ సరుకుగా సప్లయి కాగూడదా అనే అనుమానం ఎవరికైనా, ఎంతవానికైనా కలుగుతుంది. ఆంధ్రా గోంగూరవిషయంలో మహాత్ముని ప్రశంసాపత్రము లభించలేదు. గనకనే

"పోడా! గోంగూరా!" అని ఆంధ్రనటకోవిదులు నాగయ్యగారిని ఒక మద్రాసుటోపీదాసు వందేమాతరం ఫిల్ములో తృణీకరించి ధిక్కరించడం జరిగింది.

ఆ మాటకువస్తే, సత్యాగ్రహం మాత్రం స్వచ్ఛంగా కల్తీలేకుండా ఉంటుందా? నిరశన దీక్షలు నికరమైన నిర్జలైకాదశిగా సాగుతున్నాయా? కొందరికి ద్వాదశి పారణంకంటె ఏకాదశిఫలహారం ఎంత మాత్రమూ తీసిపోదు. ఈ నిరశనదీక్షను నిరసించడమే ఆచార్యులవారి అకుంఠిత దీక్షగా ఉంది. అందువల్ల మన "నిరశన" దీక్షకు వారి "నిరసన"దీక్ష పోటీగా ఉంది.

ఇంతకూ చెప్పవచ్చిందేమిటంటే ఆంధ్రులు తమవ్యక్తిత్వమును పైకి తీసికొని వచ్చి, ఆంధ్రు లందరూ ఒక్క అభిరుచి, ఒక్క అభిమతం కలవారై ఒక్క నాలుకతో ఒక్క కంఠంతో ఒక్క పాకంలో ప్రస్తావించి, ఒక్క మాటలో, తమకేది యిష్టమో యింతవరకూ లోకానికి తెలియజెప్పలేదు. పండితనెహ్రూ కూడా యిదే మనలోపం అనిన్నీ ఆంధ్రరాష్ట్రసిద్ధికి అవాంతరమనిన్నీ ఆక్షేపిస్తున్నాడు. కనుక, ఆంధ్రుల అభీష్టం ఏమిటో, ఆంధ్రులందరికీ ఏది యిష్టమో, నిర్దుష్టంగా, నిశ్చయంగా, నిష్కర్షగా, నిర్ధారణగా, నిరాఘాటంగా, వీలైతే నిర్వచనంగా నిరూపించి నిర్దేశించాలి. 'నిర్వచనం'గా అంటే నోటిమాట లేకుండా అని అన్వయించ కూడదు. వచనంలో కాకుండా వీలైతే పద్యంలో కూడా నిరూపించవచ్చు. ఏనాడో కవి చౌడప్ప చెప్పిన అందమైన కందపద్యం చదివితే చాలును. ఆంధ్రులకు ఏది యిష్టమో యిదివరకే స్థిరస్థాయిగా గ్రంథస్థమై యున్నదని ఆధారప్రమాణంగా ప్రధానమంత్రికి చూపిస్తే కవిచౌడప్పవంటి స్వతంత్రకవివాక్యమును, ఆ ప్రజాభిమానకవియొక్క అందమైన కందమును, పండిత నెహ్రూ ఆమోదించక తప్పదు.

వంకాయవంటి కూరయు
పంకజముఖిసీతవంటి భామామణియున్
శంకరునివంటి దైవము
లంకాపతి వైరివంటి రాజునుగలడే?

రాజంటే రాజు శ్రీరామచంద్రమూర్తియే రాజు—శంకరుడంటే భక్తవశంకరుడైన సాటిలేని దైవం. సీతా అమ్మవారివంటి స్త్రీ లేదు. ఆదేవిధంగా వంకాయవంటి కూర లేదు—మాకు శివక్షేత్రాల మధ్య ఉన్న త్రిలింగదేశంలో శివునికి మించిన దేవుడు లేడు. సెబాస్! రామపాదములనే సదా భజించి స్మరించి రామపాదసాగరమును గూర్చియే కలువరిస్తూ ఆస్వప్న సాగరంలో ఉన్న ఆంధ్రులు రామరాజ్యం ఎప్పుడు వస్తుందా అనిన్నీ, సీతాఅమ్మవారిదయవల్లనైనా ఆంధ్రనదీమతల్లులకు కొత్తసేతువులు ఎప్పుడు కట్టబడునా అనిన్నీ ధ్యానం చేస్తూ, అటువంటి రామరాజ్యంకోసం కవిచౌడప్ప కాలంనుంచీ ఆంధ్రులు వ్యక్తపరచిన విషయం ఒక్కటి ఏమిటంటే, వంకాయవంటి కూర వసుధలో లేదు. ఇటువంటి విషయం నిర్వచనంగా కందపద్యంలో నిర్వచిస్తే ఎట్లా ఉంది? ఆంధ్రుల వ్యక్తిత్వం గాని అభీష్టం గాని, చిరశేనంగా, (ఏవిధమైనఅన్నహితవూ ఆంధ్రులకు లేదన్నట్లుగా) నిరూపిస్తే ఎట్లా ఉంది? మనకు హితమైనదేదో ఆ ఒక్క వంకాయనైనా, కూర చేసితిని, ఇతర ఆహారమైనా మానివేయడం మంచిది. వంకాయవంటి కూరను విసర్జిస్తే శంకరునివంటి దైవమును విడనాడినట్లవుతుంది.

అంతమాత్రం చేత శ్రీ వైష్ణవశిఖామణులైన ఆచార్యులవారు మనకు మద్రాసులో ఆస్థానం సనవిస్తారా? సగం మద్రాసుమీది, సగం మద్రాసు మాది అనే అర్ధనారీశ్వరపద్ధతి శైవతత్వం. కాని ఆచార్యులవారు హర్షించే విశిష్టాద్వైతతత్వం కాదు. ఇంతకూ మదరాసు నగరం విషయంలో ఆంధ్రులకు అరవలకూ ఉభయపక్షసమాధానకరపద్ధతి ఏదిన్నీ ఏర్పడలేదు. గనుక, అవిషయంలో



బెల్లూరు చెన్నకేశవాలయంలో శిలా ప్రతిమ
—వెల్లటూరి పూర్ణానంద శర్మగారు గీసిన రేఖాచిత్రం.

కృష్ణానది ప్రాజెక్టులు

(4-వ పేజీ తరువాయి)

ఈ పార్టీల సమ్మేళనంవల్ల దేశంలో కొత్త ఉత్సాహం చైతన్యం కలక్కపోయినా చెన్నరాష్ట్రంలో యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్‌లో మాత్రం కలకలం బయలుదేరింది. ఫ్రంట్ ఎప్పటిమాదిరిగా నే శాసనసభలో వ్యవహరిస్తూ ఉండవచ్చునీ, ఇతర వ్యవహారాల్లో మాత్రం ప్రజాపార్టీవారు సోషలిస్టు పార్టీతో చేరి వ్యవహరించాలనీ మొదట నిర్ణయించుకున్నారు. నిర్ణయం ఇలా జరిగితే ఇందుకు విరుద్ధంగా సోషలిస్టునాయకులు జైప్రకాశ్ నారాయణ్, అశోకమెహతా గార్లు భిన్నంగా ప్రకటనలు చేస్తూవచ్చారు. ఇతర వ్యవహారాల్లో సోషలిస్టులతో చేరి సహకరిస్తూ (అంటే కమ్యూనిస్టుల్ని విరోధులుగా భావించి అని సోషలిస్టు నాయకుల అర్థం) శాసనసభ వ్యవహారాల్లో మాత్రం ప్రజాపార్టీవారు కమ్యూనిస్టులతో చేరడం అసమంజసంగా ఉందన్నారు.

ఇప్పుడీ ఇతర వ్యవహారాలంటే ముఖ్యంగా మున్సిపల్ ఎన్నికలని చెప్పుకోవచ్చు. ఈ ఎన్నికల్లో ఒకవంక కమ్యూనిస్టుల్ని దుమ్మెత్తిపోసి ఎదిరించవలసిన అగత్యం ఉండగా శాసనసభలో ప్రజాపార్టీవారు కమ్యూనిస్టులతో చేరి ఒక మాటమీద నిలబడ్డం పనికి రాదని సోషలిస్టుల వాదం.

దీనితో ఫ్రంట్‌నూట ఎలా ఉన్నప్పటికీ, ప్రజాపార్టీకి ముప్పు సంభవించేలా కనపడుతోంది. మద్రాసు శాసనసభలో బొత్తిగా సుప్రెమసీ కూడా లేని సోషలిస్టుల్ని అంటిపెట్టుకుంటే అంతకి మరొక సుప్రెమసీ మాత్రమే ఉన్న ప్రజాపార్టీకి ఏమాత్రం లబ్ధి ఉండదు సరికదా ఇప్పుడున్న పలుకుబడీ బలం కూడా ఉండవు. అందువల్ల మద్రాసు ప్రజాపార్టీలో అభిప్రాయ భేదాలు సంభవిస్తున్నాయి. కొందరు ప్రజాసోషలిస్టుపార్టీని వొదిలేసైనాసరే మద్రాసులో ప్రజాపార్టీ స్వతంత్రంగా వ్యవహరిస్తూ ఫ్రంట్‌ను నిలబెట్టుకోవా లంటున్నారు. కొందరు ఫ్రంట్‌ను విడగొట్టి ప్రజాసోషలిస్టుపార్టీని బలపర్చాలంటున్నారు. కొందరు ప్రజాపార్టీనుంచి విడిపోయి ఇతర పార్టీలతో అనగా కాంగ్రెస్, కృషికార్‌లోక్ పార్టీ, తమిళ్నాడు టాయిలర్స్ పార్టీ మొదలైన వానితో చేరిపోవాలని చూస్తున్నారు. మొత్తానికి మద్రాసు ప్రజాపార్టీ ఛిన్నాభిన్నాలైపోయే పరిస్థితి వచ్చింది. అందరి ఆదర గౌరవాల్నీ విశ్వాసాన్నీ పొందిన నాయకులు ప్రకాశం విశ్వనాథంగార్లు ఈ పరిస్థితిలో ఏం చెయ్యగలరో తెలియదు. వీరి నాయకత్వం తిరిగి కాంగ్రెస్‌కు లభించినా లేదా సోషలిస్టు పార్టీకి లభ్యమైనా ఆ పార్టీల బలమూ దేశంలో పలుకుబడీ హెచ్చుగలదు. అయితే ఇంతవరకూ కమ్యూనిస్టుల పరిపూర్ణ సహకారాన్నీ విశ్వాసాన్నీ పొందివున్న ఈ నాయకులు ఫ్రంట్ విచ్ఛేదనకు సమ్మతించడం కష్టమని తోచకమానదు.

[12-9-52]

ఇద్దరుకుర్రాళ్లు రోడ్డుమీద కలిశారు.

“ఒరేసోమూ. నీకు తెలుసా, మన వాసు ఇందాక సైకిల్ తొక్కుతూ పడ్డాడట. మోకాళ్లు పగిలాయిట, ఆస్పత్రికి తీసుకెళ్లారు.”

“అరెరె పాపం. కిందపడ్డప్పుడు బట్టలుకూడా మాసిపోయివుంటాయి.”

ఉభయులూ ఒకమాటకు వచ్చి తాంబూలాలు పుచ్చుకుంటేనే తప్ప ఆంధ్రరాష్ట్ర నిర్మాణ ముహూర్త నిర్ణయం చేయుటకు వీలు లేదని పండిత నెహ్రూ ప్రధాని స్పష్టంగా సమాధాన మిస్తున్నాడు. మద్రాసు నగర సమస్యనూ, పరిహద్దుల సమస్యనూ ఒక వంకగా పెట్టుకొని హద్దులేని వాయిదాను ఆ పెద్దలందరూ వేస్తున్నారని ఆంధ్రులకు బోధపడింది. ఆంధ్రరాష్ట్ర నిర్మాణ నిరాకరణమునకు అది ఒక వంక అయింది. “మద్రాసు నగరసమస్య ఒక వంకాయె” అని స్పష్టమైంది. ఈవిధంగా కొన్ని వంకలు పెట్టి రాజ్యాంగతంత్రం సాగించడం నేటి కాంగ్రెసు మంత్రివర్గపు పద్ధతిఅయినట్లయితే, ఇదంతా ఒక “వంకాయె” తంత్రమని ఆంధ్రులకు కరతలవార్తాకం కాగలదు. ఈ“వంకాయె”పాకం బాగాఉన్నదని ఆసేతు హిమాచలం కాంగ్రెసు అమాత్యులతో సహా ఆమోదిస్తే ఆ విధంగానైనా కవిచౌడప్ప వ్రాసిన కంద పద్యానికి అందెవేసినట్లవుతుంది. ★

సీరియల్ నవల

రెండు మహానగరాలు

చార్లెస్ డికెన్స్

34

లండన్‌నుంచి పారిస్‌కు బయలుదేరిన డార్నే, త్రోవపొడుగునా యెన్నో యిబ్బంది సబ్బందులు పడతూనే వున్నాడు. కాని ఫ్రాన్సులో అడుగుబెట్టిన తదాదీ, ప్రయాణం మరింత దుర్భటంగావుంది. ఫ్రెంచిరాజు యిప్పుడు పదభ్రష్టుడై వున్నాడనుకోండి; ఆయన సింహాసనంమీద వెలుగుతున్న రోజుల్లో కూడా, ఆ రోడ్లూ, ఆ ప్రయాణ సౌకర్యాలూ అంతకంటే, ఉద్ధరింపుగా వున్నది కూడా లేదు, కాకపోతే యిప్పుడు మరి కొన్ని కొత్త చిక్కులు చుట్టుకున్నయ్. ప్రతి పట్నం మొగిలోనూ, పల్లెటూరి మొగిలోనూ కూడా, నాటు తుపాకులు బుజాన బెట్టుకుని, కొంతమంది దేశభక్తులు నిల్చునుంటారు. అలా నిల్చుని, వచ్చేపోయే బాటసారుల నందర్నీ నిలవేసి వాళ్ల పుట్టు పూర్వోత్తరాలన్నీ భోగట్టా చేస్తారు. ప్యాసుపోర్టులు తనిఖీచేస్తారు. వాళ్ల చిత్తం వచ్చినట్టు వెనక్కు పంపేసే వాళ్ళను వెనక్కు పంపేస్తారు; ముందుకు పంపవలసిన వాళ్ళని ముందుకు పంపుతారు; అరెస్టు చేసేవాళ్లను అరెస్టు చేస్తారు—స్వాతంత్ర్య శాంతి సౌభ్రాతృత్వముల ప్రతిరూపమైన ప్రజాస్వామిక రిపబ్లిక్ పేరిట యిదంతా జరుగుతోంది.

ఫ్రెంచి తీరాన అడుగుబెట్టి నాలుగైదుమైళ్ళు ముందుకు సాగాడో లేదో, డార్నేకు అశంక తోచిపోయింది. పారిస్ నగరంలో నిజాయితీగల పౌరుడుగా యోగ్యతాపత్రం సంపాదించితేనే తప్ప, తిరిగి యీ కష్టాంతరములు గడిచి వెనక్కు యింగ్లండుకు వెళ్లిపోయే ఆస్కారం లేదని తెలుసుకున్నాడు. ఏది యేమైనా, ఎన్ని యిడుములైనా పడి పారిస్‌కు జేరుకోవటం తక్షణ కర్తవ్యం. ఒకొక్క నగరం దాటటమంటే ఒకొక్క నరకద్వారాన్ని దాటటం. ఒకొకొక్క గ్రామాన్ని గడవటమంటే, ఒకొక్క కత్తుల బోనులోనుంచి బయటపడటం. ఇలా అవస్థలు పడుతూ, ఒకనాటి సాయంత్రానికి బాగా అలసిపోయి, ఒక గ్రామంలోని సత్రంలో పడుకుని నిద్రపోతున్నాడు. ఆనిద్రపోతున్న వాణ్ని, అర్ధరాత్రి సమయంలో నాటుతుపాకులు పుచ్చుకున్న ఒక ముగ్గురు దేశభక్తులూ, కటిక పిరికిజంతువైన ఒక స్థానికాధికారీ వచ్చి నిద్రలేపారు.

యెర్ర టోపీలు పెట్టుకున్న ఆ దేశభక్తులు ముగ్గురూ, చుట్టలు నోట్లో బెట్టుకుని కొలిమి తిత్తుల్లా పొగ వదులుతున్నారు. ఈ నిద్ర లేపటాలూ, ఈ దేశభక్తుల తుపాకులూ, ఈ హంగామాలూ త్రోవపొడుగునా అనుభవిస్తూ వచ్చిన బాదరబందియే గనక, డార్నే వాళ్ళను చూసి పెద్దగాబరా పడ్డదేమీ లేదు. కాకపోతే ఆ దేశభక్తులు ముగ్గురూ మొరటుతనంగా తను నిద్రపోతున్న పక్కమీద కూర్చుని ధూమాలు వదులుతూవుండటం కొంచెం చికాకనిపించింది.

'ఏయ్! పరారీ!—నిన్ను పారిస్‌కు పంపటానికి యేర్పాటు చేశాను—సైనిక నిఘాలో' అన్నాడు అధికారి;

'కృతజ్ఞుణ్ని! పారిస్ పంపటంకంటే, నాకు మరో సహాయమేమీ అక్కర్లేదు—సైనిక నిఘా కూడా అక్కర్లేదు'—అన్నాడు డార్నే!

యెర్రటోపీ దేశభక్తుడు తుపాకి మడమతో ఆవేశంగా పక్కమీద ఒక మోదు మోది:

'నోరుముయ్ భూర్జువా!' అన్నాడు.

'సహృదయుడైన ఆదేశభక్తుడు చెబుతున్న మాటనిజమేలెండి—మీరు పాలకవర్గానికి చెందిన గొప్పవారు గనక సైనిక నిఘా వుండితీరాలి—మీ వెంటపంపుతున్న ఆ సైనికులకు ఖర్చుకరామతులు యేమవుతాయో అవి మీరు ఇచ్చుకోవలసి వస్తుంది' అన్నాడు, స్థానికాధికారి.

'సరే! ఇందులో నా యిష్టానిష్టాలకు తావేముంది?'—

'ఇష్టం!—వింటున్నారుటోయ్! చింతచచ్చినా పులుపు చావదు!—లాంతరు స్తంభానికి వ్రేలాడగట్టి ఉరిదీయకుండా రక్షించాం—అక్కడికి సంతోషించడేం?'

'అవును దేశభక్తుడు చెప్పేమాట నిజమే!—లేచి గుడ్డా గుడసూ సర్దుకుని బయలుదేరు.'

డార్నే లేచి బయలుదేరాడు. మొట్టమొదట అతన్ని ప్రజాసైనిక కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ యెర్రటోపీ దేశభక్తులు మరికొంతమంది కూర్చుని చుట్టలు గాలుస్తున్నారు. మరికొంతమంది తాగుతున్నారు. ఇంకా కొంతమంది గోడలకు చారబడి కునికిపాట్లు తీస్తున్నారు. డార్నే, తన వెంట పంపబడుతున్న సైనికుల ఖర్చులక్రింద ఒక పెద్దమొత్తాన్ని జమకట్టాడు. అక్కడినుంచి, ఆతెల్లవారిఝాము మూడుగంటలకే సైనిక నిఘాలో బయలుదేరాడు. మంచుతో తడిసినరోడ్డు. చలీ, యీదురు.

అతని వెంట యిద్దరు ప్రజాసైనికులను పంపారు. డార్నేను గుర్రంమీద యెక్కించారు. ఆ యిద్దరూ కూడా చెరో గుర్రమూ యెక్కి చెరో ప్రక్కనూ స్వారీచేస్తున్నారు. డార్నే స్వారీ చేస్తున్న గుర్రం కళ్లెపు తాళ్లు వాళ్లలో ఒకడు తన నడుంచుట్టూ చుట్టుకున్నాడు. వాళ్ళిద్దరిదగ్గిరా చెరో నాటు తుపాకీ, చెరో బాకూ వున్నయ్. సన్నగా తుపరకూడా పట్టుకుంది. వాన చినుకులు గుండుసూదుల్లా మొహంలో గుచ్చుకుంటున్నయ్.

ఈ ప్రకారం, గతుకుడు రోడ్ల వెంటబడి మైళ్ళ తరబడి ప్రయాణంచేస్తున్నారు. రాత్రి తెల్లవార్లూ ప్రయాణం చేయటం, ఉదయంపూట, ఒక అరగంటసేపుమాత్రం ఎక్కడో ఒక చెట్టు

అనువాదం: తెన్నేటి సూరి

త్యాగరాజు త్యాగరాజే

త్యాగరాజులవారు అనేక రాగాలలో అనేక కృతులు చెప్పారు ఒక్కొక్క రాగంలోనే అనేకకృతులు చెప్పారు ఆనందభైరవి రాగం చాలా ప్రధానమైన ప్రసిద్ధమైన ప్రముఖ రాగం - అయినప్పటికీ యీ ఆ ఆనందభైరవి రాగంలో త్యాగరాజులవారు చెప్పిన కృతులు మూడు మాత్రమేఉన్నాయి.

1. క్షీరసాగరవిహార! అపరిమితఘోర పాతకవిదార!

అనే కృతియున్నూ—

2. రామ! రామ! నీవారముగామా! రామ! రామ! సీతారామ!

అనే కృతియున్నూ—

3. నీకే తెలియకబోతే నేనేమిసేయుదురా? అనే కృతియున్నూ -

మాత్రమే ఆనందభైరవి రాగంలో ఆయన రచించారు. ఇందుకు ఒక కారణం ఉన్నదట. త్రిభువనం స్వామినాథయ్యరుగారు ఆకాలంలో త్యాగరాజులవారు నివసించుచుండిన తిరువయ్యారులో వీధిభాగవత నాటకప్రదర్శనములలో వేషాలువేస్తూఉండేవారు. ఒకరాత్రి ఆవీధినాటకం చూడడానికి త్యాగరాజులవారు వెళ్లారు. "మధురానగరిలో చల్లలమ్మబోవ" దారి విడువు కృష్ణా అనే కీర్తన స్వామినాథయ్యరుగారు ఆనందభైరవి రాగంలో మనోహరంగా పాడినప్పుడు త్యాగరాజులవారు ఆనందపరవశులై స్వామినాథయ్యరుగారిని చాలా మెచ్చుకొన్నారు.

అప్పుడు స్వామినాథయ్యరుగారు త్యాగరాజులవారివద్దకువచ్చి ఆ కీర్తన ఆనందభైరవి రాగంలో తాము రచించినదే అని చెప్పిరి. తన కీర్తనకంటె ఎక్కువ మధురమైన కృతులను త్యాగరాజులవారు రచించగలరు గనుక, అట్టి త్యాగరాయకృతులవల్ల తన కీర్తన మరుగుపడి పోయి, అప్రశస్తమై, తన ఊరుపేరు లేకుండా పోతుందిఅనే భయంతో, "ఆనందభైరవిరాగంలో మీరు కృతులుచెప్పవద్దు. ఆరాగంలో ఇక కృతులు చెప్పను అని మీరు నాకు అభయ హస్తం యివ్వాలి" అని త్యాగరాజులవారిని త్రిభువనం స్వామినాథయ్యరుగారు కోరినారట. అందుకు త్యాగరాజులవారు సమ్మతించి ఆ అయ్యరుగారి కోరికను యీడేర్పుటకై ఆనంద భైరవిలో కృతులిక చెప్పనని ఒప్పందంచేసి, ఆనందభైరవిరాగ విషయంలో విరాగియై తన త్యాగ బుద్ధిని చూపించి త్యాగరాజు త్యాగ రాజ్ అని ఋజువుచేశారు.

క్రింద మకాంచేసి విశ్రాంతి తీసుకోవటం, తిరిగి మళ్లీ బయలుదేరటం: ఆ యిద్దరు దేశభక్తులకూ ఒంటినిండా దుస్తులు కూడా లేవు; చలిబాధ భరించలేక పిక్కలకూ, పాదాలకూ ఎండు గడ్డి చుట్టుకున్నారు. వర్షానికి తడవకుండా వుండటానికి నెత్తిమీద నుంచికూడా గడ్డిమార్లు దించారు. ఆ రెండు అవతారాల మధ్యా అలా ప్రయాణం చెయ్యటం డార్నేకు యెంతో గిజాటుగా వుంది. ఈ గిజాటు ఇలా వుండగా ఆ దేశభక్తుల్లో ఒకడు విధీ విరామం లేకుండా తప్పదాగి ఒళ్లు తెలియకుండా వుంటున్నాడు. తన చేతిలోవున్న తుపాకిని బేఫర్వాగా జారవేసి బుజానికి తగిలించాడు. దాని సన్నిమైన యేక్షణానికొక్షణం డార్నే కణత మీద పొడుచుకోవటానికి సిద్ధమౌతోంది. ఇలాంటి నిఘాలో వుంచినా, ఆదిలో డార్నే మరేమంత భయపడలేదు; ఇదంతా యేదో మామూలుగా జరుగుతున్న తతంగమే గాబోలు ననుకున్నాడు.

కాని, బీవాయ్ నగరం చేరేసరికి తాను విషమ పరిస్థితులలో వున్నట్టు తెలుసుకున్నాడు. బీవాయ్‌లో అడుగు బెట్టేసరికి ప్రొద్దు పడమటి దిరిగిపోయింది. సాయంత్రసమయం వీధుల నిండా జనం తండోపతండాలుగా వున్నారు. అంతా అల్లకల్లోలంగా వుంది.

ఈ మూడు గుర్రాలూ ఆ నగరంలో వున్న సైనికకేంద్రం ముందు ఆగగానే 'పరారీదార్లు నశించాలి!' అని అరుచుకుంటూ జనం చుట్టేశారు. డార్నేను గుర్రంమీదనుంచి క్రిందికి పడలాగెయ్యటానికి సిద్ధమయ్యారు. కాని, డార్నే, కాళ్లు అంకాలలో గట్టిగా పంబదన్ని పడిపోకుండా నిభాయించుకున్నాడు.

కళవళపడుతున్న గొంతును కూడదీసుకుని:

'మీరు పొరపాటు పడుతున్నారు—నేను పరారీదారును కాదు—నా అంతటికి నేను యిక్కడికి వచ్చాను—ఈ విషయం ఆలోచించండి'—

'పరారీకుక్క!' అంటూ గావుకేకబెట్టి, చేతిలో వున్న సుత్తి ఆకాశంలోకి యెత్తి జనంలోనుంచి ముందుకు తోసుకొచ్చాడు, ఒక ప్రబుద్ధుడు: 'బూర్జువా లుచ్ఛావి!'

'సరే ఆగండి!—తొందరపడకండి!' అంటూ ఆ సైనిక కేంద్రానికి సంబంధించిన ఒక అధికారి ఆ మనిషిని అడ్డం తగిలాడు: 'పారిస్‌లో విచారిస్తారుగా' అన్నాడు.

'ప్రజాద్రోహి!'—అంటూ మరో కేక వినిపించింది.

'మీరు పారబడుతున్నారు—నేను ప్రజాద్రోహిని కాను' అని నసిగాడు డార్నె :

'ద్రోహివా?—మరేనా?—కొత్త శాసనంమాట అబ్బాయి కింకా తెలీదు గాబోలు :'

చుట్టూవున్న జనం కళ్ళలో తుపాను రేగటం సైనికాధికారి పసికట్టి, డార్నె కూర్చున్న గుర్రాన్ని కళ్ళాలు బుచ్చుకుని జర జరా ప్రక్కనున్న గుర్రాల దొడ్లోకి యీడ్చుకుపోయాడు. డార్నెతో వచ్చిన సైనికు లిద్దరూకూడా గుర్రాల్ని లోపలికి పోనిచ్చారు. మూడు గుర్రాలూ లోపలికి రాగానే, జనం లోపలికి తోసుకురాకుండా ఆ అధికారి గేటు మూసేశాడు.

చేతిలోవున్న సుత్తితో గేటుమీద కచ్చకొద్దీ ఒక దెబ్బ వేసి, ఆవ్యక్తి తక్కిన జనాన్నంతా తీసుకొని కేకలు బెట్టుకుంటూ అవతలికి వెళ్ళిపోయాడు.

ప్రాణాలు దక్కి దొడ్లోకి రాగానే, డార్నె గుర్రాన్ని దిగి ఆ అధికారికి కృతజ్ఞతను తెలియజేశాడు : 'ఆ కమ్మరిబత్తుడు చెబుతున్న క్రొత్తశాసనం యేమిటండీ?' అని అడిగాడు.

'పరారీదార్ల ఆస్తులు వేలం వెయ్యటానికి యీమధ్య ఒక శాసనం చేశారుటెండీ.'

'ఎప్పుడూ?'—

'మొన్న 14 వ తారీఖున'—

'అయితే సరిగా నేను యింగ్లండులో బయలుదేరిన నాడే నన్నమాట!'—

'ఇలాంటి శాసనాలు యింకా చాలా చేశారని అంతా అంటున్నారు. ముందుముందు అవసరమైతే యింకా కొన్ని చేస్తారుట కూడా. దేశం విడిచి పారిపోయిన పరారీదార్లందరికీ దేశ బహిష్కరణశిక్ష విధించుతున్నారు. అనవా మళ్ళీ యెవరేనా తిరిగొస్తే ఉరిశిక్ష వేస్తారు—అదీ ఆ కమ్మరి చెప్పిన కొత్తశాసనం.'

'అలా జరుగుతున్నాయా'—

'జరుగుతున్నాయో లేవో—జరుగుతూనే వుండొచ్చు—యివాళ కాకపోతే రేవు జరగొచ్చు; ఏమిటి యిందులో పెద్ద?—సరే! మీరు యీ రాత్రికి యిక్కడ పడుకుని నిద్రపోండి' అని చెప్పి చక్కాబోయాడు.


డార్నె, అతని సహచరులు ఆ గడ్డిమేటాములమీద పక్కలు బరిచారు. బాగా ప్రయాణ బడలికతో వున్నారేమో, అర్ధరాత్రి వరకూ గుర్రుగొట్టి నిద్రపోయారు. అనంతరం ఆ అర్ధరాత్రివేళే లేచి మళ్ళా ప్రయాణం కట్టారు. వాళ్ళు బయలుదేరింది లగాయతు కంటి నిండా నిద్రపోయింది ఆకాసేపే. త్రోవ పొడుగునా డార్నెకు ఒక విపరీతమైన పరిస్థితి కనుపించింది. దేశానికి వచ్చిన అన్ని కొత్త మార్పుల సంగతీ అలా వుండగా, జానికి నిద్రకూడా లేకుండా పోయినట్టు తోచింది. పాపం వీళ్ళు ముగ్గురూ పగల్లా చచ్చి చెడి ప్రయాణంచేసి సాయంత్రానికల్లా యే గ్రామానికో చేరుకుంటారు. ఆ అర్ధరాత్రి వేళకూడా, ఆ వూరిజనం నిద్రా నిప్పులూ లేకుండా కొరివిదయ్యాల్లా కాగడాలు ముట్టించుకుని మేలుకునే వుంటారు. ఒకళ్ళచేతు లొకళ్లు పట్టుకుని యే చెట్టు చుట్టూనో తిరుగుతూ స్వాతంత్ర్యగీతాలు పాడుతూ వుంటారు. అదృష్టవశాత్తూ, ఈ ముగ్గురికీ, బీవాయ్‌లోమాత్రం కాసేపు కునుకు తీసే ఆస్కారం కలిగింది.

ఇలా ప్రయాణంచేసి ఒకనాటి ఉదయానికల్లా పారిస్ నగరం చేరుకున్నారు. పారిస్ నగరద్వారం దగ్గిర కట్టుదిట్టంగా

(53-వ పేజీ చూడండి)

ఎదురుప్రశ్న

తెల్లవారగానే రామం అరుగుమీదలేచి కూర్చున్నాడు. బొబ్బర్లంకపోయే స్టీమరు ప్రొద్దున్న ఏడుగంటలకి బయలు దేరుతుంది. నిన్న సాయంత్రం అందు కుందామనుకున్న స్టీమరు, గైలు ఆలస్యం వల్ల దాటిపోయింది. ఈ స్టీమరైనా అందుకోవాలని రామం లేచి, ఒంటిని ఉన్న దుమ్ము ధూళి దులుపుకుని, పంట్లాము మోకాలుదాకా యధాప్రకారం మడత పెట్టుకుని, చేతిలో గోడుగు త్రిప్పుకుంటూ గోదావరి ఒడ్డుకు బయలుదేరాడు.



రామం తన 14 ఏండ్ల జీవితంలో రాజ మండ్రి రావడం అదే మొదటిసారి. నిన్న సాయంత్రం స్టీమరు దాటిపోయాక, 'వెంక ట్రామయ్య బాబయ్య, సత్తెమ్మత్తయ్య, యీ వూళ్లో వుండాలే' అనుకున్నాడు. ఈరాత్రి బాబయ్యగారి యిల్లు కనిపిస్తే అక్కడఉండి పోదామని ఊరంతా గాలిం చాడు. బాబయ్య పూర్తి ఎడ్రసు తెలి యక, కనిపించిన ప్రతీవాణ్ణి అడిగాడు 'ఫలానా వెంకట్రామయ్యగారు ఎక్కడ ఉంటారో తెలుసా' అని. అంత పట్న వాసంలో ఒక మనిషిగురించి ఎవరు చెప్ప గలరు? చివరికి బాబయ్యగారి యిల్లు కని పించక, రాత్రి హోటల్లో భోంచేసి, ఒక సినిమా చూసి, కనిపించిన ఒక వీధి అరు గుపైన పడుకున్నాడు.

'ఎవరు నువ్వు?' అన్నారు వెంకట్రామయ్యగారు.

'బాబయ్య ఇంక ఎలాగా కనిపించడు' అని నిరాశచేసుకుని, స్టీమరు అందుకో డానికి చకచకా గోదావరిగట్టు చేరు కున్నాడు రామం. స్టీమరువైపు నడిచి వెడుతూంటే ఆ ప్రక్కనున్న స్నానాల రేవులో తన బాబయ్యలా ఎవరో కనిపించారు. రామం ఒకసారి తేరిపార చూశాడు. 'ఇంకెవరు! బాబయ్యే!' అని ఆనందంతో లోలోపల పొంగిపోయాడు.

వెంకట్రామయ్యగారు గోదావరిలో స్నానంచేస్తూ సంధ్యావందనం చేసుకుం టున్నాడు. ఈక్షణం పలకరిస్తే ఆయన జపం చెడుతుందని రామం గోదావరి గట్టుపై బాబయ్యకోసం నిరీక్షిస్తూ కూర్చు న్నాడు; స్టీమరు బయలుదేరడానికి ఒక అరగంట ఆలస్యముందని తెలిసి——

బాబయ్యని చూసి మూడేళ్ళయింది. నాన్న పోయినప్పుడు యింటికి వస్తే ఆయన్ని చూశాడు. బాబయ్యని పలక రించి, అమలాపురంలో పని ముగించుకుని తిరిగివచ్చేటప్పుడు బాబయ్యగారింట్లో రెండురోజులుండాలి......సత్తెమ్మత్తయ్య కూడా యిక్కడే వుందిట...అత్తయ్య చాలామంచిది...బాబయ్యగారి రత్తప్ప, చంటి, యిప్పుడేం చేస్తున్నారో! చూసి నప్పుడల్లా వాళ్ళు కథలు చెప్ప మంటూ పీక్కుతింటారు. వాళ్ళతోమళ్ళీ ఒకసారి దాగుడుమూతలు ఆడుకోవాలి. అని పురాతన స్మృతులూ, బంధువుల అభి మానాలు నెమరు వేసుకుంటూ కూర్చు న్నాడు రామం.

వెంకట్రామయ్యగారు స్నానం, జపం, పూర్తిచేసుకుని ఒక తడి అంగోస్త్రం నెత్తిన వేసుకుని, మోకాలుదాకా మరొక తడి అంగవస్త్రము కట్టుకుని, చేతిలోని ఒక చెంబునిండ గోదావరి జలం తీసుకుని, గట్టుపైకి వచ్చారు. 'ఎన్నాళ్ళకు బాబ య్యని కలుసుకున్నాను' అనుకుంటూ, ఆనందంతో ఉద్విఘ్నతతో ఆత్రంతో ఎదురు చూశాడు రామం. వెంకట్రామయ్య గారు ఏదో జపంచేసుకుంటూ, గట్టు ఎక్కి రామం ప్రక్కనించి నడిచి వెళ్ళిపో సాగాడు.

బాబయ్య తనకేసి చూసి కూడా మాట్లాడకుండా ఉండటం రామంకు అర్థం కాలేదు. ఒక వేళ తనకేసి సరిగా చూడా లేదా అని అనుమానం కలిగి, వెంకట్రామ య్యగారు వెళ్ళిపోతుంటే 'బాబయ్యా, బాబయ్యా' అని కేక వేశాడు రామం. కేక విని వెంకట్రామయ్యగారు వెనుదిరిగి చూశారు. కాని తనను కాదన్నట్టుగా, తిరిగి నడిచి వెళ్లిపోసాగారు.



'బాబయ్యా! నేను! నేను!'
అన్నాడు రామం,

బాబయ్య ప్రవర్తన చూసేటప్పటికి రామం ఆనందం, బంధుప్రేమ, పటాపంచలయ్యాయి. హృదయంలో ఏదో బాధ, అవమానం, విజృంభించి, మనస్సును చీకాకుపరిచాయి. బాబయ్య పిలిచినా పలకకపోవడం రామంకు అర్థం కాలేదు. అంత నిరసనగా తృణీకరింపబడినందుకు ఏడుపు కూడా వచ్చింది రామంకు.

మరోకసారి ఎదురుగా వెళ్ళి పిలిచే ప్రయత్నం చేదామని ఉరకలు వేసుకుంటూ, గొడుగు యీడ్చుకుంటూ, వెంకట్రామయ్య గారికి అడ్డంగా వెళ్ళి 'బాబయ్యా' అని జాలిగా పలకరించాడు రామం. వెంకట్రామయ్య గారు హఠాత్తుగా నిలబడిపోయ్యారు.

'బాబయ్యా... నేను... నేను' అన్నాడు రామం దీనంగా.

'ఎవరు నువ్వు' అన్నారు వెంకట్రామయ్య గారు, అదోక అపరిచయస్థుణ్ణి ప్రశ్నిస్తున్నట్లు.

'ఎవరు నువ్వు' అని ఏమీ ఎరగని వానిలా బాబయ్య వేసిన ప్రశ్న గుండెల్లో శూలంలా గ్రుచ్చుకుంది రామంకు. ఇంక ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. ఎంతో అభిమానంతో ఊరంతా గాలించి, చివరికి యిక్కడ కలుసుకుని, సంతోషంతో మాట్లాడుదామని ఉబలాటపడుతున్న ఆ అమాయిక హృదయానికి వెంకట్రామయ్య గారి ప్రవర్తన అంతా అయోమయంగా ఉంది. తనలాటి నిర్భాగ్యుణ్ణి పరాయివారు కూడా జాలికలిగి ఆదరిస్తూంటే తన తండ్రి తమ్ముడు యింత నిర్లక్ష్యంగా 'ఎవరు నువ్వు' అంటాడని రామం కలలో కూడా అనుకోలేదు.

"బాబయ్యా! నేను... నేను... మరిచిపోయావా!" అన్నాడు రామం. హృదయంలో ఏదో అవ్యక్తమైన బాధ ఉడికి ఉబుకుతూంటే, రెండు వేడి కన్నీటి బిందువులు పొంగి కిందకు రాలాయి.

వెంకట్రామయ్యగారు నిశ్చేష్టుడై అలాగే నిలుచుండిపోయాడు. ఆయన ప్రవర్తన చూసి, అవమానంతో, ఆత్మాభిమానంతో క్రుంగిపోయాడు రామం.

స్టీమరు కూతకూసింది బయలుదేరుతున్నానని చెబుతూ.

రామం గిరుక్కున తిరిగి, గొడుగు యీడ్చుకుంటూ, గబగబ స్టీమరు ఎక్కేశాడు. వెంకట్రామయ్యగారు అలా నిలుచుని ఆశ్చర్యంగా స్టీమరు ఎక్కే రామం వైపు చూశారు.

స్టీమరు ఎక్కాక కూడా, 'ఎవరు నువ్వు' అన్న బాబయ్య మాటలు రామం చెవుల్లో గింగురుమంటున్నాయి. బంధువులనే వాళ్ళల్లో అభిమానాలు యిలాగే వుంటాయా అనిపించింది రామంకు. తన తండ్రి చనిపోయి మూడేళ్ళయింది. నాన్నకు అప్పుడు పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నా, చనిపోతాడని తెలిసున్నా, బాబయ్య నాన్నను చూసి వెళ్ళిపోయాడని అమ్మమ్మ చెప్పింది. కాని నాన్నకు తను అంత్యక్రియలు జరుపుతూంటే ఆ పన్నెండు రోజులు బాబయ్య తన కుటుంబంతో సహా తన దగ్గరే వున్నాడు. నాన్న పోయినప్పుడు తన దూరపుబంధువు సుబ్బమ్మగారు 'చచ్చినవాడు నిక్షేపంలా ఆస్తిఅంతా తగలపెట్టి చచ్చిపోయాడు గాని, యీ సంసారభారమంతా నీ నెత్తిన పడుతూందిరా! వెంకటేశం!' అని తన పెదమామతో అన్న గుసగుసలు, తన హృదయంలో రేపిన గాయాలు యిప్పటికీ స్ఫురణకు వస్తూంటాయి. తండ్రి పోయాక తన పోషణ తన పినమామ చూస్తూంటే, తక్కినవాళ్ళకు యింత ఉక్రోషం, అసూయ ఎందుకో రామానికి అర్థం కాలేదు. యింతకీ నిలవడానికి నీడలేని పక్షుల్లాంటి తన కుటుంబానికి తన పినమామ ద్వారా కొద్ది ఆధారం దొరకడం నిజంగా అదృష్టం. కాని యీ అదృష్టం ముఖ్యావసరం కూడా, తన కుటుంబం ముష్టెత్తుకోకుండా బతకాలంటే.


బంధువుల గురించి తలుచుకున్న కొద్దీ రామం గుండెల్లో బాధ, ఉక్రోషం పెరిగిపోతున్నాయి. తాను ఎంత అభిమానంగా, ఆనందంగా, తన బంధువులతో మాట్లాడదామనుకున్నా, అంత నిరసనగా వాళ్ళు తన్ను చూడ్డం చాలాసార్లు గమనించాడు రామం. 'మీకు సహాయం చేయడంవల్ల, మామయ్యదగ్గరనుంచి మునుపు వాళ్ళకొచ్చే సహాయం ఆగిపోయిందని అందరికీ అసూయ మీరంటే' అని అమ్మమ్మ అప్పుడు చెప్తూ అంటుండేది. అది నిజమే. ఒకనాడు తన మేనబావ ఎత్తిపొడిచాడు. 'నువ్వు నాకు శనిగొట్టు పీనుగులా దాపురించావు. నీ మూలానే నా ముందు చదువు ఆగిపోయింది' అని.

'అయినా నేను బాబయ్యను సహాయం అపేక్షించి పలకరించలేదే. ఎందుకు నన్ను 'ఎవరు నువ్వు' అని అడిగావు బాబయ్యా! మానవ హృదయం ఉన్నవాడెవడైనా అంత దగ్గరి బంధువుని అలా ప్రశ్నించగలడా? బాబయ్య ఎలా అనగలిగాడు ఆమాట; బాబయ్య నన్ను పలకరిస్తే బాబయ్యని 'ఎవరునువ్వు' అని ఎదురు ప్రశ్న వేయగలనా? నేను మాత్రం వేయలేను" అనే చిక్కు ప్రశ్నల్లో గిలగిలా మనస్సులో తన్నుకున్నాడు రామం.

'ఇంత నీచంగా చూసే బాబయ్యతో మాట్లాడడం యిదే ఆఖరుసారి. ఎంత పేదవాడైనా ఆత్మగౌరవం ఉండాలి' అని నిశ్చయించుకున్నాడు రామం. అతని నిశ్చయానికి జేజేధ్వనులు కొడుతున్నట్లు పెద్ద పెద్ద కూతలు కూసుకుంటూ స్టీమరు గోదావరి నీళ్ళను చీల్చుకుంటూ రివ్వున పరుగెత్తింది.

* * *

అమలాపురం వెళ్ళి పెదమామయ్యకు అమ్మ యిమ్మన్న డబ్బు యిచ్చి, ఇతర కుటుంబవిషయాలు మాట్లాడి, పని ముగిం



మేష్టారు:- మన పాపాలను క్షమించమని భగవంతుని ప్రార్థించేముందు ఏం చేయాలి?

విద్యార్థి:- పాపాలు చెయ్యాలి.

*　*　*

మేష్టారు:- "నీవు రేపు మా ఇంటికి వచ్చితివి" అనే వాక్యం రైటా, తప్పా?

విద్యార్థి:-తప్పండి.

మేష్టారు:- ఎందుచేత?

విద్యార్థి:-మీ యిల్లెక్కడో నాకు తెలియదు కదండి.

ముకుని, రామం తిరుగుదారిలో రాజమండ్రి చేరుకున్నాడు. ఈ సారి బాబయ్యగారి యింటికి వెళ్ళకూడదని నిశ్చయించి, హోటలుకు బయలుదేరాడు భోజనం చేద్దామని.

దారిలో సగం దూరంవచ్చేటప్పటికి, ప్రక్కవీధినుంచి యిద్దరు ఆడమనుష్యులు, యిద్దరు పిల్లలు కలిసి తనకు ఎదురుగా వస్తూండడం రామం చూశాడు. యింకెవరు? అత్తయ్య, పిన్నమ్మ, చంటి, రత్తెప్ప! రామానికి సత్తెమ్మత్తయ్యతో మాట్లాడా లనిపించింది. అత్తయ్య చాలా మంచిది. కాని పిన్నమ్మకూడా ప్రక్కన వుంది. తీరా పలుకరిస్తే వాళ్ళు కూడా 'ఎవరు నువ్వు' అంటే? రామంకు ఆత్మాభిమానం వెన్నంటింది. పెళ్ళాంపిరి చేత యింత నీచంగా చూడబడేదానికంటే మాట్లాడకుండా పోవడం మంచిదని నిశ్చయించుకున్నాడు.

గొడుగు అడ్డం పెట్టుకుని, బుర్ర వంచుకుని, బంధువులను చూడకుండా చరచరా నడిచి వెళ్లిపోతున్నాడు రామం. ప్రక్కనుంచి గబుక్కున కేక వినిపించింది. "రామం! రామం!" అని.

రామం ఆశ్చర్యంతో ఆగిపోయాడు. సత్తెమ్మత్తయ్య పిలుస్తోంది.

"సత్తెమ్మత్తయ్య చాలా మంచిది. తన్ను అభిమానంగా పిలుస్తోంది. 'మాట్లాడాలి అత్తయ్యతో'" అని అడుగువేశాడు రామం.

ఈలోపుగా సత్తెమ్మగారే ఎదురుగా వచ్చింది. 'ఏరా! రామం! నిన్ను ఆ [illegible] రాజమండ్రి ఎప్పుడొచ్చావురా? ఇంటికి రాకుండానే [illegible]. నిన్ను చూసి [illegible] ఎంత పెరిగావురా నాన్నా! అమ్మగారెప్పుడు ఎక్కడ ఉంటున్నారు!...నాన్న పోయిన తర్వాత [illegible] అంది సత్తెమ్మగారు పరామర్శిస్తూ.'

'[illegible] అమలాపురం వెళ్లి వస్తున్నాను. [illegible] అక్కడే ఉంటు న్నారు. [illegible] యింటికి [illegible] రామం.

'[illegible] ఎక్కడుంటున్నారు [illegible] [illegible] రామం [illegible].

'[illegible]' [illegible] రామం, [illegible]

'[illegible] యింటికి [illegible], [illegible] మాయింట్లో [illegible].

'[illegible] యింటిదగ్గర వుంది. [illegible] రామం.

'రామం! [illegible] ఒక్కపూట యిక్కడ [illegible] యింటికి రావుగాని' అని సత్తెమ్మగారు బలవంతపెట్టింది.

[illegible] రామం [illegible], '[illegible] రామం [illegible]' అనటం [illegible].

"[illegible] రామం! [illegible] గోదావరి [illegible]! మీ బాబయ్య [illegible] పోయాడుట. [illegible] అయిపోయిందని, ఎంతో [illegible]. ఒకసారి యింటికి రారా" అంది రామం [illegible], [illegible] [illegible] [illegible].

[illegible], బాబయ్య

నిజంగా పొరబాటున గుర్తుపట్టలేదేమో అనుకున్నాడు రామం. అయినా యింత చిన్న విషయం గురించి యింటికి వెళ్ళక పోవడం బాగుండదనుకున్నాడు. రత్తప్ప, చంటి, తన్ను రమ్మని పట్టుకు పీకు తూంటే, వాళ్ళకోసమైనా యింటికి వెళ్ళి వాళ్ళతో కాసేపు ఆడుకోవాలనిపించింది రామంకు. సత్తెమ్మత్తయ్య రారా అని బ్రతిమాలుతోంది. 'అత్తయ్య చాలా మంచిది. అత్తయ్య మాట వినాలి.' అనుకున్నాడు రామం. వాళ్ళందరితో కలిసి వెంకట్రామయ్యగారింటికి వెళ్ళాడు ఆఖరుకు.

ఇంటికి వెళ్ళగానే వెంకట్రామయ్య గారు రామాన్ని పలకరించి "ఏరా! మొన్న నిన్ను సరిగా గుర్తుపట్టలేకపోయాను. మీ నాన్న పోయినప్పుడు నీకు పూర్తిగా జుట్టు తీయించారు కదూ! అప్పుడు చూశాను నిన్ను. ఇప్పుడు ఒత్తుగా జుట్టు పెరిగింది. మనిషికూడా బాగా పెరిగావు. అందువల్ల ఎవరో అనుకున్నాను. అంత మాత్రానికే గిరుక్కున వెనక్కి తిరిగిపోయి పౌరుషం ఎక్కించావు! మన వంశానికున్న కోపం, ఆత్మగౌరవం, అంతా నీలోనే ఉన్నాయిరా." అన్నారు గుక్కతిప్పుకోకుండా.

'దానికేంలే బాబయ్యా' అంటూ రామం లోపలికి పోయాడు. పిన్నమ్మ భోజనానికి రమ్మంది. ఎండలో తిరిగి తిరిగి ప్రయాణం చేయడంవల్ల ఒళ్ళంతా తిరుగుతున్నట్టుంది రామంకు.

భోజనానికి కూర్చున్నాడు. అన్నం అంతా చల్లగా ఉంది.

'అన్నం బాగా చల్లగా ఉందేం పిన్నీ' అన్నాడు రామం చలిది అన్నం తినడం అలవాటు లేక.

'మీ బాబయ్యకు తెల్లవారగానే అన్నం వండిపెట్టాలిరా. ప్రొద్దున్న వండిన అన్నం అవడంవల్ల బాగా చల్లబడిపోయిందనుకుంటాను.'

'పోనీ! ఒక సోలెడు బియ్యం ఉడకెయ్యలేక పోయేవులే!' అంది సత్తెమ్మగారు.

'హోటలుకు పోయినా వేడిఅన్నం దొరికేదే!...అత్తయ్యమాత్రం మంచిది. వేడి అన్నం పెట్టమంది...' అనుకుంటూ గబగబా రెండు మెతుకులు నోట్లో వేసుకుని భోజనం ముగించాడు రామం.

'నాన్న పోయాక మిమ్మల్ని విశాఖపట్టణం తీసికెళ్ళాడుగదూ మీ పినమామయ్య...మళ్ళీ యీ వైపుకు ఎప్పుడు వచ్చారురా!' అంది సత్తెమ్మగారు.

'అవును. ఒకవేడు అక్కడ ఉన్నాం. తరువాత మామయ్యకు ఆముదాలవలస బదిలీ అయిపోయింది. అక్కడ నాకు చదువుకునే బళ్ళు లేవని, యీ ప్రాంతాలకి మమ్మల్ని పంపించేశారు. ఇప్పుడు ప్రతీనెల డబ్బు పంపిస్తున్నారు మామయ్య! నేను యిప్పుడు స్కూలుఫైనలు చదువుతున్నా కాకినాడలో' అన్నాడు రామం తన చదువు గురించి కూడా ఒకముక్క జతచేస్తూ.

పిన్ని యీ మాటలు విని మూతివిరుచుకుంది.

'అబ్బో! స్కూలు ఫైనలు చదువుతున్నావురా అప్పుడే' అన్నారు వెంకట్రామయ్యగారు.

'ఎల్లాగైనా రామం మంచి బుద్ధిమంతుడు. మన వంశంలో కల్లా వీడొక్కడే మగపిల్లవాడైనందుకు, ఏదో వృద్ధిలోకివస్తే అంతేచాలు' అంది సత్తెమ్మగారు.

వెంకట్రామయ్యగారికి ఐదుగురు ఆడపిల్లలు. మగసంతానం మాత్రం లేదు. మొదటి ముగ్గురు ఆడపిల్లలకీ పెళ్ళిళ్ళు చేశారు. కాని అందులో ఒక అల్లుడు చనిపోయాడు. మరొక అల్లుడికి మతిచెడింది. మూడో అల్లుడు భార్యను విడిచి లేచిపోయాడు. రత్తప్ప, చంటి మిగిలారు యింకా పెళ్ళిళ్ళకు.

రామం తండ్రి, వెంకట్రామయ్యగారు, సత్తెమ్మగారు ఒక కడుపున పుట్టారు. సత్తెమ్మగారు బాల్యలోనే వితంతువయింది. వెంకట్రామయ్యగారికి మగసంతానం లేకపోవడం వల్ల రామం ఒక్కడే యీవంశానికి మగపిల్లవాడు. రామంతండ్రి చనిపోయాక, సత్తెమ్మగారు, వెంకట్రామయ్యగారింట్లోనే ఒక పంచ కాపురంవుంటోంది, తనకు వచ్చే మనువర్తితో కాలక్షేపం చేస్తూ. కాని అంతకుముందు సత్తెమ్మగారు రామంయింట్లోనే వుండేది. రామాన్ని చిన్నప్పటినుంచి పెంచి పెద్దచేసింది. అందుచేత రామం అంటే సత్తెమ్మగారికి చాలా అభిమానం.

సత్తెమ్మగారు తన్ను పొగడ్డంతో రామంకు చాలా సంతోషమయింది. 'అత్తయ్య చాలామంచిది' అని లోలోపల ఉప్పొంగిపోయాడు రామం.

రత్తప్ప, చంటి, కథలు చెప్పమని రామాన్ని వేపుకుతిన్నారు. వాళ్ళకు కథలు చెబుతూ చెబుతూ, ప్రయాణ బడలికవల్ల, నిద్రపోయాడు రామం.

* * *

నిద్రపోయి లేచేటప్పటికి, ఒళ్ళంతా నెప్పులు, తలనొప్పి ప్రారంభించాయి

★ హకల్ బెరిఫిన్ ★

వెల. రూ. 1-8-0 పోస్టుఖర్చులు ప్రత్యేకం.
ఆంధ్రగ్రంథమాల, పోస్టుబాక్సు 212, మద్రాసు-1.

శ్రీ అంబాళ్

ఆఫీసర్స్ నస్యము





1 తులము టిన్నులలో అన్ని చోట్ల దొరుకును.

శ్రీ అంబాళ్ అండు కంపెనీ,

తపాలు పెట్టె నెం. 3. మదరాసు.

అతిమూత్రవ్యాధి
వారం రోజులలో
నెమ్మదించును

మూత్రంలో అధికంగా చక్కెరపోవుట, అతిమూత్రవ్యాధిఅంటారు. (Diabetes) ఇది యెంత ఉపద్రవకరమైన వ్యాధిఅంటే, దీని పాలబడినవారు ఆరోజు కారోజు మృత్యువుకు ఆసన్నమౌతుంటారు. దీనికి డాక్టర్లు ఇన్సులిన్ ఇన్జెక్షన్ మాత్రమే కనిపెట్టారు. వాటివల్ల వ్యాధి పూర్తిగా నయం కానేకాదు. ఇన్జెక్షన్ల గుణము వున్నంతకాలం మాత్రం చక్కెర తాత్కాలికంగా నిలిచిపోతుంది. ఈజబ్బు లక్షణాలలో ముఖ్యమైనవి దాహం, ఆకలి, తరచుగా చక్కెరతో మూత్రం లటము, బయలు వెడ దురద మొదలైనవి. ఈ వ్యాధి ముదిరితే రాచ పుండు, కురుపులు. కంటిపొర ఇతర చిక్కులు సంభవించును. వీనస్ ఛారమ్ ఆధునిక శాస్త్రంలో అద్భుతమైన చికిత్స. దీన్ని వాడటం వల్ల వేసకు వేలమంది మృత్యుముఖంనుండి బయటపడ్డారు. దీన్ని వాడితే రెండవ లేక మూడవ రోజునుండే మూత్రంలో చక్కెర తగ్గించి అత్యధికమూత్రం గూడ నివారిస్తుంది. మూడు రోజుల తరువాత మీకు బాగా తేలిక యిస్తుంది. దీనికి పత్యం లేదు. ఇన్జెక్షన్ల అవసరం లేదు. ఇంగ్లీషులో వివరములుగల కరపత్రానికి వ్రాయండి. ఉచితంగా పంపుతాము.

50 బిళ్లల బుడ్డి ఖరీదు రు. 6-12-0 లు

ప్యాకింగు పోస్టేజి ఉచితము

వీనస్ రీసెర్చి లేబరేటరీ,

పోస్టుబాక్సు నం. 587, కలకత్తా (A. P. W)

రు. 1-14-0 లు మాత్రమే పెట్టుబడి పెట్టి
రు. 1024/-లు సంపాదించండి

వివరములకు వ్రాయండి.

ఇండియన్ నేషనల్ పాలిసీ కంపెనీ

(Money Circulating Scheme)

పో. బా. నం. 889 జి. పి. ఒ. కలకత్తా 1,

స్థాపితము — 1935

ఇండియాలో ఇటువంటి కంపెనీలలో ఇదే మొదటిది. స్థాపింపబడినప్పటినుండీ ఈ కంపెనీ ఎక్కువపేరు ప్రఖ్యాతులతో ప్రజలకు సేవ చేయుచున్నది.

ఒక గంటలో యౌవ్వనము

కామస్తంభన

ధాతుపుష్టి. సంసారసుఖము నిచ్చుటలో సాటిలేనిది. విరాశచెందిన వృద్ధులయందు శక్తి, ఉత్సాహము నిచ్చును. రు. 2-8-0

మదన మంజరి ఫార్మసీ

184, చైనా బజారురోడ్డు, మద్రాసు.

మదరాసు ఏజంటు: S. T. వల్లాసో & సన్సు, పురసవాక్కం & కీల్పాకం

బెజవాడ-శ్రీనివాస మెడికల్ డ్రగ్సు పార్లురోడ్డు, రాజమండ్రి—ఈశ్వరదాస్ & కో. మెయిన్ రోడ్డు. నెల్లూరు: ఆర్యన్ ఫార్మసీ.

రామంకు. కొంచెం జ్వరం తగిలినట్టు అనుమానం కలిగింది.

'రామం! యీ రాత్రి మా యింటికి భోజనానికిరారా' అంది సత్తెమ్మగారు ఆప్యాయంగా. అత్తయ్య మంచితనం గురించి లోలోపల మళ్ళీ ఆనందించాడు రామం.

'ఒంట్లో బాగులేనట్టుంది అత్తయ్యా' అన్న రామం మాట వినగానే, సత్తెమ్మగారు ఆశ్చర్యపోయి, అతని ఒళ్ళువెచ్చదనం చూసి, జ్వరం వచ్చిందని నిర్ణయించింది. ప్రక్క వీధిలో ఉన్న ఆచారిగారి దగ్గరనుంచి మాత్రతీసుకువస్తానని వెంకట్రామయ్యగారు బయటికి వెళ్ళారు.

'ఇదేమిటిరా! యింతట్లో యిలా జ్వరం వచ్చింది' అని సత్తెమ్మగారు రామం దగ్గరగా కూర్చుని అభిమానంతో ఒళ్ళు నిమరడం మొదలెట్టింది. 'వచ్చి వచ్చి మాయింట్లో జ్వరం తెచ్చుకున్నాడేమిటి' అని పిన్ని ప్రక్కయింటి అమ్మలక్కలతో గుసగుసలాడింది.

'ఇక్కడకు ఎందుకు వచ్చానా! యిక్కడకు రాకుండావుంటే జ్వరం రాకుండా ఉండేదేమో' అని వ్యథపడ్డాడు రామం. ముఖ్యంగా అత్తయ్యగారింట్లో ఒకపూట ఉండి, రత్తప్ప, చంటితో ఆడుకుందా మనుకున్నాడు రామం. యిలా జ్వరంవచ్చి అందరికీ కష్టం కలిగేటట్టు మంచమెక్కవలసి నందుకు చాలా కించపడ్డాడు.

సాయంత్రం అయినకొద్దీ, జ్వరతీవ్రత హెచ్చింది. వెంకట్రామయ్యగారు మాత్ర తీసుకువచ్చి యిచ్చారు. కషాయంతో మాత్ర వేసుకుని, నిద్రపోదామని కన్ను మూశాడు రామం. నిప్పులా కాగుతున్న రామం ఒళ్ళు చూసేటప్పటికి, సత్తెమ్మగారికి, రామంమీద ఆప్యాయత, జాలి, మరీ హెచ్చి, రాత్రిభోజనం కూడ మాని అతని మంచందగ్గిరే కూర్చుంది.

* * *

రెండు రోజులైనా, జ్వరతీవ్రత తగ్గే సూచన లేవీ కనిపించలేదు. గంటలు తిరిగినకొద్దీ, రామంలో క్రొత్త క్రొత్త మార్పులు కనిపించసాగాయి. మొన్న సరిగా మాట్లాడలేకపోయాడు. యీ వేళ ఆమాట తీరుకూడా సరిగా లేదు; ఒక వెర్రి చూపుమాత్రం తప్ప. శరీరం బాగా వేడెక్కి ఉడికిపోతూంది. అప్పుడప్పుడు రామం నోటివెంట తప్పుడుమాటలు కూడ వస్తున్నాయి.

యీ విషమపరిస్థితి చూసేటప్పటికి, సత్తెమ్మగారి గుండెల్లో విపరీతమయిన బాధ కలిగింది. 'ఒకే వెంకట్రామయ్యా అన్నయ్యా; రామం తల్లికి ఒక టెలిగ్రాం యిద్దు. వీడి పరిస్థితి యింకా ముంచుకుపోతూంది' అని వలవల కన్నీరు కార్చింది సత్తెమ్మగారు. తనే కాకినాడ వెళ్ళి, రామం తల్లిని తీసుకువస్తానని బయలుదేరారు వెంకట్రామయ్యగారు.

* * *

తెల్లవారు ఝాము రైలు బండిలో, రామం తల్లి, అతని అమ్మమ్మ, వెంకట్రామయ్యగారితో యింటికివచ్చారు.

రామం పూర్తిగా యీ లోకం సంగతి తెలియనిస్థితిలో ఉన్నాడు. సంధి ప్రలాపన తీవ్రంగా ఉంది. కాళ్లు, చేతులు, క్రమంగా చల్లబడుతున్నాయి. చల్లబడిన శరీరాంగాలను ఎఱ్ఱచీమలు పట్టుకుపీకుతున్నాయి.

రామం తల్లి, తన కొడుకు పరిస్థితి చూసేటప్పటికి, గొల్లుమని ఏడుస్తూ అతని మంచంమీద వ్రాలింది. కడుపు తరుక్కుపోయే శోకంతో 'రామం! రామం!' అని విలపించింది.

'ఆ ఆఁ...'అన్నాడు రామం.

'రామం! మీ అమ్మ, అమ్మమ్మ వచ్చారురా!' అంది సత్తెమ్మగారు కన్నీరు తుడుచుకుంటూ.

'అమ్మ...అమ్మ...ఊఁ.... ఎవరు?' అన్నాడు రామం.

తాను వచ్చిన గుర్తుకూడ తెలియకుండా సంధిలో ఉన్న కొడుకును చూసేటప్పటికి, ఏదో అవ్యక్తమైన ఆవేదన కడుపులో కోతకోసినట్లయింది రామం తల్లికి. కట్టలు తెంపుకువచ్చే గోదావరి వరదల్లా, ఉబికి వచ్చే కడుపుశోకంతో ఆమె స్తంభించిపోయింది. అమ్మమ్మకు ఏంచేయడానికి తోచక, చంటిపిల్లలా ఏడ్వడం మొదలు పెట్టింది.

డాక్టరువచ్చి రామం నాడి పరీక్షించాడు. ప్రక్కకు తిరిగి 'ఆశలేదు' అన్నాడు వెంకట్రామయ్యగారితో.

ఈ విషాద దృశ్యం చూసేటప్పటికి, వెంకట్రామయ్యగారి కంటిలో రెండు నీటిచుక్కలు మెరిచాయి.

'యింకేముంది. మనవంశనాశనమై పోయింది' అంది సత్తెమ్మగారు గద్గద స్వరంతో విలపిస్తూ.

వెంకట్రామయ్యగారు రామం ప్రక్కలోకి చేరాడు.

'రామం! రామం!' అని పలకరించాడు.

"మామయ్యా! చూశావా! బాబయ్య నన్ను 'ఎవరు నువ్వు' అని అడిగాడు" అంటూ బాధతో ఏదో గొణిగాడు రామం.

'రామం! రామం!' అంది సత్తెమ్మగారు దగ్గరగావచ్చి రామంతల నిమురుతూ.

'మామయ్యతో చెబుతా నీ సంగతి' అన్నాడు రామం, జ్వరతీవ్రత బాధలో.

'రామం! చూడూ. మీ అమ్మ వచ్చింది...పాపం! ఎవరినీ గుర్తుపట్టలేక పోతున్నాడు' అంది వెంకట్రామయ్యగారి భార్య జాలిపడుతున్నట్లు.

'రామం! రామం! యిలా చూడు' అన్నారు వెంకట్రామయ్యగారు, అతని తల తనవైపు చేత్తో తిప్పుతూ తెచ్చుకున్న అభిమానంతో.

"ఎవరు నువ్వు?...ఎవరు నువ్వు?" అన్నాడు రామం పిచ్చిగా నవ్వుతూ. అతని వెఱ్ఱిచూపు వెంకట్రామయ్యగారిని వెక్కిరించినట్లు కనిపించింది.

వెంకట్రామయ్యగారు, సంధిప్రలాపనలో యిటువంటి మాటలు వస్తాయనుకోలేదు. రామంనోట క్రిందటిరోజు గోదావరీతీర దృశ్యం హృదయంలో కలచింది. రామం ఒళ్లు తెలియని పరిస్థితిలో వేసిన ఎదురుప్రశ్న శూలంలా గుండెల్లో గ్రుచ్చుకుని, ఆవేదన ప్రవహించి కడుపులో త్రిప్పగా, ఏదో కలవరపడ్డారు వెంకట్రామయ్యగారు.

రామం మరీ పిచ్చిగా నవ్వడం మొదలుపెట్టాడు. కొంతసేపయాక నవ్వు పూర్తిగా అణగిపోయింది. శ్వాస క్రమంగా మాయమయ్యింది.

రామం తల్లి, అమ్మమ్మ, సత్తెమ్మగారు, గుండెలు బాదుకుంటూ రామం శవంపైబడి, ఏడ్చి మొత్తుకున్నారు. రత్తప్ప, చంటి, రామం దగ్గరగా దిగాలుపడి భయంతో నుంచున్నారు. రామం పిన్ని, కన్నీరు బలవంతంగా తెచ్చుకుని తుడుచుకుంది. 'ఎండలో ప్రయాణం చేసి వచ్చినవాడికి చలిది అన్నం పెడితే జ్వరం రాదూ. విషజ్వరం వచ్చి మింగేసింది కుర్రాణ్ణి.' అని గుసగుసలాడారు ప్రక్కింటివాళ్లు.

బాహ్యవాతావరణంలో రామం గురించి ఆక్రందించేవారి రోదనలు ప్రతిధ్వనిస్తూ సూదుల్లా వెంకట్రామయ్యగారి శరీరమంతా పోట్లు పొడిచాయి. అంతర్గత వాతావరణంలో, రామం అప్రయత్నంగా సంధిలో వేసిన ఎదురుప్రశ్న, అతని పిచ్చి నవ్వు, వికటాట్టహాసాలు చేస్తూ ఆయన హృదయాన్ని తూట్లు చేశాయి. ఈ రెంటి ఒత్తిడి, బాధముఖ్య, వెంకట్రామయ్యగారు సలిగి మూల్గారు.



వెళ్లొస్తాను

"ప్రభాకరం"

కుమారస్వామి : ఈ మధ్య నే పెండ్లి అయింది. వాల్తేరులో మొదటి సంవత్సరం బి.కాం. అయింది. వేసంగులకి అత్తవారింటికి వచ్చాడు.

లలిత : కుమారస్వామి భార్య

కేశవుడు : లలిత తమ్ముడు

కుమారస్వామి మామగారు,

అత్తగారు,

ముసలమ్మ.

(స్థలం—అత్తారింట్లో. కుమారస్వామి డ్రెస్సు వేసుకుంటూ. లలిత వరండాలో గోడ గిల్లుతూ. కేశవుడు కుమారస్వామికి ఏవో అందించుతూ.)

కుమా : ఇంకా నయం కేశవా. మాకు మరి ఈయేడు యూనివర్సిటీ ఎగ్జామ్స్ అని చెప్ప లేదుటోయ్. కాకపోతే మీరందరూ, అందులో మీ సిస్టర్ ఉండమంటోంటే వెళ్ళిపోతానా ? తప్పకుండా వెళ్ళాలి. ఆఁ ఈమధ్య స్పోర్ట్సులో పడిపోయి బుక్సు బొత్తిగా టచ్ చేయలేదు. ఈ రాజమండ్రీలో కూర్చుంటే ఎల్లాగ ? పోవాలి. ఏదీ ఆ టై ఇల్లా అందుకో.

కేశ : ఇదిగో. అవును గాని బావా. ఈ వేళ పద్దెనిమిదో తారీకు. ఇరవయ్యయిదో తారీఖు నన్నావు మీ కాలేజీ తెరవటం. ఏమే అక్కయ్యా అనలేదు టే బావ ?

లలి : అంటేనే. ఈ రెండు రోజులూ వుంటే బావుండును. పోనీలేరా తమ్ముడూ ఇక్కడేం తోస్తుంది? స్నేహితులూ, టెన్నీసూ.

కుమా : అబ్బే ఇంకా నయం కేశవా. తోచడంటే అసలు రావడమే వుండేది కాదు. వెళ్ళొస్తాను. ఆ మిర్రరిలా ఇయ్యి. మళ్ళీ దసరా సెలవులకి రానుటోయ్ !

కేశ : "బావొస్తాడు, బావొస్తాడు" అనుకున్నంత కాలం పట్టలేదు. మొన్ననొచ్చావు. ఇవాళ వెళ్లిపోతున్నావు. వేసవు లింతగా అయ్యాయి, ఇంక దసరాలకి వస్తాట్ట!

లలిత : తమ్ముడూ దసరాలూ క్రిస్మసులూ వేసవి సెలవులూ వస్తూనేవుంటాయి, పోతూనేవుంటాయి. రావడాలూ, ఉండడాలూ వుండాలిగాని. పోనీలేరా.

కుమా :అవునూ వాటిలాగా నేనూ వస్తూ వుంటాను పోతూవుంటాను ఇంకా నయం. వెళ్లొస్తాను. ఆఁ. మరేంలేదు. మా లెక్చరరు లేడూ ఆయనా. చండశాసనుడు. తను ఇరవయినాలుగ్గంటలూ క్లబ్బులో చీట్లపేకాడవచ్చుగాని మేము స్పోర్ట్సులో తిరుగుతూవుంటాం అని మామీద ఇట్టే ప్రిజుడిస్ అయిపోతాడు. ఏదీ, ఆ షూ హార్న్ ఇలా యియ్యి. అంచేత ఒక్క రవ్వ స్టడీ చేసి "అబ్బో, వీడు అఖండుడూ, చదివినా అంతే, దుంప తెంచేస్తాడు" అనిపించుకోవాలి. ఇంకా నయం. వెళ్ళొస్తాను.

కేశ : "వెళ్ళొస్తాను, వెళ్ళొస్తాను" అని ఇప్పటికి వందమాట్లన్నావు. వళ్ళు మహానుభావా, నిన్నెవరు పట్టుకొన్నారిక్కడ. మహా తొందరగావుంది. నిన్నటినించీ అంటున్నావు. నాన్నా అమ్మా, ఆఖరికి మా అమ్మమ్మకూడా ఉండు ఉండు అంటూంటే ససేమిరా అంటున్నావు.

లలిత : ఒరే తమ్ముడూ, మరేంలేదూ, మనకేం, వెళ్లినాసరే ఉన్నాసరే అందుకో సంకాదిప్పుడు. ఇది, ఈ స్వెట్టరల్లుతున్నా కదూ. వచ్చేది పోనీ శీతకాలం-వెచ్చగా వుంటుందని. ఎన్నాళ్ళో అక్కర్లేదు. జానకమ్మగారి దగ్గర నేర్చుకున్నానుకదా. రేపటికి పూర్తవుతుంది. వుంటే బావుండును. ఈపాటి స్వెట్టర్లు వాల్తేర్లో దొరకవుట గానీ, ఏమిటో—మనభ్రమ.

కేశవ : అవును బావా. అక్కయ్య అల్లుతోన్న స్వెట్టరు నీకే అని నిన్న నీతో చెప్పలే? నువ్వు వచ్చినాడు నీ బనీను కొలపెట్టి గళ్లు లెక్కెట్టుకుంటోంది.

కుమా : పంపవచ్చుగా. స్వెట్టర్లు వాల్తేరులో దొరక్కేంగాని, ఈ వెచ్చదనం వుంటాయూ మరి. పైగా ఈ యుద్ధాలవల్ల *HopelessPrices* సరికాని,—వెళ్ళొస్తాను— ఇంతకీ కేశవా, జట్కా తెచ్చావా? అడగడం మరిచిపోయాను.

కేశ : జట్కాలు కనబడలే దీవేళ ఎంచేతో. బళ్లస్టాండులో మామూలుగా బోలెడుండేవి. ఈ వేళ ఒకటీ లేదు. రిక్షా తెచ్చాను. ఏవైతేం, నీ సామానాట్టే లేదుగా.

కుమా : ఇంకా నయం, లేకేం-ఇప్పుడు తీసుకెళ్ళటం లేదు కాని—సరే—కానీ, ఈ నరవాహనమా?

కేశ : సరిసీ, బావగారి హోల్డాలు రిక్షాలో పెట్టవే.

లలిత : తమ్ముడూ, మఫ్లరు కోటు జేబులో పెట్టానని చెప్పావుకదూ.

కేశ : చూశాను బావ. ఈ షర్టు లోపల వేసుగున్నాడు. గుండెలకి దగ్గరగా తీసకుని వెచ్చగా వుందన్నాడు.

కుమా : (మెట్లు దిగుతున్నాడు. టక్ టక్‌మని చప్పుడు) కేశవా, వెళ్లొస్తాను. ఆ స్వెట్టరల్లుతున్నవాళ్లతో చెప్పు; ఉత్తరాలు రాస్తూవుంటావుగా— కవర్లు! ఇంకా నయం.

లలిత : తమ్ముడూ, స్వెట్టరల్లుతున్నవారు విన్నార్లే—అల్లడం మానేశారు కూడాను. దసరాల్లో కావాలసిన స్వెట్టరిప్పుడు పూర్తిచెయ్యడ మెందుకు? దండగ.

కుమా : చూడూ, మీ నాన్నగారాఫీసు గదిలో వున్నారా? అయినా, చూసిరా - ఇంకా నయం—ఆయనతో చెప్పి మరీ పోవాలి—త్వరగా—ఇంకా ఇక్కడే వున్నావేం? (కేశవుడు వెళ్లుతాడు)

లలిత : ఉండకూడదు కాబోలు—

కుమా : ఎందుకుండాలో-ఇంకానయం-

లలిత : పోనీ ఈ స్వెట్టరు పూర్తవుతుందని—అని చెప్పానుకదూ!

(లోపల్నుంచి)

అమ్మాయీ, ఈ పొట్లం అతని సంచీలో వెయ్యి. అతను ప్రయాణం తొందరలో ఏమిటో, ఇల్లా ఒక్క ముక్కైనా ముట్టుకోలేదు ఈ పూరీలు.

కుమా : ఊఁ. పోనిద్దురూ. *I don't like them.*

కేశ : నాన్నిలాగే వస్తున్నాడు బావా.

మామ : ఏమోయ్. ఈ టూ డేస్ ఇక్కడ స్పెండ్ చేసి పోరాదూ—అహ! నీ కిబ్బంది లేకపోతే నే.

కుమా : కాదండీ. థాంక్సు. వెళ్లొస్తాను.

మామ : మంచిది. చేరగానే వ్రాస్తావు కదూ.

కుమా : ముసలమ్మగారూ, వెళ్లొస్తాను.

ముసలమ్మ : అమ్మాయీ, ఇత గాడేదో అంటున్నాడు చూడు.

అత్త : నీ చెవుడు బంగారంగానూ! (గట్టిగా) వెళ్ళొస్తానని చెబుతున్నాడే నీతో.

ముసల : అట్లాగా మంచిది. నాయనా, ఇందాకానే తొందరపడ్డావు, వెళ్ళొవను

కున్నాను, ఇప్పుడు పదకొండు గంటల పాసింజరు రైలుబండీ ఎక్కుతావా? శేభాసు.

కుమా: అవునండీ. వెళ్లొస్తాను అత్తగారూ, సెలవు, వెళ్ళొస్తాను.

అత్త: మంచిదోయి మీ మామగారితో చెప్పావుకదూ. మావదిన్నడిగానని చెప్పు, మీ అక్కయ్యనీ. ఉత్తరం రాస్తావుకదూ.

కుమా: అల్లాగేనండి. వెళ్ళొస్తాను కేశవా, గుడ్ బై (రిక్షా వాడితో) స్టేషనుకి.



'ఇంకానయం...వెళ్లొస్తాను....మళ్లీ దసరా సెలవులకి రానుటోయ్'

(రోడ్డుమీద)

రిక్షా: కాకినాడ బండికా బాబూ?

కుమా: ఇంకానయం. పదకొండుగంటల ప్యాసింజరుకి.

రిక్షా: చిత్తం చిత్తం. కాకినాడ బండి కనుకున్నాను బాబూ.

కుమా: ఇంకానయం. పోనీరా పోనీ. (రైలుకూత, బయలుదేరిపోయిన చప్పుడు)

కుమా: అరె! ప్యాసింజరుట్రా అది? ఇంకానయం.

రిక్షా: చిత్తం (ఎదుట వచ్చే బండీవానితో) ఏరా యెంకన్నా, ప్యాసింజరా? కోశా? అపోయేదేటి?

వెంకన్న: పాసింజరేన్రా. నాల్రోజుల్నించీ టైములుమారాయి గదరా. పాసింజరో అరగంట ముందొస్తోంది.

కుమా: *My goodness*! చచ్చాన్రా! అవును ఇవాళ మే 18 గదూ. మొన్న పేపర్లో చూశాను కూడాను. పోన్లే ఈ వేపచెట్టు కిందాపు. ఏంరా, బస్సులు లేవూ ఈ వూర్నించి. అయినా, వాల్తేరుకి బస్సేమిటిగాని, పట్టు, ఇంటికిపట్టు.

రిక్షా: చిత్తం కూకోండి బాబూ.

కుమా: ఇంకానయం. ఇంటికి పట్టు.

(ఇంటివద్ద)

కుమా: తలుపండీ తలుపు తలుపు (కొట్టును) (లోపల్నుంచి) ఎవరూ వారూ. వస్తున్నా వస్తున్నా.

కుమా: చచ్చాన్రా దేవుడా. ఈ శేషమ్మగారుండీ. ఈవిడకి చచ్చినా వినపడదు. (గట్టిగా) నేనండీ, కుమారస్వామిని.

ముసల: (లోపల్నుంచే) కుమారస్వామి కోసమా. కుమారస్వామి ఇప్పుడే వెళ్లాడు నాయనా పాసింజరుబండికి. శేభాసు.

కుమా: అవునమ్మా, ఆ పాసింజరు తప్పిపోయింది. నేను "వెళ్లొచ్చాను" తలుపు తీయండి. ఇంకా నయం.

ముస: (లోపల్నుంచే) పంపించి వచ్చావా! పాసింజరు వెళ్లిపోయిందీ? జాగ్రత్తగా ఎక్కాడా? మహా తొందరపడ్డాడు. ముళ్ళమీద నుంచున్నట్టు, వెళ్ళొస్తాను. వెళ్ళొస్తాను" శేభాసు. సాగనంపి వచ్చావా? (తలుపు తీసి) ఇదేమిటే, కుమారస్వామే? వెళ్ళొస్తానన్నా వింకా వెళ్ళలేదూ? శేభాసు.

కుమా: ఒకే, రిక్షాఅబ్బి యూడు ఆ హోల్డాలు ఇట్టాపెట్టు. ఊఁ, చిల్లర వుందా?

రిక్షా: నాకాదెక్కడిది బాబూ.

కుమా: ఇంకా నయం. ఇదో న్యూసెన్సు. ఈ అర్ధరూపాయి పట్టుకుపో.

రిక్షా: చిత్తం చిత్తం. సుట్టముక్కకేమన్నా దయచేయించారు కారు.

కుమా: సరి. ఇంకా నయం. ఇదోటూ. ఆ అర్ధరూపా యెందుకనుకురీ? చుట్టముక్కల కందులోవి వాడకూడదు కాబోలు. ఈ అర్ధణా పట్టుకుపో.



'ఈ స్వెట్టరల్లుతున్నాకదూ, వచ్చేది పోనీ శీతాకాలంఅని....ఈపాటి స్వెట్టర్లువాల్తేర్లో దొరకవుటగాని...'

రిక్షా: చిత్తం చిత్తం (పోతాను).

కుమా: (గట్టిగా) వీళ్ళేరీ?

ముస: నీళ్లివిగో. కాళ్లు కడుక్కో.

కుమా: నీళ్లు కాదమ్మా, వాళ్లు, ఈ కేశవుదూ వాళ్ళూను.


ముస: ఎవళ్లూ - ఎవళ్లున్నారు? నీ మామగారు నువ్వుండగానే కదా కోరుటూ వెళ్లాడు? నీ అత్తగారు వాళ్లింటికి - ఆ జగన్నాథరావుగారింటికి - పెట్రోమాక్సు లైటిచ్చెయ్యడానికి-దానీళ్ల చేత పట్టించుకొని వెళ్ళింది. ఇంక పిల్లది - ఆ లలితమ్మ, అది ఆ జానకమ్మగారింటి కెళ్లింది. దాని కింట్లో కాలు నిలుస్తుందీ. నువ్వొచ్చావు గనక ఈ నాలుగురోజులూ కాస్త ఇంటిపట్టున వుంది. అంతే నా. సరే. ఆ కేశిగాడు నీ బావమరిది. అదుగో మాటలో వచ్చాడు.


కేశ: (వస్తూ) ఈ యన వెళ్ళలేదూ? ఇదేమిటి బావా? నేనుంటే పెద్ద

(56-వ పేజీ చూడండి)

పెత్తనం

“సుశీలాదేవి”





వణుకుతోన్న, చేతులతో జీవం చచ్చిన నరాలుపట్టుతప్పిపోతోంటే, నెమ్మదిగా – ముసలయ్య మొలత్రాడున ఉన్న ఇనుపపెట్టె తాళంచెవుల గుత్తిని తీసి, శాంతమ్మ దోసిట్లో పెట్టేప్పటికి, శాంతమ్మకు దుఃఖం నిర్ఝరం కావటంచేత గొంతు చించుకొని బావురుమన్నది. ముసలయ్య కదులుతోన్న పెదాలను బలవంతాన తెరచి యిట్లా అన్నాడు అస్పష్టంగా.

“నాకు నేటితో...ఈ గడ్డమీద... ఋణం తీరింది...ఇహ ఈ యింటి భారమంతా నీదే!...రామిగాడు...అసలే అల్లరి చిల్లరగా...తిరిగేవాడు–వాడినో కంటకనిపెట్టి ఉండు...

ఆ మాటలు భర్త చచ్చిన మూడు నెలల వరకూ శాంతమ్మ హృదయంలో ఒక రకమైన రంపపుకోతతో నిలిచి ఉన్నాయి. పెళ్ళీడుకువచ్చిన కొడుకు వున్నప్పటికీ ముసలయ్య చస్తూ చస్తూ తనకే యినప్పెట్టె తాళంచెవు లిచ్చి, సంసారభారం తనమీదే వేసి, పెత్తనం అప్పగించటం ఆవిడకు కొంత గర్వం కలగటానికి కారణం కాకుండా పోదు. ఒక కుటుంబంమీద పెత్తనం చేయటం–ముఖ్యంగా ఆడది, ఒక రాజ్యాన్ని ఏలినంత హోదా అనే భావం శాంతమ్మలో తన తల్లీ, అత్తయ్యా, పిన్నీ తమ తమ కుటుంబాలకు పెత్తనం వహించి చెలాయించిన అధికారంవల్ల కలిగింది. ఆ హోదా ఆడదానికి రావటం గొప్ప అదృష్టంతో కూడిన పనని శాంతమ్మ నమ్మింది.

ముందుముందు తన కుటుంబం రెండు తరాలవరకీ ఎటువంటి ఆర్థికబాధలకు లోను కాకుండా ఉండేటట్టు ధనం తను పెత్తనంచేసి కూడబెట్టాలని ఆవిడ నిశ్చయించుకున్నదగ్గర్నుంచీ డబ్బు పొదుపు ఎక్కువచేయ నారంభించి కానీని రూపాయిగా చూస్తున్నది.

కొడుకు రామారావుకు తల్లి పెత్తనం రుచించలేదు. రోజుకు తండ్రి పావలా బీడీలకు, పైసాదరుకు మరోపావలా యిచ్చేవాడు. అటువంటిది తల్లి సాదరు ఖర్చు అనవసరమని త్రోసేసి, అధికంగా బీడీలు కాలిస్తే గుండెలో పసరు పేరుకొని మనిషికి ప్రమాదం కలిగిస్తుందని పావలా బీడీలను అణాకు బదిలీ చేసింది. నెలకు ఒక్క సినిమా చూడాలనీ, అదైనా నేలకుపోవాలనీ శాంతమ్మ కఠినంగా శాసించింది. చేసేది లేక రామారావు వూరుకున్నాడు. పేడను వుంటలుచేసి బ్రాహ్మలకు అమ్మేది. రెండు రోజులకు ఒకపూట మాత్రమే రామారావు అన్నంలో పెరుగువేసి మిగతాది అమ్మేది. నెయ్యి రెండు చినుకులు రాల్చి తాను ఒక్క కారంలో తప్ప వేసుకోకుండా అంతా అమ్మేది. ఎంత చేసినా అడేమని అనేవాళ్లు లేరుగా! కొలువాళ్ళ దగ్గర ఖచ్చితంగా వస్తు వసూలుచేసేది.

ఇంట్లో ఆడపెత్తనమని ఒకటి రెండు సంబంధాలు వెనక్కు తగ్గినప్పటికీ శాంతమ్మ పట్టుపట్టి పదివేల కట్నంతో రామారావుకు వివాహం చేసింది. పెళ్లికిగాను, ఇహ ఎటుగూడి ఒక్క కొడుకే–ఎంత ఖర్చు చేస్తేమటుకు ఏముంది, అని చెప్పేసి ఎక్కువ డబ్బు వెచ్చించి గొప్పగా పెళ్లి చేయలేదు. మేళతాళాలు లేకుండానే నూతన పద్ధతిలో ఆర్య సమాజపు పెళ్ళిచేసింది. ఊళ్లో ఏమనుకున్నా డబ్బు ఖర్చు కాకుండా ఉండే లెక్కలో ఆవిడకు లక్ష్యమేమిటి?

గత రెండు మూడు సంవత్సరాలనుంచీ శాంతమ్మ తన పెత్తనంలో భర్త పదేళ్లనుండి సంపాదించినంత సంపాదించింది. ఇంకా ఆవిడకు తృప్తి కలగలేదంటే మనం ఆశ్చర్యపడాల్సింది లేదు.

సామాన్యంగా పెత్తనంచేసే వాళ్లు తాము అష్టకష్టాలుపడి పెత్తనం చేస్తున్నామనిన్నీ, తాము తప్ప అన్యులు నిర్వహించలేరనిన్నీ గొప్పకు చెప్పుకుంటారు. అట్లాగే శాంతమ్మ కొడుకూ కోడలు దగ్గర చాలాసార్లు చెప్పుకున్నది:

“ఈ యింటి పెత్తనం నాదుంప తెగటానికేవచ్చింది బాబూ! వార్ధక్యంలో కూడా సుఖపడే యోగంలేదు నాకు. క్షణం తీరిక చిక్కటంలేదు. నేకనుక సరిపోతున్నది కానీ మరొకళ్ళయితే కొంప నిలువునా గుల్లకావాల్సిందే!”

క్రమంగా శాంతమ్మ తనపెత్తనంవలన సాధించిన మరొక చెప్పుకోతగ్గ కార్యమేమిటంటే; కోడలు జానకమ్మకు తనంటే సింహస్వప్నంలాగా చేసుకుంది.

ఒకరోజున గేదె పాలు పితుకుతోంటే జానకమ్మ అశ్రద్ధవలన నైతేనేమి, గేదె కాలు కదలించటంవలన నైతేనేమి పాలతపేలా ప్రక్కకు వొరిగి పాలన్నీ నేల పాలైనాయి. ఆ నేరానికిగాను శాంతమ్మ గుడ్లురిమి, “అంత కళ్లు నెత్తికెక్కాయా? వొళ్లు దగ్గరపెట్టుకొని పని చేయటం నేర్చుకో! ఎవరను కొన్నావో–అర్ధరూపాయిపాలు మట్టి పాలైపోయాయి. నువ్వు సంపాదించేది ఏమన్నా ఉందా?” అన్నది.

జానకమ్మ తాత్కాలికంగా నోట్లో పైట చెంగు కుక్కుకొని తరువాత చాటుగా కళ్లు తుడుచుకొంది. ఇట్లా శాంతమ్మ తన ముందు కోడలు నోరు విప్పే తాహతు లేకుండా చేసుకుంది.

శాంతమ్మ పెత్తనంవల్ల కుటుంబానికి డబ్బుబాగా చేకూరిందని ఊళ్లోవాళ్లు చాలామంది అభిప్రాయపడి, ఆవిడను అభినందించారు.

శాంతమ్మ పొందిన ఆనందానికీ, గర్వానికీ అంతుందా?

* * *

భార్య కాపరానికి వొచ్చిన దగ్గర్నుంచీ రామారావుకు తల్లిప్రవర్తన, ముఖ్యంగా తనని అదుపు ఆజ్ఞల్లో పెట్టడం, భార్యను బానిసగా చేసుకోవటం – సుతరామూ నచ్చలేదు. ఆవిడ ఇరుగుపొరుగు యిళ్ళ వాళ్లతో కబుర్లు చెబుతూ, ఇంటి పనంతా కోడలుచేత చేయించటం కూడా

రామారావుకు నచ్చలేదు. ఈమధ్య అతను తల్లియిచ్చే డబ్బులు చాలక పది పదిహేను రూపాయలవరకూ ఊళ్ళో కిళ్ళీ దుకాణంలో అప్పు చేశాడు. కిళ్లీ దుకాణపు వీరాస్వామి బజార్లో కనపడ్డప్పుడల్లా నిలవేసి అడగటం రామారావుకు చిన్నతనంగా ఉండటమూ, అదే బజారు కావటంవలన తప్పించుకు తిరిగేందుకు కూడా వీల్లేకుండా ఉండటమూ - పెద్దచిక్కుల్లో పెట్టింది. ఒక రోజున తెగించి విషయమంతా తల్లికి నివేదించి, అప్పు తీర్చే బాధ్యత తనపైనున్నదని చెప్పాడు. పైగా ఈ ఒక్క బాకీ తీరిస్తే ఇహ బాకీలు చేయనని కూడా ముందుగానే చెప్పాడు.

అందుకు శాంతమ్మ మూడవనేత్రపు ఛాయలు రెండు నేత్రాల్లోనే చూపించి, కొడుకును నానాతిట్లూ తిట్టి, "ముందు ముందు నీ బ్రతుకు బజారీపాలు కాకపోతే నే చెవి కోయించుకుంటాను" అని వాడి భవిష్యత్తు కూడా నిర్ణయించింది.

రామారావుకు వొళ్లు తెలియని కోపం వచ్చి ఉక్కిరి బిక్కిరయ్యాడు. వెనవది తను యింతవాడై, ఇరవై రెండేళ్ళ వయస్సులో వుండి, రేపో ఎల్లుండో తండ్రి కాబోతున్నవాడై తల్లి పెత్తనం క్రింద నీచపు బ్రతుకు బ్రతకటమా? తను ఎందుకు పెత్తనం చేయకూడదూ! అనే భావం అతనిలో బలంగా నాటుకుంది.

అందుకు తగినట్టుగానే ఇద్దరుముగ్గురు అతనితో అన్నారు:

"చెట్టంత పెరిగావు. ఇంకా నీవు ఒకళ్ల చాటున బ్రతకట మేమిట్రా. మీ అమ్మ నుంచి పెత్తనం లాక్కోలేవూ?"

భార్య నోటినుంచి కూడా విన్నాడు:

"ఏమిటండీ, మీ తల్లి పెత్తనం క్రింద మనం జీవించలేం. మీరు లాక్కోరాదూ పెత్తనం."

తరువాత ఒకరోజు డబ్బు ఖర్చుచేసే విషయంలోనే శాంతమ్మకూ రామారావుకూ పోట్లాట వచ్చింది. ఎన్నడూ ఎదురు తిరగనివాడు ఆరోజు పూర్తిగా ఎదురు తిరిగాడు. ఇదంతా కోడలు తనమీద చేసిన దుష్ప్రచార ఫలితమనుకొంది. కొడుకూ కోడల్నిద్దర్నీ కట్టగా తిట్టింది శాంతమ్మ. రామారావు సహించలేకపోయాడు. తల్లిని తిట్టి కొట్టాడు.

"ఏమో అనుకుంటున్నాను. ఇకనుంచి నాదే పెత్తనం. నీదేమీ లేదు. ఇంత పడవేస్తాం. తిని ఊరుకో!" అని రామారావు ఇనప్పెట్టె తాళంచెవులు శాంతమ్మ దగ్గర్నుంచి బలవంతాన లాక్కున్నాడు. శాంతమ్మకు తెరిచిన నోరు తెరిచినట్టుగానే, తడిఅయిన కళ్లు తడి అయినట్టుగానే ఉండిపోయినాయి. తన ఎరుకలో ఉన్న నలుగురైదుగురు పెద్దమనుషుల్ని పిలిపించి, వాళ్ళదగ్గర యేడ్చి, కొడుకు దౌష్ట్యాన్ని కళ్ల కద్దాలు కట్టినట్టు చెప్పింది.

"ఇది నా స్వవిషయం. ఇందులో జోక్యం కలిగించుకోవాల్సిన అగత్యం మీకు లేదు." అని ఖచ్చితంగా చెప్పాడు, రామారావు ఆ పెద్ద మనుష్యులకు.

శాంతమ్మ తన మంచితనం అక్కరకు రాలేదని శోకాలు తీసింది. అవి రామారావు చెవికి కానీ, జానకమ్మ చెవికి కానీ సోకలేదు అక్కడున్న పెద్దమనుష్యుల చెవులకు తప్ప.

శాంతమ్మ మామూలు మనిషైంది. కాని తాను అంతకంటె హీనస్థితిలోకి దుమికినట్టు ఆవిడ అభిప్రాయపడుతూంది. పూర్వపు ఔన్నత్యమూ, అహంకారమూ, గర్వమూ, ఠీవి ఆవిడలో లేకపోవటమే కాక విచారమూ, న్యూనతా, అణుకువా కలిగి ఉండాల్సిన దుస్థితి ప్రవేశించింది.

తల్లి దగ్గర్నుంచి పెత్తనం చేచిక్కించుకున్నాడు రామారావు. ఇక అతను ఆ యింటికి సర్వాధికారి. ఏది జరగాలన్నా అతనిపరంగానే. వీడు యేడాదిలోనే



ఇనుపపెట్టె తాళంచెవుల గుత్తి తీసి శాంతమ్మ దోసిట్లో పెట్టేటప్పటికి శాంతమ్మ గొంతు చించుకుని బావురుమంది



ఉద్యోగి:- సార్. రేపు నాకు కొంచెం పనుందండి. సెలవు తీసుకోమంటారా?

అధికారి:-ఏం పని?

ఉద్యోగి:-నా భార్య రేపు ఏవో నగలు బేరం చేయాలనుకుంటోందండి.

అధికారి:- వీల్లేదోయ్. రేపిక్కడ చెయ్యాల్సిన పని చాలా వుంది.

ఉద్యోగి:- (సంతోషం పట్టలేక) థాంక్యూ సార్. మీ ఋణం ఎన్నటికీ తీర్చుకోలేనండి.

తను సంపాదించిన ధనమంతా కర్పూరాన్ని కరిగించినట్టు కరిగించివేస్తాడు, ఎట్లాగురా భగవంతుడా! అనుకుంది, శాంతమ్మ. రామారావుమీద ఆవిడకు యేమాత్రం విశ్వాసం లేదు. భర్త చనిపోతూ అన్నమాటలను ఆవిడ జ్ఞాపకం చేసుకోని దినం లేదు.

జానకమ్మ తన భర్త పెత్తనం వహించగానే ఎప్పటికిమల్లే శాంతమ్మకు దడిచి పని చేయటం లేదు. ఇది మరి శాంతమ్మ అహానికి గొడ్డలిపెట్టు. కొడుకు గూడా అననే అన్నాడు.

"దానిచేత అస్తమానమూ పనిచేయించకపోతే నీవుకూడా చేయరాదూ!"

ఇంకా మూడుపూటలూ తిని పనిచేసే దాసీకీ తనకీ భేదమేముంది అనుకుంది శాంతమ్మ.

రామారావు పెత్తనం వహించి నెల గడిచిందో లేదో చాలా అనవసరమైన ఖర్చులు చేస్తున్నట్టు శాంతమ్మకు అగపడ్డది. ఇద్దరి పిల్లలకూ, తనకీ, భార్యకూ మంచి మంచి గుడ్డలు తెచ్చాడు. పై పెచ్చు ఒక రేడియో సెట్టు తెచ్చి, యింట్లో పెట్టాడు. ఇవన్నీ అనవసరమైన ఖర్చులు కాక మరేమిటి?

డబ్బును ఎట్లా గడించాలో, గడించిన డబ్బును ఎట్లా దాచవలెనో శాంతమ్మ అనుభవపూర్వకంగా, ఉదాహరణలతో సహా చెప్పింది. రామారావు ఆలకించి ఆచరణ సాధ్యం కాదని ఊరుకున్నాడు. రామారావుది యువకరక్తం కనుక, ఒక ఆశయాన్ని యేర్పరచుకొని దానిప్రకారం జీవితాన్ని నెట్టుకుపోవాలనే ఉద్దేశ్యం లేనివాడు కనుక, నియమాల ప్రకారం నడుచుకోలేనివాడు కనుక-ఇంట్లో ఉన్న డబ్బును ముందూ వెనకా ఆలోచించుకోకుండా సౌఖ్యంకోసం ఖర్చుపెడుతున్నాడు.

ఊళ్లో క్రొత్తగా ఒక సినిమాహాలు ప్రారంభించారు. అందులో రామారావు భాగం కలిశాడు. మిగతా ముగ్గురు భాగస్థులు ఒకటై సంవత్సరాంతమున అయిదు వేలు నష్టం చూపించారు. అంతే కాకుండా రామారావు వ్యభిచారానికి అలవాటుపడి చాలా దబ్బు ఖర్చుపెట్టాడు. ఒక్క సంవత్సరంలో శాంతమ్మ సంపాదించిన డబ్బంతా ఖర్చుపెట్టాడు. శాంతమ్మ గుండె బాదుకొని విలపించటం తప్ప యేమీ చేయలేకపోయింది. మొదట్లో భర్త ప్రవర్తన చెడుగా కనబడకపోయినప్పటికీ జానకమ్మకు రానురాను భర్త కేవలం చెడు తిరుగుళ్లు తిరుగుతున్నాడనే నమ్మకం సాగింది.

మరో సంవత్సరంలో ఒక యకరం పొలం అమ్మాడు.

ఒక కాఫీహోటలు తెరిచాడు, అయిదు వందల పెట్టుబడితో. ఆ హోటలు నడిచింది మూడు నెలలే అయినా ఎనిమిది వందలు నష్టం వచ్చింది. స్నేహితులు, రౌడీలు తినటమే కాని డబ్బు ఇవ్వటం లేదు. రూపాయలకు రూపాయలు అప్పులుపెట్టిన వాళ్లు కానీ యిచ్చిన పుణ్యానపోలేదు. గల్లాపెట్టెలోని డబ్బులు యేరోజు వారోజువి సొంతం రామారావుకు చేరేవికావు.

ఇంకో ఎకరానికి సరిపడ్డ అప్పుచేశాడు, రామారావు.

ఇక లాభం లేదనీ, యిట్లా రెండు సంవత్సరాల్లో ఉన్న అయిదెకరాల పొలం కాజేస్తాడనీ, పిల్లలకు బొచ్చె తప్ప మిగలదనీ తేల్చుకొని శాంతమ్మా, జానకమ్మా—రామారావు మామకు కబురు చేశారు. జానకమ్మతండ్రి వచ్చి అల్లుడి పరిస్థితంతా కనుక్కున్నాడు.

"ఇట్లా చేస్తే ఎట్లారా అబ్బాయి. పొదుపుగా డబ్బు కూడబెట్టే మీ అమ్మని కొట్టి పెత్తనం లాక్కొని యింత నీచంగానా ప్రవర్తించేది? పిల్లలు, భార్య, తల్లి ముందుముందు యేం కాను? వీళ్ళంతా నీ మీదనే ఆధారపడి జీవించేవాళ్ళే కదా! నీ అంతట నువ్వు చెడుదిరుగుళ్లు తిరిగి డబ్బంతా ఖర్చుపెట్టేసే రేపు అందరి బ్రతుకులూ బజారుపాలేగా! ఇక పెద్దవాణ్ని నా మాట విని, ధనం వ్యయం చేయటం మానుకో! తల్లి చెప్పినట్టు విను." అని చెప్పాడు, జానకమ్మ తండ్రి.

ఇట్లా చెప్పేవాళ్లని చాలామందిని చూశాను అనుకున్నాడు రామారావు. ఒక చెవిని వింటూంటే మరో చెవినుంచి దాటిపోయినయ్ ఆ మాటలు.

తన మాటలు వినిపించుకోలేదని ఇంకో నెలరోజులు గడిచింతరువాత అర్థమైంది, జానకమ్మ తండ్రికి. పై పెచ్చు రామారావు త్రాగుడు కూడా అలవరచుకొన్నాడు. జానకమ్మతండ్రి నిష్ఠాతుడు. ఇక ఈ విధంగానైతే లాభం లేదని చెప్పి-ఇంకో సంవత్సరమూ రెండుసంవత్సరాలూ గడిస్తే ఉన్న పొలం కాస్తా అయిపోతుందని శాంతమ్మకు నచ్చచెప్పి, ఆ పొలం కాస్తా జానకమ్మ పేరె వ్రాస్తే పిల్లలకి భవిష్యత్తులో తిండి ఉంటుందని అన్నాడు. శాంతమ్మ ఒక పట్టాన ఒప్పుకోలేదు. ఎంత చెడ్డా తనవాడు, తనకి పుట్టినవాడు-వాడి నుంచి పెత్తనం మరొకళ్ళ చేతులోకి పోవటం తనకంత శ్రేయస్కరమైంది కాదు. చివరకు అంతకంటె గత్యంతరం లేక, ధనమే వాణ్ని ఆవిధంగా మార్చిందని నమ్మి వియ్యంకుడి వాక్యాల ప్రకారం ఒప్పుకుంది. కాని రామారావు అట్లా వ్రాస్తాడా?

కరణంగారితో ఆలోచించాడు జానకమ్మ తండ్రి. త్రాగించి మనస్సు సరిగా లేనప్పుడు మన పనికి ఉపయోగించుకోవచ్చు అన్న సలహాప్రకారం జానకమ్మ తండ్రి పొలమంతా కూతురు పేర వ్రాయించి అల్లుడిచేత సంతకం పెట్టించాడు.

తీరా అంతా జరిగిపోయిం తరువాత తన కొడుకుకు యేవో అపచారం పరాయివాళ్ల వల్ల జరిగినట్టు బాధపడింది శాంతమ్మ.

* * *

ఇనప్పెట్టె తాళంచెవులు తాను దగ్గరుండి కూతురుకు యిప్పించాడు, జానకమ్మ తండ్రి-ఆయన నెలరోజులపాటు వుండి రామారావుకు నీతిబోధలుచేసి కూతురుమీద ఈగ వాలనీయకుండా చూసి వెళ్లాడు.

శాంతమ్మకు ఆలోచించుకొన్నకొద్దీ ఆశ్చర్యం వేసింది. ఏమిటి, తన యెదుటే తన యింటి పెత్తనం ముగ్గురిదగ్గరకు మారింది. లోకమంతా యింతేనా?

రామారావు జరిగిన అపచారం తెలుసుకున్నాడు. ఇదంతా మామయ్య కుట్రని నిర్ణయించుకున్నాడు. భార్యదగ్గర తిట్టాడు.

"అంతా నీ మేలుకొరకేరా! నీ పిల్లలు ముందుముందు బ్రతకటానికేరా?" అని అన్న శాంతమ్మను కొట్టే పర్యంతమయ్యాడు, రామారావు.

సహజంగా పెత్తనం చేతికిరాగానే సంతసం, గర్వంపొందినట్లే జానకమ్మ కూడా తాళంచెవుల గుత్తిని బొడ్లో పెట్టుకొని అధికారిణి ఠీవి చూపించింది కాని, అయితేనేం–రామారావుముందు చెల్లలేదు. రామారావు కిళ్లీదుకాణం పెట్టాడు, హోటలు ఎత్తేసి. దుకాణంమీద వొచ్చే రెండూమూడు రూపాయలు యేం చాలతాయి? ఇంట్లో డబ్బు లివ్వమని భార్యను వేధించుకుతింటున్నాడు. ఇవ్వనంటే తిడతాడు, కొడతాడు.

రోజూ జరిగే ఈ తతంగాన్ని భరించలేక జానకమ్మ, "మా నాన్నని పిలిపిస్తాను" అన్నది. వాళ్ల తల్లి చావడంతో తండ్రి ఒక్కడే వండుకొని తింటూ వుంటున్నాడు.

"ఏం పిలిపిస్తే. ఎవడికి లావు. ఎవడికి భయం. ఏదీ ఈతఫారానియ్ చెబుతాను. ఇంత మోసంచేసి వెళ్ళినవాడు మళ్ళీ ఏ ముఖంతో వస్తాడో!" అన్నాడు రామారావు, రోషంగా.

కాని మరి జానకమ్మ కబురుచేస్తే వచ్చినప్పుడు మామముందు యేమీ మాట్లాడలేకపోయినాడు. జానకమ్మ తండ్రి వారం రోజు లుండిపోయినాడు. ఆ వారం రోజులూ అల్లుడుకు యేవేవో చెబుతూనే ఉన్నాడు. రామారావు ఆలకించినా తనకి సంబంధించిన విషయాలు కావనుకున్నాడు.

తండ్రి వెళ్ళేటప్పుడు అన్నది జానకమ్మ.

"నాన్నా! నీవు అక్కడైనా చెయ్యి కాల్చుకోవాల్సినవాడివేకదా? ఇక్కడే వుండిపోరాదా. ఆయన నిత్యం డబ్బులివ్వమని నన్ను ఛండాలంగా కొడుతూ వుంటాడు. నువ్వే యిక్కడ వుండి పెత్తనం చేయకూడదూ!" అన్నది.

"కాదులే. బాగుండదు. వాడే దారికి వస్తాడులే" అని వెళ్లిపోయాడు జానకమ్మ తండ్రి.

ఇంతకాలానికిగాను శాంతమ్మకు కోడలుచేత మాట అనిపించుకోవాల్సిన గతి పట్టింది. పెద్దతనం వొచ్చాక కూడా తిని కూచోటానికి లేదు. అధవా అల్లా కూచుంటే, "తినంగా సరా! కుటుంబం అన్న తరువాత గంపెడు పనులుంటాయి. అంతా ఒక్కరూ ఎట్లా చేస్తారు. సాయపడకూడదూ?" అంటుంది జానకమ్మ. ఏమీ పనిలేకపోతే శాంతమ్మకు పిల్లల్ని ఆడించమనైనా పని చెబుతుంది. పెత్తనం పతనమైపోయిన మనుషులంటే ఎంత తేలిక?

ఒకరోజు మధ్యాహ్నం "నాకు పాతిక రూపాయలు కావాలి? ఇవ్వు" అన్నాడు రామారావు భార్యతో.

"ఎందుకు?" అన్నది జానకమ్మ.

"ఎందుకా! నాక్కావాలి? ఎందుకు అనటానికి నువ్వెవతెవు. నీకేం అధికారముంది. ఇంకా పైగా నా ఆస్తంతా తింటూ నా డబ్బు నాకు పారేయమంటే నీ కంత గింజాట నెందుకూ?"

అవతల పిల్లవాడు గుక్కపట్టి యేడుస్తోంటే జానకమ్మ భర్తమాటలు సరీగ్గా వినిపించుకోకుండా పిల్లవాణ్ని సముదాయించను పోయింది. రామారావుకు అమితమైన కోపం వచ్చింది. సముదాయిస్తోన్న భార్యను వెనకపాటుగా వెళ్ళి వీపుమీద బలంకొద్దీ గుద్దాడు.

"అమ్మో!" అంటూ క్రింద పడింది. చావట్లో కోళ్ళకు బియ్యపుగింజలు వేస్తూన్న శాంతమ్మ తత్తరపాటుగా వొచ్చి రామారావును పట్టుకుంది. రామారావు తిడుతున్నాడు.

రెండు నిముషాలు గడిచాక జానకమ్మ తెగించి అన్నది. "మీరు ఎంతవరకు కొడతారో చూస్తాను. మీకు దమ్మిడీ ఇవ్వను. ఏంచేస్తారో చేయండి. రేపు మా నాన్నకు కబురుచేస్తాను. ఈ కొంపలో మీతో నేను వేగలేను."

రామారావుకు కళ్ళల్లోకి యెగ తన్నింది కోపం. జానకమ్మను తన్నబోయాడు. శాంతమ్మ బలవంతాన ఆపింది. బండబూతులు తిట్టి బజారు కెళ్ళాడు.

జానకమ్మ తండ్రి దిగాడు, మరుసటి రోజు – జానకమ్మ యేడ్చి జరిగిందంతా పూసగ్రుచ్చి చెప్పి, "ఇక నువ్వు పెత్తనం చేయాల్సిందే నాన్నా!" అన్నది.

జానకమ్మ తండ్రి కొంచెంసేపు ఆలోచించి "సరే" అని శాంతమ్మతో సంప్రదింపులు జరిపాడు. ఆవిడ అదిరిపోయి కొసకు 'నాదేముంది' అన్నది.

జానకమ్మ తండ్రి ఇనప్పెట్టి తాళం చెవులు మొలత్రాడులో కట్టుకున్నాడు.

శాంతమ్మ లోలోపల కుమిలిపోతోంది. జానకమ్మ రాణిత్వం వెలిగిస్తోంది. రామారావు తోకతెగిన కుక్కలాగా యేమీ పాలుపోక తిరుగుతున్నాడు. మామమీద అంతులేని ద్వేషం పెరిగిపోతోంది కానీ అతనికి కర్తవ్యం బోధపడటంలేదు.

జానకమ్మ తండ్రి రామారావుకు రోజుకింతని 'బేటా' రూపంలో డబ్బులిస్తున్నాడు. జానకమ్మ శాంతమ్మని తన క్రింద బానిసగా చేసుకుంది.

తన పెత్తనంలో డబ్బును కూడబెట్టాలని జానకమ్మ తండ్రి నిశ్చయించుకున్నాడు. ఊళ్లోవాళ్లు తమని అసహ్యించుకున్నప్పుడు రామారావు కానీ, శాంతమ్మకానీ సమాధానం చెప్పలేకపోయినారు.

పెత్తనమనేది ఒకరికి జన్మతో వచ్చిన హక్కుకాదు. అది ఎల్లప్పుడూ ఒకరి అధికార్యాన్నే, ఒకరినే ఆవరించుకొని ఉంటుందనేదాంట్లో నిజంలేదు. కాని పెత్తనం ఎక్కువకాలం నిలుపుకోనే సమర్థత, నేర్పు చాలకొద్దిమంది కుంటుంది. అవకాశం వున్న ప్రతివారికీ పెత్తనం చేయాలనే ఆరాటం జాస్తిగానే వుంటుంది. అయితే, సామర్థ్యం ఎక్కణ్నుంచి వొస్తుంది?



సీరియల్:

పరారి

(నాటిక)

జాన్ గాల్స్‌వర్దీ

మూడో ఘట్టం

[ముప్పై రెండు గంటల తరవాత. మైదానంలో ఒక పెద్ద హోటల్‌లో ఒక గది. ప్రొద్దు తేటగా లేకపోయినా కిటికీ తెరల ప్రక్కలనించి వెలుగు చొరబడుతోంది. లోపల అద్దం అమర్చిన ఒక మేజా, ప్రక్కనే కుర్చీ, ఒక గోడవార పడక మంచం, ఆప్రక్కనొక కుర్చీ. కుడివైపు గోడమూల ఒక నీళ్ళతొట్టి. వరండాలోనుంచి గదిలోకి రావడానికి ఒక ద్వారం కాక, ఎడమప్రక్క ఒక చిన్న ద్వారం. కుర్చీలపైన బట్టలూ, గదిమధ్యలో స్లిప్పర్లూ గది గజిబిజిగా ఉంటుంది. పడకపైన ఒక యువతి నిద్రబద్ధకంలో దొల్లుతూ ఉంటుంది. తలుపు తట్టిన చప్పుడు]

యువతి: (బద్ధకంగా) రా లోపలికి. (దాసి ఒక గిన్నెతో వేడినీళ్లు తెచ్చి నీళ్లతొట్టిదగ్గిర ఉంచుతుంది)

దాసి: ఏడున్నరైనాదండి.

యువతి: (ఆవలించి) అబ్బ! తెల్లారినా ఇలా వుందేం ఇవాళ?

దాసి: మంచు ఇంకా వొదల్లేదండి. ఇయాల గది మార్చాలన్నారు?

యువతి: అవును. మరిచేపోయాను సుమా. ఇవాళ మావారొస్తారు.

[దాసి కిటికీ తెరలు ఒత్తిగిస్తుంది.]

దాసి: పారిపోయినోడింకా దొరకలేదంటండి.

యు: ఆ! లేదూ (లేచి కూచుంటుంది పక్కలో) బలే! కథ మంచి పట్టులో ఉందన్నమాట.

దాసి: ఈమంచుమూలానండి. రెండు రోజులు మట్టి సిక్కకుండా దాపులోనే తిరుగుతున్నాడంటండి! పార్కులో పోలీసోణ్ణి సంపింది ఈడేనంటండి.

యు: నిజం? ఎవరు కెప్టెన్ డెనాంట్ కాదూ?

దా: ఎక్కడికి పోతాలెండి ఇంతవరకూ తప్పించుకున్న వాళ్లెవరూ నేరండి.

యు: తప్పించుకోలేరా? పాపం. ఈ మంచులో......

దాసి: అల్లు తిండికి బట్టకి యెతుకోక్కొద్దండి మరి? అదు గలాటప్పుడే సిక్కిపోతారండి.

యు: (ఆవలించి) ఛీ! వెధవమంచు, వీధిలోకి వెళ్ళడానికి లేదు. ఇంక లేస్తున్నా!

దా: సెపోతా లెండి. బట్ట సర్దుకొని తొరగా మొకం కడుక్కోండి.

లేచి (దాసి వెళ్లిపోతుంది. యువతి పైన గౌను వేసుకొని కిటికీవద్దకు వెళ్లి తెర తొలగించి తొంగిచూస్తూంది. కిటికీకి ఊచలుండవు గాని తలుపులు తెరిచి వుంటాయి. పక్క చిలక్కొయ్య మీదున్న తువ్వాలు అందుకుని గది దాటి చిన్న ద్వారం తెరుచుకుని వెడుతుంది. తలుపులు మూసుకోగానే గోడవారపడక కదుల్తుంది. డెనాంట్ చప్పుడు కాకుండా మంచం కిందనుంచి వచ్చి నిలబడతాడు. చింపిరిజుట్టు, పెరిగిన గడ్డం, మాసిన దుస్తులు బూట్లు చేతబట్టుకుని సవ్వడి కాకుండా అడుగులు వేస్తూ ఇటూ అటూ పరకాయించి చూస్తాడు.)

డె: అరె! ఇది ఆడవాళ్ళ గదిలా వుంది! ఎలాపోవడం?

(కిటికీదగ్గిర కెళ్ళి జాగ్రత్తగా బైటికి తొంగిచూస్తాడు. చటుక్కున వెనక్కి ఒదిగి ఊపిరి బిగబట్టుకుంటాడు. ఈమారు ద్వారం దగ్గరికి చేరతాడు.)

యువతిగొంతు (దూరంనించి అస్పష్టంగా) అబ్బబ్బ! నీళ్ళంత చల్లారిపోతే ఎలా స్నానంచేసేది?

(డెనాంట్ ఉలికిపడి పక్కకి ఒత్తిగిలి గోడకి అంటుకుపోయి నిలబడతాడు. తలుపు తెరుచుకుంటుంది. డెనాంట్‌కి తలుపు చాటవుతుంది.)

యువతి: (సుమ్మంలో నిలబడి); మళ్ళీ నీళ్లు వెచ్చబడగానే చెప్పు.

(వెనకనే తలుపు మూస్తూ డెనాంట్‌ని చూడకుండా అద్దం మేజావద్దకు వెడుతుంది. ఈ అదనులో డెనాంట్ తలుపు మూసి గట్టిగా అదిమి పట్టుకుంటాడు. అద్దంలో కొత్త వ్యక్తిని చూసి యువతి అదిరిపడి గిరుక్కున తిరుగుతుంది.

డెనాంట్: శ్ ! ఫరవాలేదు. మాట్లాడకండి.

యువతి: ఎవరు? ఎల్లా...నాగదిలోకెందుకొచ్చావ్?

(డెనాంట్ తలుపు వొదిలి పెడతాడు)

డె: (రహస్యంగా) ఆడవాళ్ళుంటారనుకోలేదు. క్షమించండి. నిజంగా నేనెరగను.

[పారిపోయిన కెప్టెన్ ఇతనేనని ఆకస్మికంగా ఆమెకి స్ఫురిస్తుంది.]

యు: నువ్వేనా ఖైదునుంచి...(మాట పూర్తిచెయ్యకముందే సహాయంకోసం అరవాలని కిటికీవద్దకు వెడుతుంది. కాని అతని ముఖము చేష్టలూ చూసి ఆగిపోతుంది.)

డె: కొంచెం మందరస్థాయిలో మాట్లాడితే మళ్ళీజన్మకైన మీ కడుపున పుడతాను.

యు: (భయం తీరి) ఇక్కడికెందుకొచ్చావ్? ఎలా వొచ్చావ్?

డె: మంచంకిందున్నాను - చాల సేపణ్ణించి. కనిపెట్టలేకపోయాను ఆడ...

యు: ఏం? నా జుట్టు పొట్టిగా వుందనా?

డె: అబ్బెబ్బె! కాదు.

యు: నేను గుర్రుపెట్టలేదనా?

డె: (తెల్లబోయి) అబ్బే! (కొంచెం ఆగి) గుర్రుపెడితే ఆడా మొగా తేడా తెలుస్తుందా! అబ్బే! నేనూ గుర్రుపెట్టలేదు. గుర్రుపెడితే మీకు తెలిసిపోయేదే..

యు: అంటే? మంచంకింద నిద్రపోయావా?

డె: (బుర్ర గోక్కుంటూ) అవును, కాని ఆడవాళ్ళున్నారని తెలిస్తే...

యు: బలే పెద్దమనిషివి. ఇంకెందుకు? వెళ్ళమ్మా గా.

డె: నిజమే. వెళ్ళిపోతాను. కాని ఎక్కడికి?

యు: బాగుంది. నేనేలా చెప్పను?

డె: చూడండి నాస్థితి. ఇలా ఈ గడ్డంతోనూ ఈ బట్టలతోనూ ఎలా వెళ్లడం?

యు: అయితే నన్ను బట్టలిమ్మంటావా?

డె: అహహ! మీ దగ్గి రెండుకుంటాయిలెండి. కాని తినడాని కేమైనా ఇస్తే మీకు ఆజన్మాంతం...

యు: (అలమారు తెరిచి చాకలేట్ ఇస్తుంది) ఇదిగో తిను. అసలు నిన్నిప్పుడు పోలీసులకి కప్పగించవలసింది తెలుసా?

అనువాదం:
సూరంపూడి సీతారామ్

డె : అవునవును. కాని మీకు జాలి లేక పోలేదు.

యు : (హాగత్త పనిచేస్తుంది) నువ్వవరో నాకు తెలుసులే. నీ పేరు పేపర్లలో కెక్కింది. కాని నా స్థితి కూడా గమనించావా?

డె : నా స్థితి తప్ప నాకిప్పుడు మరేం కనపడ్డం లేదు.

యు : నిన్నిప్పుడు పోలీసులికప్పచెప్పక పోతే ఎలా? ఎలా బైటపడతావ్?

డె : కొంచెం మంచినీళ్లు తాగవచ్చా అక్కడ?

యు : ఓ!

[డెనాంట్ తొట్టిదగ్గిర కెళ్ళి పంపు తిప్పి నీళ్లు తాగుతాడు. ఈ అదనులో యువతి గబగబా చెదరిపడివున్న బట్టలు తీసి పరుపుకింద కుక్కుతుంది. కుక్కేసి ఇంకేముందా అన్నట్లు గది అంతా కలయ చూస్తుంది. తరవాత ఏమీ ఎరగనట్లు అద్దం దగ్గిర నిలబడుతుంది.]

డెనాంట్ : అమ్మయ్యా! ఇక చాలు. కాని పులి వెంబబడితే ప్రాణాలకోసం పరుగెత్తే మేక స్థితి ఎలా వుంటుందో ఆలోచించారూ? (యువతి లేదన్నట్లు తలూపుతుంది) పోన్లెండి. మీ కెందుకా బాధ. అమ్మయ్య! ఇప్పటికి స్థిమితం చిక్కింది.

యువతి. (ఏదో అద్భుతమైన విషయం పొంగట్టినట్లు) ఇక్కడికి జైలు ఎంత దూరంలో ఉందో తెలుసునా? మూడు మైళ్ళే!

డె : తెలుసు. తప్పించుకున్న రాత్రి పది హేను మైళ్ళు పారిపోవాలనుకున్నాను. కాని తెల్లారేసరికి మైలుదూరంలో ఉన్నాను. మంచంలో ఏంచెయ్యడం? అదేమి టక్కడ? రేజర్ కాదూ?

యు : అవును. మా ఆయనది. ఎందుకు? (డెనాంట్ రేజర్ అందుకుంటాడు.) (యువతి తత్తరపాటుతో) దేనికైనా హద్దుండాలి కెప్టెన్ డెనాంట్ నీ చేతిలో కత్తి ఉండకూడదు.

డె : అబ్బెబ్బె! మరెందుకూ కాదు, గడ్డం గీసుకోవాలని. గీసుకోవచ్చా? బట్టలెరువు తెచ్చుకున్నా, ఈ గడ్డంతో తప్పించుకోడం ఒట్టిది. (గబగబా సబ్బు రాసి గడ్డంగీసేస్తాడు) నాకీ పని మూడు నిమిషాలుపట్టదు.

యు : కాస్తంతలో పట్టుబడి తప్పించుకోడం జరిగిందా?

డె : రెండుసార్లు వేటకుక్కలు మీద పడినా తప్పించుకున్నాను.

యు : వేట కుక్కలా?

డె : అదే. పోలీసులు.

యు : అసలిక్కడికి కెలా వొచ్చావ్?

డె : ఎల్లా వొచ్చానో నాకే తెలియదు. అబ్బ! తల్చుకుంటే కంపం పుట్టుకొస్తుంది. నిద్రకోసం మొహం వాచి పోయానుకోండి. ప్రాణాల మీద ఆశవొదిలేసి ఎవరుంటారో కూడా చూసుకోకుండా కిటికీలోంచి లోపలికి దూకాను. మాట్లాడకుండా మంచంకింద దూరాను. వెంటనే నిద్రపట్టేసింది. అసలు తెల్లారకముందే లేచి ఏదైనా చిక్కితే కొన్ని బట్ట లందిపుచ్చుకుని పారిపోదామనుకున్నాను. కాని మీదాసి పిలిచేదాకా మెలుకువ రాలేదు. (ముఖం రుద్దుకుని ఆమె అందించిన తువ్వాలుతో తుడుచుకుంటాడు.)

యువతి : అయితే రాత్రంతా నా మంచంకిందే పడుకున్నావా?

డె : అవును. ఏంచెయ్యను?

యు : ఈ వింతెక్కడా వినలేదు.

డె : నిజమే. ఇలా తప్పించుకోడం కూడా ఎప్పుడూ జరగలేదు.

యు : నీమీద కేసు కథంతా పేపర్లలో చదివాను.

డె : నేను చాలా చెడ్డవాణ్నను కుంటారు కాదూ? (కొద్ది ఉద్రేకంతో) జైలులో ఎల్లా గడిపేవాణ్నో చెప్పమంటారా? మర్యాదస్తుల మనుకునే వాళ్ళతో ఊహాతర్కం సాగించేవాణ్ని.

యు : (చిరునవ్వుతో) ఇప్పుడో?

డె: ఇప్పుడలా కాదు (తడబడి) అహఁ. నేననేదేమిటంటే, నన్ను అందరూ నీచుడనుకుంటున్నారని, అంతే. మిమ్మల్ని గురించి కాదు.

యు: కోర్టులో చెప్పిందంతా నిజమేనా?

డె : ప్రమాణపూర్తిగా.

యు : పార్కులో అంగాటి యువకుల్ని వేటాడ్డం నిజమే?

డె : అక్షరాలా. కాని నాకు మొదట అనుమానమైనా తట్టలేదండి. పాపం ఆమెని చూస్తే జాలివేసింది.

యు : ఇప్పుడేం చేస్తావ్?

డె : నిజంగా మీదయ ఎన్నడూ మరిచిపోలేను. మిమ్మల్ని చిక్కులో పెట్టడం ఇష్టంలేదు. కాని ఇలా వున్నపళాన్ని ఎలా బైటపడ్డం?

యు : ఏం?

డె : (కిటికీవైపు సంజ్ఞచేస్తూ) వాళ్ళు జాగర్తమీదే ఉన్నారు. అక్కడో పోలీసు గస్తీ వేశాడు.

[యువతి కిటికీలోనుంచి చూస్తుంది.

(56-వ పేజీ చూడండి)

విజ్ఞానవీధులు

"డాక్టర్"





38. సముద్రముమీద వర్షము కురుస్తుందా?

నీటి ఆవిరితో నిండిన మబ్బులు కొండ చరియలకి తగిలి, ఆ కొండల చల్లదనంవల్ల ద్రవీభవించి వర్షంగా పడతాయని పాఠాల్లో నేర్చుకున్నాము. అంతమాత్రమే నిజమైతే కొండలేలేని సముద్రాలమీద వర్షము కురవనేకూడదు. కాని కొండల మీదా మైదానాలమీదా మాత్రమే కాక సముద్రముమీద కూడా వర్షము కురుస్తుందని నావికులందరికీ తెలుసు. చేపలుపట్టే బెస్తవాళ్ళైనా చెప్తారా విషయం.

కొండలమీద వర్షము కురవడానికి కొండలచల్లదనం ఒక కారణం కావచ్చు. కాని సామాన్యంగా వర్షము కురవడానికి ఇది కాదు కారణము. నీటి ఆవిరీ, ధూళి కణాలూ, కలిసి మబ్బు అవుతుంది. ధూళి కణాలుగాని, పొగతాలూకు బొగ్గుకణాలు గాని లేని మబ్బులు కూడా వుంటాయి. ఈ మబ్బుల్ని పైకి ఎగరగొట్టితే అవి విస్తరించి చల్లబడతాయి. భూమిమీద వున్న గాలి సముద్రమట్టము దగ్గర దట్టముగానూ, క్రమంగా ఎత్తుకి పోయినకొద్దీ పల్చగానూ వుంటుంది. మబ్బులు పైకి ఎగరగొట్టబడితే గాలి కొంత దట్టముగా వున్న చోటునుంచి అంతకంటె పల్చగా వున్న చోటికి పోతాయన్నమాట. అంటే వాటిని అణచి పెట్టివున్న గాలిఒత్తిడి తగ్గుతుందన్నమాట. అందువల్ల మబ్బులు విస్తరిస్తాయి. సైకిలు పంపుతో గాలికొట్టుతూన్నప్పుడు సంకు చించిన గాలి వేడెక్కినట్లే, ఆకాశపథాల కెక్కి విస్తరించిపోయిన మబ్బులు చల్లబడతాయి, వాటిలోని నీటిఆవిరీ చల్లబడుతుంది. ఈ చల్లదనం చాలినంతవుంటే ఆవిరి ధూళికణాల చుట్టూ నీటికణములుగా ద్రవీభవిస్తుంది. మబ్బు పైపైకి పోతూన్నకొద్దీ ఈ నీటి కణాలకి ఇంకా నీరుచేరి అవి పెద్దవౌతాయి. చిన్న తుంపరనైతే గాలి పరుపుమీద తేలి ఆడగలవుగాని పెద్దబిందువైతే గాలిలో తేలలేక వర్షబిందువులుగా కిందపడిపోతాయి.

మబ్బులో ధూళికణాలుంటే వర్షబిందువులీ ధూళికణాల చుట్టూ తయారౌతాయి. ధూళికణాలు లేకపోతే ఉప్పురవ్వలేనా సరే. ఇవేవీ లేకపోతే వర్షబిందువులు విరిగిన గాలి అణువుల చుట్టూ ఏర్పడవలసివస్తుంది. ఇలాగ జరగాలంటే చల్లదనము ఇంకా ఎక్కువుండాలి. అంతరిక్షములో ఇంకా పైకి ఎగరగొట్టేగాలి వుంటే మబ్బులకి ఈ చల్లదనము లభిస్తుంది. లభిస్తానే వుందన్నమాట- లేకపోతే సముద్రాలమీద వర్షా లెలాగు కురుస్తున్నాయీ?

39. మొక్కలలో మరుపు

అలవాటు తప్పిపోతే సంగీతము పాడడమూ, ఆపరేషను చెయ్యడమూ, మణులు చెక్కడమూ మరిచిపోతారు మనుష్యులు. చెట్లుకూడా అలవాటు తప్పిపోడమువల్ల కొన్ని వ్యాపారాల్ని మరిచిపోతాయంటే వింతగా వుంటుందికదూ!

మానవులు తమ అవసరముకోసం తోటల్లోనూ ఉద్యానవనాల్లోనూ పెంచే మొక్కలు తమ వంశాభివృద్ధికి తాము చేయవలిసిన పనుల్ని మరిచిపోతాయి. జాఫ్నానారింజ తన పళ్ళలో గింజలు పెట్టడము మరిచిపోయింది. దారితప్పి ఒకటో అరో ఉన్నా అవి గుండుగా ఉండవు. తప్పడగా మిరపగింజలులాగ వుంటాయి. విత్తనాలుగా పనికిరావు. అరటిపళ్ళలో గింజలు నామమాత్రంగా తయారైపోయాయి. విత్తనాలు పెట్టేవయస్సు రాకుండానే పక్కపక్కల బయల్దేరే పిల్లల్ని వేరే నాటి పెంచడము ఆరభించాడు మానవుడు. కనక క్రమక్రమంగా విత్తనాలు పెట్టడం మరిచిపోయింది అరటిచెట్టు.

పువ్వులలో ఆడ మగ భాగాలు రెండూ వుంటాయి సాధారణంగా. తోటల్లో మనము సామాన్యంగా పువ్వుల వాసనకోసం పెంచే మొక్కల పూవుల్లో ఈ భాగాలు పెరగి వికసించడమేనా మానేస్తాయి, లేదా వాటి ప్రకృతి నేనా మరిచిపోతాయి. మందారపు పువ్వులో కీలానికి రెండువేపులా కేసరాలూ పుప్పొడితిత్తులూ వుంటాయి, అండాశయమూ, అండాలూ వుంటాయి. కాని కీలాగ్రానికి జిగురు పదార్థముండదు, పుప్పొడి అంశాన్ని అండాశయం చేర్చే ఏర్పాటూ వుండదు. గులాబికీ ఇంతే. మల్లె కేసరాలు కుంచించుకుపోయి వుంటాయీ, బొండు మల్లెకి కేసరాలు పొట్టి పొట్టిగా గొట్టాములోపలికి ముడుచుకుపోయి ఉంటాయి.

పువ్వులు చెట్టు భాగాలన్నిటిలోనూ ఆకర్షకంగా వుండాలికదా? క్రోటనులు గమనించండి. ఆకుల్ని చక్కగా రంగురంగుల చుక్కలతో తయారు చేసుకుని, పువ్వుల్ని ఏదో మొహమాటానికి పెడతాయి. అవి కాయలవవూ, అయినవి విత్తనాలుగా పనికిరావూ. ఈ అశ్రద్ధవల్ల క్రమక్రమంగా క్రోటనులు పుష్పించడమే మరిచిపోతాయేమో!

40. మందు చేసేపని

రోగాలు వచ్చేకారణాలు తెలియక మనవారు రోగాలు కర్మవల్ల వస్తాయని నమ్ముకున్నారు. మానవుల పరిశోధనలలో బయటపడ్డ కారణాలు రెండుమూడు తెలుసుకుంటే ఈ వెర్రి కొంత వదుల్తుంది. కంటికి అందని అతిసూక్ష్మజీవులు నెత్తురులో ప్రవేశించి పెరిగిపోవడమువల్ల మలేరియా, న్యూమోనియా, కలరావంటి వ్యాధులు వస్తాయి. ఆ క్రిములు రోగుల నెత్తురులో వుండడమూ; అవి నెత్తురువంటి ద్రవంలో ఒకటి రెండుగా, రెండు నాలుగ్గా, నాలుగు ఎనిమిదిగా వృద్ధి అవడమూ; వీటిని ఆరోగ్యవంతుడి శరీరంలో ఎక్కిస్తే ఇవి వైరీతిగా పెరిగిపోయి వ్యాధి తేవడమూ; వాటిని నిర్మూలించే మందుఇస్తే అవి చచ్చిపోయి వ్యాధినిమ్మళించడమూ; ప్రయోగాలుచేసి కనుక్కున్నారు శాస్త్రజ్ఞులు. ఇవి ఒక రకపు

వ్యాధులు.

విటమినులనే రాసాయనిక యోగాలు నెత్తురులో లేకపోతే, అనాస, బెరిబెరి వంటి వ్యాధులు కొన్ని వస్తాయి. శరీరములో అమ్లక్షారాలపాళ్లు సరిగ్గా లేకపోతే కొన్ని వ్యాధులు తలెత్తుతాయి.

ఈ వ్యాధుల నివారణకి మందులు ఏం చేస్తాయీ? అని ప్రశ్న. కొన్ని మందులు సైన్యాలాంటివి రోగక్రిముల్ని తిన్నగా పట్టి సంహరిస్తాయి. మరి కొన్ని, రోగక్రిముల జీవితానికి ముఖ్యావసరమైన పేరా అమినో బెంజోయిక్ ఆమ్లమును తాము పీల్చివేసి (సల్ఫానిలమైడు వంటివి) ఆ క్రిముల్ని మాడ్చి చంపుతాయి. క్వైనుకి జడిసి మలేరియా క్రిములు ఎముకల మూలలలోకి పారిపోతాయిగాని సల్ఫాడ్రగ్సుల ముట్టడికి తిరుగులేదు. క్షయవ్యాధి, కుష్ఠురోగాలకిచ్చే మందులు రోగక్రిములు కక్కే విషాన్ని హరించి కాలక్రమాన్ని శరీర శక్తులు విజృంభించి ఆరోగ్యము సాధించడానికి సహాయపడతాయి. ఈ వ్యాధుల్నించి కోలుకున్న రోగుల శరీరంలో ఈ క్రిములున్నా, వాటి దుర్మార్గాన్ని నిరోధించగల శక్తులు శరీరములో బయలుదేరి నిలిచివుంటాయి; ఆ 'రోగి' ఆరోగ్యంగా బ్రతికి చివరకు చనిపోయేవరకూ.

41. బొట్టు ఏమిటి?

నిన్న మొన్నటిదాకా బొట్టు సౌభాగ్య చిహ్నముగానే ఉంది. స్వరాజ్యమువచ్చిన తర్వాత సినీమాలోని సింగారపు ప్రభావాన్ని కూడా చేర్చుకుని అందపుచుక్క అయింది. బొట్టు అసలు ఎలాగ బయల్దేరిందో తెలీదు కాని, క్రీ. శ. 150 ప్రాంతాన్న మలచిన బార్హుత్ స్థూపశిల్పాలలో నాట్యకత్తెల నుదుట వర్తులరూపములో గోచరిస్తుంది. అజంతా పదవగుహ శాతవాహనాంధ్రరాజులు నిర్మింపించారని శాసనాలవల్ల తెలుస్తుంది. ఈ గుహలోని స్త్రీ చిత్రములకు బొట్టు లేదు.

హైందవులకు అలంకారచిహ్నమని బౌద్ధులు తిలకమును బహిష్కరించి ఉండవచ్చును. ఆరు, ఏడు శతాబ్దములవరకూ ఈ నిషేధము రాజాంతఃపుర స్త్రీలకు వర్తించినది కాబోలు. అజంతా ఒకటి రెండూ గుహలలో రాణుల నొసట తిలకము కనబడదు.

కాని మతములో పెద్ద పట్టుదల లేకపోడమువల్ల కాబోలు చెలికత్తెలు 'లి' వంటి తిలకము పెట్టుకుని కనబడతారు. సుమారు ఈ కాలమునాటివే అయిన సింహళపు సింహగిరి గుహాచిత్రాలలో మట్టుకు ఎర్రరంగు బొట్టు కనబడుతుంది.

బొట్టు కేవలం అలంకార చిహ్నంగానే పుట్టి పెరిగింది. మనవాళ్ళకి ఎందుచేతనో రక్తవర్ణము ప్రత్యేకముగా అందంగా కనబడింది. తాంబూలరసా, [illegible] గోరింటా, కాళ్లపారాణీ, ఎర్రటివే. [illegible] ఇచ్ఛకు ఆహ్వానించి [illegible] "రక్తవస్త్రాన్ని" [illegible] మర్యాద. చిత్రకారులు [illegible] మొదట [illegible] నాడేవారు. [illegible] చిహ్నమైన [illegible] నాడుకున్నారు. [illegible] రక్తము [illegible] కస్తూరిబొట్టు [illegible] ప్రత్యేకత ఏమీ లేదు.

అల్లసాని పెద్దనగారి [illegible] సింధూర తిలకము పెట్టుకుని [illegible] — నందిగించాడన్నది. [illegible] ప్రభావతి '[illegible]' వంటి తిలకము [illegible] రికి ఏది అందమో [illegible] తిలకం ధరించినారు. తిలకము [illegible] చిహ్నము కాని సౌభాగ్యసూచకము కాదు.

పురుషుల తిలకము [illegible] గానే కనబడుతోంది. [illegible] విభూతి పెట్టుకున్నారని [illegible] నామాల్ని నిలువుగా [illegible]. ఈ తిలకము [illegible] అనిగనే [illegible] ఎవరూ చెప్పరు. [illegible] ఎరుపు బొట్టు [illegible] ఆచార్యులవారు [illegible] గ్రంథములోగా ఉండవచ్చు తను భావనా నైపుణ్యమును పలిబుచ్చినారు. [illegible] కొన్ని [illegible] నుదుటికే తగిలించడము [illegible] పాపము స్వామి వారి [illegible], నామము [illegible] అగదే పట్టింది. [illegible] కూడా వైష్ణవుల [illegible] శివలింగాల [illegible] స్వామికిగంధపు [illegible] ముఖానికి [illegible].

42. జీవరాసులలో మగప్రాణి అందమైనదా ఆడప్రాణి అందమైనదా?

అని బేతం [illegible] రామకృష్ణారావు అడుగుతున్నారు.

మగప్రాణే అందమైనది. ప్రకృతి మగప్రాణులకే సౌందర్యము [illegible]. సింహపుజూలూ, [illegible], [illegible] నెమిలిపించ అలంకారాలూ, [illegible] కల కంఠహారాలూ, జింక కొమ్ములూ, ఏనుగు దంతాలూ, ఈ సంగతి విశదము చేస్తాయి. ఇంతకన్నా చిత్రమేమిటంటే కొన్ని ప్రాణులలో మగవాటికి ఆడప్రాణుల నాకర్షించడానికని ఆ సమయానికి కొత్త అందాలు ఏర్పడతాయి. పీతలకి రంగులు వస్తాయి, కొన్నిటికి రంగురంగుల పెద్దపెద్ద గోళ్లు ఎదుగుతాయి. మగ చేపలకి అందమైన పొరలు బయల్దేరతాయి. సమయానికి చేప రంగులతో జిగజిగ మెరుస్తుంది. సాలమన్ చేప దౌడ కొక్కెము లాగ పెరుగుతుంది జంట గట్టే ముందు. కప్పలలో మగకప్పలే బెకబెక శ్రుతులు వేస్తాయి. నీటి యుమకులకు రంపమునీలాంటి 'ముక్కు' వెన్నుముక పొడూగు తేస్తాయి.

అయితే ఈ అందాలన్నీ సృష్టి సాగిపోవడానికి ఏర్పడే అవసరపుటందాలేమో అని గట్టి అనుమానము తగులుతుంది. జంట గట్టే ముందు పిఫిన్ అనే పిట్టకి ముక్కు మీద ఒకరకం పొరల ముక్కు లేచి తర్వాత రాలిపోతుంది. పెంగ్విన్ కి కిందిపెదవి కింద రంగుల కవచము పెరిగి తర్వాత రాలిపోతుంది. మగ పెలికన్ కి ముక్కు మీద అరచేయి యంత వైశాల్యము గల దుబ్బు మొలుస్తుంది, జంటగట్టే కాలము దాటిపోగానే రాలిపోతుంది.

నృత్యమూ, సంగీతమూ కూడా పిట్టలలో కనబడతాయి. ఆకులూ, రెమ్మలూ బహుమతులివ్వడమూ, చిన్నచిన్న గులకరాళ్లు (గూడు కట్టడానికి) ఆడపిట్ట ముందు పడేయడమూ, క్రీడాసనాలూ (ఆడపిట్టని ఆకర్షించడానికే!) కూడా పిట్టలలో వున్నాయి. జంటగట్టే కాలానికి కంఠధ్వని బలపడడానికి గట్టి స్వరపేటికలు ఏర్పడతాయి కొన్ని జంతువులలో. వాసన ద్రవాలు,—ఏనుగు కంటికిపైన స్రవించు మదజలమూ, నీటిగుర్రపు రక్తస్వేదమూ,—కూడా మగ జంతువుకి అదనపు ప్రాముఖ్యత సాధిస్తాయి.

ఈ "అందాలు" ఎందుకు వచ్చాయో తెలుసుకుంటూంటే వాటి ముఖ్యత తగ్గిపోతూంటుంది. అన్నట్టు ఆడప్రాణులలో కూడా ఒక్కొక్కచోట ఈ అదనపు అందం కనపడుతుంది. మిణుగురు పురుగు, ఆడది, ఏ పొదలోనో కూర్చుని జ్యోతిని వెలిగిస్తుంది. అంతకంటె తక్కువగా మెరిసే మగ పురుగులు అటు ఎగురుతాయి. ఫాలరోప్ పిట్ట ఆడదే పెద్దదీ అందమైనదీను. ఇదే మగపిట్టనాకర్షించి, గ్రుడ్లను దాని జాగ్రత్తకి వప్పచెప్తుంది! అంటే ఈ అదనపు సౌందర్యము బాధ్యత వహించ నక్కరలేని జాతికే సమకూడుతోంది!



నా లైదురోజులు తిండిలేక మలమల మాడేవానికి పరమాన్నము పెడితే ఎంతగా సంతోషిస్తాడో; ప్రియురాలి కోసము నిద్రాహారాలు మానుకొని చిర కాలము నిరీక్షిస్తున్న ప్రియునికి అకస్మాత్తుగా ప్రేయసి ఎదురయితే ఎంతగా ఆనందబాష్పాలు రాలుస్తాడో, అంత సంతోషము పొందాడు; వెంకట్రావు జీతము డబ్బులు చేతిలోపడేసరికి. పది హేనురోజులబట్టి చేతిలో డబ్బులేక వెంకట్రావు ఇంట్లో కొంచెం ఇరకాటంగా ఉంది. చివరి కెలా అయితేనేం ఒకటవతారీఖునాటికి జీతం 72 రూపాయిలుముట్టినాయి. అందులో ఒక అరబస్తా బియ్యానికిచ్చి చిల్లరమల్లర దినుసులకయిన ఖర్చుపోను, చేతిలో ఒక 20 రూపాయిలు మాత్రం మిగిలాయి.

అవాళ వెంకట్రావు ప్రక్కవూరి రామయ్యపాలేనికి బయలుదేరాడు. తన మిత్రుడు మూర్తిని కలుసుకొని ముఖ్యవిషయాలు మాట్లాడాలి. మూర్తి, వెంకట్రావులు చిన్నప్పుడు హైస్కూలులో క్లాసు మేట్సు. ఇంటివద్ద ఉబుసుపోనప్పుడు వెంకట్రావు అలా మూర్తిగారింటికి వెళ్ళడం పరిపాటి. ఆవేళ వెళ్ళేటప్పుడు ఎందుకైనా మంచిదని నాలుగురూపాయిలు జేబులో వేసుకొని మరీబయలుదేరాడు. జీతం వచ్చిన మొదట నాల్గురోజులపాటు వెంకట్రావు కొంచెం హుషారుగా నే ఉంటాడు.

ఊరుదాటి మలుపు తిరిగితే మిగిలిన రోడ్డంతా తిన్నంగా పోతుంది. మలుపు దగ్గర నుంచుంటే రామయ్యపాలెం కనిపిస్తుంది. త్రోవమధ్యలో రావిచెట్టుక్రింద ఏదో గలాటా జరుగుతూండడం వెంకట్రావు కనిపెట్టేడు. గలాటాపడుతున్నవారు ఇద్దరుమాత్రమే. ఆడియన్సుగా అక్కడ ఒక కుఱ్ఱాడుమాత్రం ఉన్నాడు. వెంకట్రావు ఆ చెట్టుదగ్గఱకి వచ్చేసరికి ఇద్దర్లో ఒకడు బిక్కమొఖం వేసుకొని అలా రామయ్యపాలెంవైపు పోయాడు...

పైన ఎండ తీవ్రంగాఉంది. టైము మూడు దాటింది. వెంకట్రావుకు చెట్టుదగ్గఱకొచ్చేటప్పటికి దాహం వేసింది. చెట్టు ప్రక్కనున్న నూతి దగ్గఱకెళ్ళి ఒక చేదెడు నీళ్లు తీసి శుభ్రంగా ముఖం చేతులు కడుగుకొని, కాసినినీళ్లు త్రాగేడు. జేబురుమాలుతో ముఖం చేతులు తుడుచుకుంటూ రోడ్డు ఎక్కేటప్పటికి "ఇంత ఎండలో ఏం వెళ్తారు. కొంచెంసేపు కూర్చుని మరీ వెళ్ళండి." అన్నమాటలు విని వెనక్కు తిరిగాడు. అక్కడ ఒకాయన మందహాసము చేస్తూ "కొంతసేపు నీడలో కూర్చుని మరీ వెళ్ళండి......మీది కిష్టాయిపురమే గదండీ! ఎక్కడో చూసిన జ్ఞాపకము." అని తన చేతిలో ఉన్న ముక్కలు అలా ఇలా తిరగేశాడు.

"మరేనండీ!...మీపేరు?" అన్నాడు వెంకట్రావు కొంచెం దీర్ఘంగా ఆలోచిస్తూ.

"నాపేరా? నన్ను మారన్న అంటారులెండి"

"ఏమండీ! ఎవరిక్కడ ఇందాక గలాటాపడుతున్నారు. చాల గందరగోళం జరిగినట్టుందే!" అని అడిగాడు వెంకట్రావు మారన్నప్రక్కన పచ్చగడ్డిలో కూర్చుంటూ.

"అవునండీ. ఆయన నాకు కొంచెం లెఖ్ఖ బాకీపడ్డాడు. ఇవ్వవలసింది పదిహేను రూపాయిలయితే పదరూపాయిలని దబాయిస్తున్నాడు. అంతేనండి."

మారన్న చేతిలోనున్న మూడు పేకముక్కలు అటూ ఇటూ తిరగేశాడు. మళ్లా ఇటూ అటూ కంగారుగా మార్చేసి ఒక చిన్నబల్లమీద పెట్టేడు. ప్రక్కనున్న కుఱ్ఱాడు ఒక అణాకాసు తీసి ఒక పేకముక్కమీద పెట్టేడు. పేకముక్క తిరగేశాడు మారన్న. జాకీబొమ్మ వచ్చింది. మిగతా రెండు ముక్కలు 6, 7 బంతులు. ఆ కుఱ్ఱాడు తన అణాయే కాకుండా మారన్నదగ్గఱ ఒక అణా తీసుకున్నాడు.



పేకముక్క తిరగేశాడు మారన్న. జాకీబొమ్మ వచ్చింది.

అదృష్టవంతుడు

శ్రీ యం. రామారావు

"అంటే బొమ్మమీద పెట్టే మీరు ఆ అబ్బాయికి ఇచ్చేయాలన్నమాట ఎంత పెడితే అంత" అని వెంకట్రావు అడిగాడు కొంచెం ఆటకు దగ్గిరసా కూర్చుంటూ.

"మీరు ఏదో కొంత డబ్బు ఒక ముక్క మీద పెట్టేరనుకోండి. అది తిరగేస్తే బొమ్మయితే, ఎంత పెట్టేరో అంత నేను ఇవ్వాలి. లేకపోతే అది నాదే ఆట మొదట ముక్కలు చూపించే కలుపుతాను" అన్నాడు మారన్న.

మళ్లా వేశారు పందెము. మూడు ముక్కలు ఇలా పైకెత్తి చూపించి అటు ఇటు గమ్మత్తుగా మార్చి బల్లమీద పెట్టేడు. ఈసారి కుఱ్ఱాడు ఒక బేడకాసు తీసి దక్షిణవైపునున్న ముక్కమీద పెట్టేడు. ముక్క త్రిప్పిచూసేసరికి జాకీ బొమ్మ! మారన్నది మళ్ళా బేడ పోయింది. రెండు సార్లు పోయేటప్పటికి కొంచెం మారన్న విసుక్కోడం మొదలెట్టేడు. కుఱ్ఱాడు హుషారెక్కాడు.

ఈసారి కుఱ్ఱాడు మళ్ళీ బేడ పెట్టేడు. తీసి చూసేసరికి అది ఆరు బంతి! కుఱ్ఱాడికి బేడ పోగానే కొంచెం హుషారు తగ్గింది. ఈ దఫా కుఱ్ఱాడు పావలా తీసేడు. ముక్కలు చూపించి ఇటు అటు కలిపేశాడు మారన్న. పావలాతీసి కుఱ్ఱాడు మధ్య దానిమీద పెట్టేడు. తిరగేసి చూసేసరికి జాకీ! పావలా ఎగిరి వచ్చింది కుఱ్ఱాడికి.

వెంకట్రావుకి హుషారు జోరైంది. "నేనూ కాస్తానండీ" అని బోణీగా పావలా పెట్టాడు. కుఱ్ఱాడు కాయడం మానేసి ప్రక్కన కూర్చున్నాడు. ధర్మరాజుగారి పోజు యిచ్చేసి మూడుముక్కలు చూపించి అటూ ఇటూ కలిపేశాడు మారన్న. వెంకట్రావు పావలా ఉత్తరం వైపు ముక్కమీద పెట్టేడు. వస్తుందో రాదో అని వెంకట్రావు కొంచెం గాభరా పడ్డాడు. అంత గాభరాపడ్డప్పటికీ తాను పెట్టిన ముక్కమూల చివర కొంచెం మడత పడినట్లు గ్రహించేశాడు. ఎలాగైతే ముక్కను తిరగేశారు. అది జాకీ బొమ్మ!

లక్కీగా పావలా వచ్చేసింది వెంకట్రావుకి. ఈదఫా అర్ధరూపాయి తీసి మూలకొద్దిగా మడతపడ్డ ముక్కమీద పెట్టేడు. ఆ ఆనమాలువల్ల వెంకట్రావుకి తెలుసు అది జాకీ అని. త్రిప్పి చూసేసరికి మళ్ళీ జాకీబొమ్మ! వెంకట్రావుకి ఇప్పుడో అర్ధరూపాయి వచ్చింది. హుషారు జాస్తి అయింది.

ఈ దఫా రెండురూపాయిల కాగితము తీశాడు. మారన్న ముక్కలు ఇటు అటు మార్చి బల్లమీద పెట్టగానే వెంకట్రావు ఆ ఆనమాలున్న ముక్క మీద పెట్టేశాడు. వెంకట్రావుకి తెలుసు యీ పందెం కూడా తనదేనని. వెంకట్రావుకు కంగా రెక్కువయింది.

"తిప్పండి! గబుక్కున తిప్పండీ" అన్నాడు వెంకట్రావు ఒక్కసారిగా. త్రిప్పారు. అది జాకీబొమ్మకాదు. 7 బంతి!

వెంకట్రావుకి ఏడు బంతి లక్షణము కొంచెం వంట బట్టింది. ఉద్రేకంతో మళ్లీ రెండురూపాయిల నోటు తీశాడు. ఈసారి ఆ ఆనమాలు లేనిదానిమీద పెట్టేడు, కొంచెం ఆలోచించి. ముక్క తిప్పారు. అది ఆరుబంతి! ఆనమాలుది జాకీబొమ్మ! శుభ్రంగా ఆ ఆనమాలున్న దానిమీదే పెట్టే తనకే వచ్చును!

ఈసారి వెంకట్రావు మళ్లీ రూపాయి తీశాడు. ఆనమాలు చూడకూడదని అనుకున్నాడు. మొట్టమొదట ముక్కలు చూపించి మార్చేటప్పుడు జాకీముక్కను వెంటాడుతూ దానిమీదే చివరికి పెట్టేడు. "నేనూ అడ్డానం"టూ ఆ ప్రక్కన కూర్చున్న కుఱ్ఱాడు ఒక పావలాతీసి వెంకట్రావు పెట్టినదానిమీదే పెట్టాడు. దీంతో మారన్న కోపంగా అన్నాడు: "మీ రిద్దరూ ఒకదానిమీదే పెట్టారు. నేను ఒప్పుకోను..." అని ముక్కలు తీసేశాడు. వెంకట్రావు డబ్బుపోయి ఉన్నాడేమో కొంచెం కోపంగా ధూకుడుగా మారన్నమీదకు లేచాడు. అలా పెట్టకూడదని మారన్న; ముందు ఎందుకు చెప్పలేదని వెంకట్రావు గలాటాపడ్డారు. "గొప్ప వాడివే బయల్దేరావు" అని వెంకట్రావు తన రూపాయి తీసుకొని ముఖం మాడ్చుకొని లేచిపోయాడు.

"......అనవసరంగా పోయినాయండి అయిన మూడుంబావలాను ఆఖర్న వాడికీ నాకూ దెబ్బలాటవచ్చిందండీ! నేను పెట్టిన దానిమీదే కుఱ్ఱాడు కూడా పెట్టే ఇద్దరూ పెట్టకూడదని పెద్ద అల్లరి చేశాడండీ..."

కథంతా విని మూర్తిగారు ఒక చిరు నవ్వు నవ్వి ఇలా అన్నారు:—

"నువ్వు నిజంగా చాల అదృష్టవంతుడవయ్యా. ఏదో మూడురూపాయిల పావలాతోనే లేచిపోయావు. ఈ పిచ్చిలోపడి పదులు, ఇరవైలు పోగొట్టుకునేవాళ్లున్నారు. ......ఆ ప్రక్కనున్న కుఱ్ఱాడు వాడి కొడుకో లేకపోతే వాడితాలూకు మనిషో. ఎవరైనా మనిషి వస్తే ఆకర్షించటానికి ఇద్దరూ గమ్మత్తుగా ఆడుతూఉంటారు. అది చూసి నీ మాదిరిగానే అనేకమంది వాళ్ళవల్లో పడుతూంటారు... నువ్వు దెబ్బలాట అన్నావే! ఆఖరిటైములో నువ్వు రైటుగానే పెట్టేవు. నీకు దక్కకుండా చెయ్యడానికి ఆ కుఱ్ఱాడు కూడా నువ్వు పెట్టినదానిమీదే పెట్టాడు. అప్పుడు 'మీ రిద్దరూ పెట్టేరు. నేను ఒప్పుకోను' అని నిన్ను డబాయించాడు. అంతే. ఇది మామూలే..."

దీంతో అసలు రంగు తెలిసింది వెంకట్రావుకి. అతనికి గావిచెట్టుదగ్గఱకు వచ్చేటప్పటికి అప్రయత్నంగా గలాటా జ్ఞప్తికి వచ్చింది... ★



ఒక విద్యార్థి :—ఇవ్వాళ మేష్టారు పాఠం చెబుతూ చెబుతూ గుర్రుపెట్టి నిద్రపోయారు. నువ్వు విన్నావా?

రెండోవాడు :—అవును, అప్పుడేగా నాకు మెలుకువ వచ్చింది?

బొమ్మరిల్లు

బావిలో చందమామ.

రచన:—భుజంగ్


రంగాపురములో గంగన్న అనే
వెంగళాయి ఒకడుండే వాడు
గంగన్నకు తగ్గ భార్య గంగమ్మ
అది పున్నమ వెన్నెల రేయి
పుచ్చపువ్వులా విరబూసి
పాలయేరులా ప్రవహిస్తూ
కన్నుల పండుపై వెన్నెల కాసింది.
కోడి కూయంగ లేచి పగల్లు
ఒళ్లొంచి పనిచేసి విసుగెత్తి
గూడుచేరిన గంగన్న మంచంపై
నడుము వాల్చాడు కొంచెం.
అందమైన చందమామ
నేత్రానందం కాగా
పగలంతా పడిన శ్రమ
ఒకత్రుటిలో మరచాడు.
"కాళ్ళుచేతులు కడుక్కొని,
అన్నమారగించ రారండి"
అన్న గంగమ్మ మాటలు
సన్నగా అతనికి వినిపించాయి.
చందమామ అందాన్ని
పదే పదే తలచుకుంటూ
పాదాల ప్రక్షాళనకై
నూతి చెంతకు చేరాడు
బావిలో చేదను వేశాడు
నీటిలో తొంగి చూశాడు
తన కళ్ళను నమ్మలేకున్నాడు
ఒళ్ళు తెలియకిలా అన్నాడు.


'అయ్యో! పాపం! తారానాధుడు
గ్రుడన బావిలో పడ్డాడే'
చక్కని ఉపాయ మొక్కటి
తళుక్కున మదిలో మెరసింది.



భార్యను బిరబిరా పిల్చాడు
"ఏమే' రావే, త్వరగా రావే
చంద్రుడు బావిలో పడ్డాడు
గాలము తీసుక చప్పునరా "

వెర్రివెంగళి గంగమ్మ
చెరచెర పరుగిడి
గాలము నొకటి గైకొని
బిరబిర బావిని చేరింది.
గంగయ్య గారంతకు ముందే
తాడునొకటి సిద్ధం చేశారు
గబగబ తాడుకు గాలంకట్టి
తొర తొరగ నూతిలో తోశారు.
గిరగిర అటు నిటు
ఇటునటు, అన్ని ప్రక్కల
గాలం కలయ తిరిగింది
టక్కున బండకు తగిలింది.
గాలం రాయికి తగులుకోగా
చంద్రుడు చేతికి చిక్కాడనే
గంపెడాశతో గంగన్న
గట్టిగా తాటిని లాగాడు.
పుటుక్కున తాడు తెగింది
వెనక్కి గంగన్న పడ్డాడు
తలకేమో బలంగానే
గాయమైతే తగిలింది
వెల్లకిలా పడిన గంగన్నకు
చల్లనిమామ ఆకాశములో
మెల్లగ నవ్వుతూ కనిపించాడు
'దెబ్బ తగిలితే పీడాపోయె
అబ్బురంగా చందమామను
అభ్ర పథంలో నిల్పాన'ని
నిబ్బరంతో నీల్గాడు గంగన్న. ★





డాన్ క్విక్ సెట్

పూర్వకథ

లామంచా అనే గ్రామానికి చెందిన డాన్ క్విక్ సెట్ అనే వెర్రివెంగళప్ప తానొక వీరుడుగా చెలామణీ కావాలనుకొని, శాంకో పాంజా అనే చదువురానివాణ్ణి తన బంటుగా చేసుకొని వీరవిహారాలకు బయలుదేరాడు. ఎవరో ఒక ఆడామెను చూచి ఆమెకు డల్ సీనియా రాకుమారి అనే బిరుదాన్ని తనమనస్సులోనే యిచ్చేసి, ఆవిడను మెప్పించటంకోసమే తానీ ధర్మరక్షణమనే కఠోరదీక్షను స్వీకరించానని నమ్మాడు. ప్రథమ జైత్రయాత్రలో యీయనకు అన్నీ పరాభవాలే అయినాయి. ఇంటికి తిరిగివచ్చి వళ్లునయమయ్యాక మళ్ళీ ద్వితీయ యాత్రకు బయలుదేరివెళ్లాడు.

ఒకరోజున రాజుగారికి బహుమానంగా రెండుసింహాలను బండిమీద ఎక్కించుకుపోతున్న ఒకడు యీయనకు తారసిల్లాడు. ఈయనగారికి ఆ సింహంతో పోరాడాలని బుద్ధిపుట్టి దాన్ని కవ్వించాడు. ఆసింహంమాత్రం యీయనను ఖాతరుచేయకుండా వుండిపోయింది. తనను చూచి సింహమే భయపడిపోయింది కనుక తాను 'వీరకేసరి' నన్నాడు. ఎవరో దారిలోకలిసిన డాన్ డైగో అనే ఆయన యిసంతా చూసి యీ వీరుణ్ణి తనయింటికి ఆహ్వానించాడు.

14

'వీరకేసరి' డాన్ క్విక్ సెట్ గారు డాన్ డైగో ఆహ్వానాన్ని మన్నించి ఆయన తాలూకు జమీకి, శాంకో పాంజాతో బాటు వేంచేశారు. డాన్ డైగోకు యీయన రాక అదేదో మహత్తర విషయమైనట్లుగా తోచింది; తన పెళ్లాన్ని పిల్లవాడిని తీసుకొచ్చి యీ వీరుడితో పరిచయం చేశాడు. అక్కడవున్న ఆనాలుగు రోజులపాటూ ఆయనకు, ఆయన బంటుకు సకలోపచారాలు చేయించాడు; వారికి మృష్టాన్నాలుపెట్టి ఆదరించాడు.

యజమానితో పాటు దేశంమీద పడి యిన్ని సార్లు చెడ తిరుగుతున్నా, ఎక్కడా శాంకో పాంజాకు, యిక్కడ వున్నంత సుఖం అనుభవానికి రాలేదు. వాడు జన్మలో తిని కనివిని ఎరుగని వంటకాలు ఏవేవో ఆ డైగో గారు వీడిచేత తినిపించాడు. ఇంత మంచి తిండీ, యింత పెద్ద మన్నన చూసేసరికి శాంకో పాంజాకు యిక అక్కడే వుండిపోదామనిపించింది. వీడు ఎన్ని అనుకొంటే ఏం లాభం? అవతల ఆవీరుడికి పట్టుమని నాలుగు పగళ్లు అయినా గడవకముందే వీర విహారాలకు పోవాలనే తీట ఎక్కువై పోయింది. ఒకరోజు ప్రొద్దున్నే నిద్దర లేచీ లేవటంతోటే వున్న వళంగా ప్రయాణం కట్టమని శాంకో పాంజా గాడికి పురమాయించి, తాను డాన్ డైగోగారివద్దకు, ఆయనగారి భార్యవద్దకు వెళ్లి, వారు తనకూ తన బంటుకు చేసిన మర్యాదలకూ ధన్యవాదాలు చెప్పి చక్కావచ్చాడు.

'ఎప్పటి భాగోతం మళ్లీ మొదలైంది కాబోలురా భగవంతుడా' అనుకొంటూ శాంకో పాంజా తన గాడిదనూ యజమాని గుర్రాన్నీ సరిదీసి, వాటికి జీనులూ అవీ తగిలించి ప్రయాణానికి సిద్ధంగా పెట్టాడు. డాన్ క్విక్ సెట్ గారు పెద్ద సంరంభంతో వచ్చి గుర్రం ఎక్కి దానిడొక్కలో ఒక్క తాపు తన్నాడు. గుర్రం కాలు కదిపి ప్రయాణం ప్రారంభించింది. శాంకో పాంజా కూడా తన గాడిద 'డాపుల్' మూపున ఎక్కి, తన స్వామి పోతున్న దారినే గాడిదనూ నడిపించుకు పోయాడు.

అలా ఒకటి రెండు రోజులపాటు ప్రయాణం చేశాక, ఒకనాటి వుదయం వీళ్లిద్దరూ ఎబ్రో నదిగట్టు మీద తేలారు. నదీ జలం ఎంతో నిర్మలంగా వున్నది. ఆ ప్రాతఃకాల సూర్యకాంతికి గట్టునవున్న చెట్ల ఆకులు చూడ ముచ్చటగా వున్నాయి. మొత్తానికి ఆ వాతావరణమంతా కూడా చాలా మనోహరంగా వుంది. ఆ దృశ్యం అంతా చూసేసరికి డాన్ క్విక్ సెట్ గారి హృదయం ఎందుకనో వుప్పొంగి పోయింది.

మూలం: సెరివాన్‌టెజ్ ★ అనువాదం: శ్రీ విశ్వాత్ముల నరసింహమూర్తి

ఇంతలో నది నీటిమీాద ఖాళీపడవ ఒకటి తేలుతూ యీాయనకంటపడింది. ఆ పడవకు తెడ్లు కానీ చుక్కాని కానీ ఏమీాలేవు. పెద్ద మోకుతో ఒక చెట్టుకు కట్టివేసి వున్నది. ఆపడవను చూసీ చూడటంతోనే డాన్ క్విక్ సెట్ గారికి ఏం బుద్ధి పుట్టుకు వచ్చిందో ఏమో—గుర్రం మీాదినుంచీ దూకేసి ఒక్క గంతులో పోయి ఆపడవలో ఎక్కి కూర్చొన్నాడు. అంతేకాదు;—'రోజినాన్ టీని, 'డాపుల్ ను' కూడా ఏదైనా ఒక చెట్టుకు కట్టేసి శాంకో పాంజాను కూడా చప్పునవచ్చి బోటు ఎక్కమన్నాడు.

"ఎందుకండీ యిప్పుడు బోటు ఎక్కటం; పనిలేక !" అన్నాడు శాంకో పాంజా ఎలాగో ధైర్యం తెచ్చుకొని.

"అట్లు మాట్లాడెదవేమోయ్ శాంకో? సరిగా మనము వచ్చుసరికే యీానావ యిందేల సిద్ధముగా నుండవలెను? అదృశ్య శక్తి ఏదో నన్ను మహత్తర కార్యోన్ముఖునిగా చేయుటకే యీా నావను యిందు నిలిపి వుంచినది. అందులకు సందియము లేదు. మన మూరక అనుమానించుచూ కూర్చొనుట కిది సమయము గాదు. ఏదూరతీరమునందో ఎవరో అమాయకురాలు రాక్షసుల పాల్పడి ఎన్నెన్నియో నరకబాధలు అనుభవించుచుండవలెను. ఆమెను ఆ కిరాతుల బారినుండి తప్పించవలసిన బాధ్యత 'వీరకేసరి' నైన నాపై గలదు. అందులకే అదృశ్య శక్తి యీా నావను యిట నాకై సంసిద్ధముగా నిలిపి వుంచినది. లోకప్రఖ్యాతి నార్జించిన పూర్వ వీరవరేణ్యుల కెల్లరకును మున్ను యిట్లే కదా అదృశ్య శక్తులు ఎన్నియోభంగుల సాయ మొనరించినవి? నీవు మాత్రము యిక కాలహరణము సేయక వేవేగ రమ్ము!" డాన్ క్విక్ సెట్ గారు వాడిమీాద కోపగించారు.

శాంకో పాంజాకు యిక గత్యంతరం లేదు. తన స్వామికి యీా మాదిరిధోరణి పుట్టుకు వచ్చిందంటే, దానికి మరి తిరుగువుండదు. అలాంటి సమయంలో అడ్డుచెప్పితే ప్రయోజనం వుండబోదనేది వీడికి యిదివరకు ఎన్నోసార్లు అనుభవమైవున్నది. లోలోపలనే సణుక్కొంటూ గొణుక్కొంటూ అగుర్రాన్ని గాడిదను దగ్గరలోనే ఓ చెట్టుకు కట్టేసివచ్చి పడవలో ఎక్కి కూర్చున్నాడు. శాంకో పాంజా పడవలో కాలు పెట్టిందే తడవుగా డాన్ క్విక్ సెట్ గారు మొలలోనుంచి కత్తిని తీసి, దాంతో పడవకుకట్టివున్న మోకును కోసేశాడు.

పడవ ఏటివాలును పట్టి కదిలిపోతున్నది. పడవ వూగిసలాడటం ఎక్కువౌతున్న కొద్దీ, శాంకో పాంజాకు దిగులుకూడా అధికమైంది. వాడి మనస్సులో మెదలిన ఆ దిగులు పొగరాజి రాజి, చివరకు గప్పున మంటలు పైకి లేచినట్లు—ఒక్కసారిగా పెద్ద పెట్టున వచ్చే ఏడుపులోకి దిగింది. ఒక వంకను విడవకుండా ఒకే శృతిలో ఏడుస్తూ "చూడండి; నాగాడిద 'డాపుల్' ఎంత గోలపెట్టి పోతున్నదో దానిని విడిచి మనం యిలా వెళ్లిపోతున్నందుకు ఆ మూగ ప్రాణి మనస్సు ఎంత తల్లడిల్లిపోతున్నదో! ఆపకుండా ఓండ్ర పెట్టుతున్నదే...అయ్యో నాగాడిదా! ఈ వేళతోనే నీకూ నాకూ ఋణం తీరిపోతున్నదా" అంటూ చేతులు రెండూ మొఖానికి అడ్డంగా పెట్టుకొని బావురుమన్నాడు. మళ్లీ ఎట్లాగో కొంచెం తేరుకొని "చూడండి పాపం...ఆ 'రోజినాన్ టీ'ని చూడండి! మిమ్మల్ని వదిలిపెట్టి వుండలేక అది కట్టుతాడు తెంచుకు మనవైపుకు పరుగెత్తుకు రావటానికి ఎంత తంటాలు పడుతున్నదో ఒక్కసారి కన్నెత్తి చూడండి. నామీాద మీాకు జాలిలేకపోతే మానె! మిమ్ములను యింతకాలం తనవీపున మోసుకు తిరిగిన ఆమూగ జీవాన్నైనా కనికరించి, పడవను ఒడ్డుకు పట్టించండి" అంటూ ఆయనగారి కాళ్లావేళ్లా పడి బ్రతిమాలాడు.

వీడి యీా గోడు చూస్తూంటే డాన్ క్విక్ సెట్ గారికి చిర్రు ఎత్తుకొచ్చింది. తనను ఏదో అదృశ్యశక్తి యిలా కీర్తి పథానికి నడిపించుకు పోతుంటే, శనిలాగా వీడు అడ్డు తగులుతున్నాడనిపించింది.


"ఓరీ పిరికిపందా! నత్తగుల్లా! ఏమి చూచినావనిరా నీ కింతటి భయము? ని న్నే భూతము తరుముకొని వచ్చుచున్నది? నిన్నెవరు హింసించుచున్నారు? ఎందుల కింతటి జేల వమ్యేదవు? నీకే చేటుకాలము దాపురించినదిరా శుంఠా! నీవేమైన చోరరాని సీమలలో ప్రయాణించుచుంటివా? కనరాని కారడవుల నడచుచుంటివా? ఎందుల కిట్లు తల్లడిల్లిపోయెదవు? ఈ సుందరమయ ప్రకృతిలో, యీా తరంగడోలి

కలలో, యీ నావ వయ్యారి నడకలో హాయిగా సర్వంసహా చక్రవర్తివలె ప్రయాణించలేక ఎందుల కిట్లు గుండియ లవియునట్లేడ్చెదవు?" అంటూ వాడికి యింత గడ్డి పెట్టాడు.

వీళ్లిద్దరూ యిలా ఏడుపులు పెడబొబ్బలు, తిట్లూ, శాపనార్థాలతో కాలం గడుపుతూ వుంటే ఏటివాలులో కొట్టుకు పోతున్న ఆ పడవకు క్రమేపీ వేగం హెచ్చింది. పడవ వడివడిగావచ్చి ఒక మలుపు తిరిగింది. ఎదురుగుండా ఒడ్డుమీదవున్న పెద్ద పిండి మర కట్టడం, అంత ఎత్తున డాన్ క్విక్ సెట్ గారి కంట పడింది. అంతే!—శాంకో పాంజాగాణ్ణి తానింతసేపూ తిట్టుతున్న మాటే మరచిపోయి—"ఆదెస గాంచుము శాంకో—ఆ మహోన్నత కుడ్యములచే విరాజిల్లు ఆకోటను పరీక్షించి చూడుము. అందు ఎవరో అప రూప లావణ్యవతి బందీఅయివుండవలె. ఆమెను ఎవరో క్షుద్రులు నానాబాధలు పెట్టుచున్నారు కాబోలును. ఆమెను విముక్తి చేయించుటకే కాబో లును—అదృశ్య శక్తి నన్నిటకు రప్పించినది" అంటూ డాన్ క్విక్ సెట్ గారు అర్రులు చాస్తున్నాడు.

ఆ మిల్లులోవుండే యింజను యీ నదిసీటిని తెగతోడిపోస్తూ, ఆ శక్తితోనే పనిచేస్తుంది. మిల్లు దగ్గర ప్రాంతంలో వుండేనీటిని ఆ యంత్రం చప్పు చప్పున పీల్చేస్తున్నది. ఆ కారణంచేత వీళ్లు ఎక్కిన పడవ మిల్లుదగ్గరకువస్తున్నకొద్దీ పడవవేగం మితిమీరి పోతున్నది. ఆ పడవవేగాన్ని అరికట్టకపోతే, యిక కొద్దిక్షణాలలోనే ఆ యిద్దరు మనుష్యులతోనూ పడవ పడవంతా పెద్దరాక్షసుడి నోట్లోకి పోయే వడియం ముక్కలాగా మిల్లులోకియీడ్చుకుపోతుంది. ఆతరు వాత పడవకానీ, పడవలోవున్న మనుష్యులు కానీ ఒక్క పిసరైనా మిగలకుండా అంతా పప్పుపప్పు కావలసిందే! ఇంతపెద్ద ప్రమాదం ముంచుకువస్తున్నా డాన్ క్విక్ సెట్ గారు తన ధోరణి మార్చుకోనేలేదు.

అదృష్టవశాత్తు ఆ పిండిమరయజమాని దూరంనుంచీ పడవఏదో మిల్లులోకి చొచ్చుకువస్తుం డటం గమనించాడు. మరలో పనిచేసే నలుగుర్ని కేకేసి, తలాఒక గడ చేతికియిచ్చి, పడవఏదో ప్రవా హంలో కొట్టుకువస్తున్నదనీ, అది మిల్లు ఆవరణలోకి వచ్చేలోగానే ఎలాగో ఓలాగు దాన్ని ఆపేసి,



అందులోవుండే మనుష్యులనైనా కాపాడటానికి ప్రయ త్నించమని ఆ నలుగురినీ పురికించాడు. తనూ ఒక గడ పుచ్చుకు వాళ్ళవెనకాలే పరుగెత్తుకొంటూ వచ్చాడు.

వాళ్ళందరూ పిండిమరలో అప్పటిదాకా పని చేసిన మనుష్యులైనందువల్ల, వాళ్లందరి వొంటినిండా, బట్టలనిండా పిండి బాగా ఐదారు అంగుళాల ఎత్తున పేరుకుపోయివున్నది. పిండికొట్టుకొన్న యీ ఆకా రాలనుచూసి, డాన్ క్విక్ సెట్ గారు తానింతసేపూ వూహించుకొంటున్న రాక్షసులే యిలా తనను ఎదుర్కోవటానికి పెద్దపెద్ద కర్రలు పుచ్చుకు వచ్చా రని అనుకొన్నాడు.

'ఆ పడవలోనివాళ్లు ఎవరో,—పాపం. అన్యాయంగా చచ్చిపోతారే' అన్న బెంగకొద్దీ పిండి మరయజమాని బిగ్గరగా ఏమిటేమిటో అరుస్తు న్నాడు. ఈ అరుపులకన్నిటికీ సమాధానంగా, డాన్

క్విక్ సెట్ గారు తన కత్తినిఎత్తి గాలిలో తిప్పుతూ "ఓరీ మదాంధులారా? ముష్కరులారా! మీ పాలిటి యముడను యిదే వచ్చుచున్నాను. నేటితో మీ దుస్తంత్రములకు స్వస్తి. దురహంకారులై మీ రే అమాయకురాలిని చెరసాలయం దుంచితిరో ఆమెను తక్షణమే విడుదలచేసి, నాకు మర్యాదగా అప్పగించవలె. లేకున్నచో—మీ ప్రాణములు మీవికావు!" అంటూ గొప్పగా హెచ్చరికలు పుచ్చరిస్తున్నాడు.

మిల్లుయజమాని కాసీ, ఆయన తాలూకు మనుష్యులుకానీ యీయనగారి యీ వెర్రివాగుడు వినిపించుకోకుండా, రాబోయే ప్రమాదాన్ని తప్పించటానికే నానాయాతనలు పడుతున్నారు. మిల్లు పునాది దిమ్మలమీద తలా ఒకచోట ఎక్కికూర్చొని ప్రవాహవేగంలో చొచ్చుకువస్తున్న పడవను గడలతో పట్టి ఆపటానికిగల సులువులేవో ఆలోచిస్తున్నారు. పడవను బాగా దగ్గిరదాకారానిచ్చి, పడవలోకి అందరూ గడలనుగుచ్చి పట్టుకొన్నారు. కానీ వాళ్లు అలా వస్తూవస్తూవున్న పడవను పట్టేసేసరికి, అది కాస్తా తలక్రిందులైంది. అందులోవున్న డాన్ క్విక్ సెట్, శాంకోపాంజా యిద్దరూ నీళ్లలో బుడుంగున మునిగారు.

ఇంకా నయం!—వాళ్లిద్దరికీ యీత చేతనవును కాబట్టి తీరిపోయింది. ఈతవచ్చీకూడా, డాన్ క్విక్ సెట్ గారు, వీరుడులా కనిపించాలని తొడుక్కొన్న ఆ వుక్కుకవచం వగైరాలు ఆయనకొంపతీసేవే! అప్పటికప్పుడే వాటిబరువుమూలంగా మనిషి రెండుమాట్లు నది అట్టడుగుభాగాన్ని తాకి పైకి తేలాడు. వాళ్ల పుణ్యమా అని ఆమిల్లులో పనిచేసే మనుష్యులు నలుగురూ ఒక్కసారిగా నీళ్లలోకి దూకేసి యీయనను ఎలాగైతేనేం పట్టుకొచ్చి ఒడ్డుమీద పారేశారు. శాంకో పాంజా మాత్రం ఎవరి సహాయమూ అక్కరలేకుండానే ఒడ్డుకు యీదుకు రాగలిగాడు.

వీళ్లందరూ ఒడ్డున జేరి కడగట్టుకుపోయిన ప్రాణాలను కొంతలో కొంతగా సేద తీర్చుకొంటూ వుండగానే, వీళ్లిద్దరూ ఎక్కివచ్చిన ఆ పడవ నీళ్లల్లో కొట్టుకొని పోయి పోయి ఆమిల్లు చక్రాలకు తగులు

(43-వ పేజీ చూడండి)

మొట్ట వేదాంతం

అసలు ఆ యింటిలోని వారి తరహాయే అంత! ప్రతి ఒక్క మనిషీ పెద్ద వేదాంతి లాగా మాట్లాడే వాడే! ఐదేళ్ల వాడి దగ్గర నుండి ఐదుపదులు నిండిన పెద్ద మనిషివరకూ ఎవరిని చూసినా "అంతామాయ!" అని అనే వాళ్లే! పాపం పరాయి వాడెవడైనా కర్మం

శ్రీ పిసపాక నరసింహమూర్తి


జాలిక ఆయింటి ముందుకు వచ్చి దేహీ అని అడిగితే తిండికాదు గదా, పచ్చి మంచినీళ్లు కూడా పుట్టవు. ఎవర్నే మడిగినా, "నువ్వేమిటి, నే నేమిటి, అంతా మాయ !" అంటూ మొదలెట్టే వారు వేదాంత ధోరణిలో.

ఒకరోజు మట్ట మధ్యాహ్నం ఎండ తీవ్రంగా వుంది. అలాంటి సమయంలో అవధాన్లు గారి భార్య మంచినీళ్లకని వూరి వెలుపలి బావికి బిందె పుచ్చుకొని వచ్చి, నీళ్లు తోడుకుంటూంది. పొరుగూరి బాటసారి ఒకడు ఎండలో చచ్చే దాహంగా వుండి దప్పిక తీర్చుకొందామని అక్కడికి వచ్చి, ఆమెను కొంచెం మంచి నీళ్లు యిమ్మని అడిగాడు. దాంతో ఆమె "దాహమేమిటి? నీళ్లేమిటి? త్రాగడమేమిటి? జీవుడికి దప్పికవుంటుందా? అంతా మాయేగాని!" అని అంటూ తనపాటికి తాను నీళ్లు తోడుకో సాగింది. బాటసారి ఆమె సమాధానం విని కొంచెం తెల్లబోయాడు. అయినా ధైర్యం తెచ్చుకొని త్వరగా కొంచెం నీళ్లుపోసి తన దాహం తీర్చమనీ, లేకపోతే ప్రాణాలు పోయే టట్లున్నయ్యని ఆమెను బ్రతిమిలాడాడు.

"జీవుడికి చావు బ్రతుకు లున్నాయపా? అంతా మాయ! అన్నీ యీ మాయదేహానికేగాని జీవుడికే బాధా లేదు" అని ఆమె సమాధానం చెప్పింది. ఈ సమాధానంతో బాటసారికి వెర్రెత్తిపోయింది! తస్సదియ్య - యీమె వేదాంతం వింటూ కూర్చుంటే వున్న ప్రాణాలు కాస్తా ఎగిరి చక్కాపోతయ్యనుకొని, గభాలున ఆమె చేతులోని చేదలాగుకొని కడుపు నిండా నీళ్లు త్రాగేశాడు. ఆ తర్వాత అక్కడున్న యిత్తడి

(౫౫-వ పేజీ చూడండి)





ఐంది పెళ్లి

(పిల్లల నాటిక)



[విశాలంగావున్న వో పెద్దగది. గది మధ్యలో టేబులూ, కుర్చీలూ కనబడుతున్నయ్. టేబులునిండా పుస్తకాలూ కాయితాలూ పడివున్నాయి. రామయ్యగారు హడావిడిగావొచ్చి టేబిలుమీద కాయితాలన్నీ వెదుకుతున్నారు)

రామయ్య : ఏమేవ్—ఎవరే ఇక్కడంతా చక్కబెట్టారూ?... ఆఁ...మాట్లాడవేం, ?...ఏమేవ్... ఏమిటీ ?...అవును నీకెందుకు తెలుస్తుందీ ?

(ఇంతలో వాళ్ళబ్బాయి బుచ్చిబాబు వొచ్చాడు)

రామయ్య : ఏంరా – ఎవడ్రా ఇక్కడి కాయితాలన్నీ కదలించాడు?

బుచ్చి: (భయంగా) ఏ కాయితాలండీ?

రామ : ఏ కాయితా లేమిటి? ఈ కాయితాలూ అవీనూ. వెధవలకి అఖ్ఖర్లేనిదీ లేదూ, కావలసిందీ లేదూ – అన్నీ తియ్యటమే... అబ్బబ్బ...నా ప్రాణం కొరికేస్తున్నారురా...

బుచ్చి : ఏమో – నాకు తెలియదండి. శకుంతల తీసిందేమో–

రామ : నీ మొహం. ఇహ దాని మీద తోస్తాడు.

బుచ్చి : ఇంతకీ ఏమిటండీ కనపడాలి?

రామ : కోపంగా నా శ్రాద్ధం– పో అవతలకి...

(కాంతమ్మగారు – బుచ్చిబాబు వాళ్ల అమ్మ. గరిటెపుచ్చుకు వొచ్చింది)

కాంతమ్మ : అబ్బబ్బబ్బ... దేనికండీ అట్లా విసుక్కుంటారూ ?

రామ : విసుగు కాకపోతే మరి ఏమిటి ? ఇక్కడ నా కాయితాలు పెట్టానా? మళ్ళీ వొచ్చి చూస్తే లేవు. (వెతుకుతూ) అవతల అర్జంటు పని ఏడుస్తోంటే, ఇక్కడీ చావు...

కాంత : అసలు ఎక్కడ పెట్టారో! – (వెతుకుతున్నది)

రామ : ఈ టేబిలు మీద పెట్టానే అంటూ వుంటే–

(వొక్కక్షణం పోయాక)

కాంత : లేవండి – సొరుగులో వున్నాయో ఏమిటో... (అనిలాగి చూసింది)

శ్రీ రావికొండలరావు

రామ : ఇవిగో–(నవ్వుతూ) నా తొందర కాల–ఇందులో పడేశానా;

కాంత : ఆహా – ఏం తెలివయిన వాళ్లూ–వూరికే మీరు గాభరాపడిపోవటం–ఇవతల వాళ్లని గాభరా పెట్టటం(వెళ్లిపోయింది)

బుచ్చి : కాసీ మీకు మహా తొందరండీ నాన్నగారూ–

రామ : పోరా వెధవా – తగలగలదు. ఐనా నువ్వేం తిన్నగయిన ఘటానివా ! ఏదో ఒకటి చేస్తూనే వుంటావు.

బుచ్చి : అబ్బే – నే నెప్పుడూ అసలా కుర్చీలోనే కూచోనండీ–

రామ : కబుర్లు... ఐనా వొరేయ్; ఇదుగో–మరొకసారి చెప్తున్నాను; నా కాయితాలు గానీ కలాలు గాని–ఆఁ...?...

బుచ్చి : ఆఁ...

రామ : ఏవన్నా గాని – ముట్టుకుంటే వొళ్లు చీరేసి విడిచి పెడతాను.

బుచ్చి : నే నెప్పుడూ తియ్యనే తియ్యనండీ.

రామ : నోర్మూయ్ తీశావంటే– ఏం చేస్తానన్నాను?

బుచ్చి : వొళ్లు చీరేసి విడిచి పెడతానన్నారు.

రామ : ఆఁ ... బాగాజ్ఞాపకం వుంటుందా... జాగ్రత్త ...(వెళ్లిపోయారు)

(రామయ్యగారు వెళ్లిపోయాక బుచ్చిబాబు పాట పాడుకుంటూ తన పెట్టె తీసి, వొకపుస్తకం బయట పెట్టి – పెట్టంతా వెదుకుతున్నాడు)

బుచ్చి : (వెతుకుతూ పాట)

పెళ్లి చూసుకుని
ఇల్లు నేసుకుని
చల్లగ కాలం గడపాలోయ్॥
"పెళ్లి"

ఇంతసేపటి నుంచి బుచ్చి వెతికిన వస్తువేదో కానీ అతనికి దొరకనే లేదు. తల్లిని గట్టిగా కేక పెట్టాడు.

బుచ్చి : అమ్మా...అమ్మా...

అమ్మ : (లోపల్నుంచి) ఏమిటిరా?

బుచ్చి : నా పెన్ను ఎవరు తీశారే?

అమ్మ : (లోపల్నించే) ఎవడు తీస్తాడూ ? ఇంతసేపూ ఆయనగారి భాగోతం ఐంది – ఇంక ని నాటకం మొదలు అన్నమాట!

బుచ్చి: (కాస్త ఆలోచించి) ఔనే – అన్నట్టు గోపాలంగాడికిచ్చాను. గుర్తొచ్చింది. మరిప్పుడు రాసుకోటాని కెల్లాగే?

అమ్మ: ఏమోరా; నీ రాతా నువ్వూనూ.

బుచ్చి: (మెల్లిగా అపాశే పాడుకుంటూ ఏదో ఆలోచించి, వాళ్ల నాన్నగారి టేబిలు దగ్గిరికిపోయి, కుర్చీలో కూచుని, ఆయన పెన్ను తీసి తన పుస్తకంలో ఏదో రాసేస్తున్నాడు కొంత సేపటికి శకుంతల – బుచ్చిబాబు చెల్లెలు– వొచ్చింది.)

శకుంతల: (బుచ్చినిచూసి) అచ్ఛా...ఐందిలెండి అబ్బాయిగారి పెళ్లి.

బుచ్చి: (వ్రాసుకొంటూనే తలెత్తిచూసి) ఏం? ఎందుకూ?


శకుం: ఏం తెలీదు; పాపం-నంగనాచి; తుంగ్రబుర!

బుచ్చి: (చికాగ్గా) ఏమిటే నీ గొడవా?

శకుం: (పాట పాడుతున్నట్టు) నాన్నగారి పెన్నూ...ఎందుకు తీశారండీ?-

బుచ్చి: (ఏమీ ఎరగనట్టు) అరరే - నాన్నగారి పెన్నా ఇదీ? అరే-నాదనుకొని రాసేస్తున్నానే! (పెన్ను మూడిచేసి సొరుగులో దాచేస్తున్నాడు)

శకుం: అయ్యో పాపం ఎంత అమాయకుడండీ! నాన్నగారి పెన్నేదో, తన పెన్నుఏదో కూడా తెలీదు.



బుచ్చి: లేదే. నిజంగా నాన్నగారి దనుకోలేదు.

శకుం: సరేలే సరేలే-నాన్నగారొస్తే తెలుస్తుందిలే!

బుచ్చి: ఏం; చెప్తావా?

శకుం. ఆహా! మరి, ఆవాళ, నేను నాన్నగారి పుస్తకం తీశానని చెప్పి ఎందుకు కొట్టించావ్?

బుచ్చి: ఛీఛీ-నేను చెప్పలేదు. అమ్మ చెప్పింది కాబోలు.

శకుం: అదే అదే - అమ్మే చెప్పిందో, ఎవరు చెప్పారో తెలుస్తుందిగా - నాన్నగారు రానీ.

బుచ్చి: పోనీవే-ఇవాళ సాయంత్రం మేమంతా ఫోటో తీయించుకుంటున్నాం - నిన్ను దగ్గిరకు కూడా రానీయను.

శకుం: రానివ్వక్కర్లేదు (వెళ్ళి వో కుర్చీలో కూచుండి) మాకూ వున్నాయ్ ఫోటోలు, కావలసినన్ని.

బుచ్చి: అదికాదు కానీ – ని బట్టలు చాకలాడు తెచ్చేశాడ?

శకుం: ఎందుకూ?

బుచ్చి: మరి ఇవాళ సాయంత్రం ఏం బట్టలు వేసుకుంటావ్? మేమంతా మంచివి వేసుకుంటున్నాం. అన్నట్టు వాళ్ల పాపకూడా వొస్తోందేవ్!

శకు: అదాఎత్తూ! నాకేం ఫోటోలు అక్కర్లేదులెండి.

బుచ్చి: అక్కర్లేకపోతే పోనీగాని-పెన్ తీశానని నాన్నగారితో చెప్తావేమిటే?

శకుం: తప్పకుండా!

బుచ్చి: అలాగయితే...(ఆలోచించి) మొన్న నేనుఇచ్చిన ఆ గుర్రంబొమ్మ ఇచ్చేయ్.



విశ్వకవి రవీంద్రనాథ ఠాగూర్.
పెన్సిలుతో వేసిన చిత్రం. — శ్రీ వై. వెంకటరత్నం (గుంటూరు)

శకుం : ఏం బొమ్మా ?

బుచ్చి : ఆవాళ నువ్వు తలంటి పోసుకొన్నప్పుడు ఇయ్యలేదూ ? ఆ గుర్రంబొమ్మ...

శకుం : అదా...అది యిస్తాను గాని...ఏనుగిస్తే -

బుచ్చి : (ఆశగా) ఏనుగిస్తే నాన్నగారితో చెప్పవా ?

శకుం : చెప్పను.

బుచ్చి : చెప్తే

శకుం : చెప్పనంటె చెప్పను !

బుచ్చి : నాకనేళ చెప్తె ?

శకుం : చెప్పనంటూంటే

బుచ్చి : ఒట్టేయ్యమరి.

శకుం : ఒట్టేస్తే.

బుచ్చి : ఏమని ?

శకుం : సరస్వతీసాక్షి.

బుచ్చి : అదీసంగతి (లేచివెళ్ళి ఏనుగుబొమ్మ తెచ్చాడు)

శకుం : ఇదేమిటీ ? ఆకాలు విరిగిపోయిందేం ?

బుచ్చి : అవాళకే విరిగిపోయి వుంది.

శకుం : నాకొద్దు యీ కుంటి బొమ్మ (విసిరి కిందపారేసింది.)

బుచ్చి : ఇదే నీతోవొచ్చిన పేచీ. ఇప్పుడు నన్నెందుకు లేవ గొట్టావ్ ?

శకుం : ఏమో-అది బావుందను కున్నాను

బుచ్చి : పోనీ - ఇంకేదన్నా కావాలా ?

శకుం : ఇంకేంవున్నయ్ ?

బుచ్చి : తినటానికి కావాలా ?

శకుం : ఛీఛీ - ఆడుకోటానికి బొమ్మలు...

బుచ్చి : బొమ్మల్లేవు.

శకుం : ఐతే ... ఆఁ...అవాళ తెచ్చావూ...చేతిరుమాలూ...

బుచ్చి : ఏదీ ?

శకుం : అవాళ నువ్వుస్కూల్లో పద్దరోజు తేలా ? రంగురంగుల సిల్కుది-

బుచ్చి : ఆఁ...ఆఁ ...అదా?...

శకుం : అదిస్తే -

బుచ్చి : అమ్మయ్యో ! అది నాదికాదే - మా క్లాసు అబ్బాయిది.

శకుం : మళ్ళీ రేపు ఇచ్చేస్తాను.

బుచ్చి : వుహూ...అది లాభం లేదు.

శకుం : సరే ఐతే -

బుచ్చి : పోనీ... మరేదన్నా అడుగే.

శకుం : ఇంకేం వొద్దు...

బుచ్చి : మా నేయ్ ఐతే. (కోపంగా) ఇచ్చినవేవో అక్కర్లేదుట...లేనివేవో కావాలట ! పోతేపో. చెప్పుకో; చెప్పుతీసి తన్నుకో...నాకేం భయంలేదు.

శకుం : 'నాకేం భయంలేదు' అని అన్నావనికూడా చెప్తాను ; వుండు.

బుచ్చి : పో చెప్పుకో ; నీ ఇష్టంవచ్చినట్లు చెప్పుకో !


శకుం : అట్లాగేలే; చెప్తాను.

బుచ్చి : (ఆలోచించి) పోనీ ఈసారెప్పుడన్నా ఏదన్నా తీస్తే చెప్పు.

(42-వ పేజీ చూడండి)



జంతుకోటిలో మానవలక్షణాలు



ఒకనాటి మట్టమధ్యాహ్నపు వేళ న్యూయార్క్ జ్యూలో వున్నట్లుండి భయంకరమైన అరుపులు వినవచ్చాయి. ఆ అరుపులు వినటంతోటే, జ్యూలో చెదురుగా వున్న మనుష్యులందరూ కంగారెత్తిపోయి, ఆ అరుపులు ఎక్కడినుంచి వినవస్తున్నాయో అక్కడికి పరుగెత్తుకొనివచ్చారు.

తీరా అక్కడికి వచ్చిచూస్తే — నలుగురు మానసిక శాస్త్రవేత్తలు ఆడఏనుగు చుట్టూ చేరి దానికి ఏదో చిక్కుప్రశ్న వేసినట్లున్నారు. ఆ ఏనుగు వున్న బోనులో ఒకపెద్ద పెట్టెతెచ్చిపెట్టి దాని అడుగునుంచీ రెండు దారాలు వేలాడగట్టారు. ఆ రెండుదారాలలో ఒకదాని కొసకు ఎర్రని ఏపుల్‌పండొకటి వేలాడుతున్నదన్న విషయం యీ ఏనుగు ముందుగానే గమనించేటట్లు చూసి, దానిని చికాకుపెట్టి, దానికి వున్న తెలివితేటలు ఎంతతీరుగా వున్నాయో అని కనిపెట్టుదామనుకొన్నారు. ఏపుల్‌కోసం ఆశపడ్డ ఆ ఆడ ఏనుగు కళ్లఎదుట కనిపిస్తున్న రెండు దారాల్లో ఒకదారాన్ని లాగింది. కానీ — అది అనుకొన్నట్లు, ఆదారంచివరను ఏపుల్ పండులేదు ! ఇక ఆ ఏనుగుకి పట్టరానంతకోపం వచ్చేసి కయ్యాళ్ళగా అరుపులు అరిచింది.

దానికివచ్చిన ఆ కోపం అంతా బాగా చల్లారేదాకా యీ శాస్త్రవేత్తలు మాట్లాడకుండా వూరుకొని, ఆ ఏనుగు మళ్లీ మామూలు ధోరణిలో పడ్డదన్న నమ్మకం కుదిరాక మళ్ళీ ఆ మాదిరిగానే రెండుదారాలు, కొయ్యపెట్టె దాని కళ్లముందు పెట్టారు. ఎప్పటికేమి కొంప మునుగుతుందోనని నలుగురూపోయి బోను వూచలుగట్టిగా పట్టుకొని నిల్చున్నారు. ఏనుగు కనక యీ సారి కూడా ఏపుల్ పండును పట్టుకోలేక కోపగిస్తే తామూ బోనువూచల మీదిగా దూకేసి తప్పించుకొందామని కాచుకూచున్నారు. కాని యీ సారి ఆ ఏనుగు కిందటి సారిలాగా ఏపుల్ పండును పట్టుకోటానికి తొందర పడలేదు. అక్కడవున్న ఆ పెట్టెనీ, ఆదారాలను బాగా పరిశీలనగా చూసింది. చూసి, చూసి నరైన దారాన్నే పట్టుకు లాగింది! దానికి కావలసిన ఏపుల్‌పండు దొరికిపోయింది. ఇక అప్పటినుంచీ యీ శాస్త్రవేత్తలు ఎన్ని దారాలు పెట్టినా, ఆ ఏనుగు ఏపుల్‌పండు వున్న దారాన్నే గుర్తుపెట్టుకొని లాగటం అలవాటుచేసుకొన్నది.

ఈ విధంగా శాస్త్రవేత్తలు జంతువుల తెలివితేటలు పరీక్ష చేయటానికి ఎన్నెన్నో విధాల పాటుపడతారు. ఏ జంతువు కాజంతువుగా ఆలోచిస్తే, అది సాధించలేని చిక్కు అంటూ ఏదో ఒకటి దొరుకుతుందేమో కానీ, ఏ జంతువూ సాధించలేని చిక్కుసమస్యను మనిషి యింతవరకు కనిపెట్టలేకపోయాడు. అంటే— జంతుకోటికి మానవులను మించిన తెలివితేటలు లేకపోయినా మానవుడికి వున్నంతమాత్రపు తెలివితేటలు వున్నాయనైనా ఒప్పుకోక

తప్పదు. జంతువుల తెలివి తేటలను గూర్చిన యీ మాదిరి పరిశోధనలు జరిపినందువల్ల మానవుడు పరిణామం పొందేలోగా ఏ దశలో ఏ ఏమాదిరి జంతు లక్షణాలు కలిగి వుండేవాడో వూహించటానికి వీలు అవుతుంది. అటువంటి ఆశయంతోనే ప్రపంచ దేశాలలో జంతువుల నడవడికలను గూర్చిన పరిశోధనలు కోకొల్లలుగా జరుగుతున్నాయి. కొన్ని కొన్ని సందర్భాలలో శాస్త్రవేత్తలు కొన్ని రకాల జంతువులు యింకా తల్లికడుపులో వుండగానే, వాటిపై కూడా ప్రయోగాలు చేస్తున్నారు.

పరాయిమనుషుల తెలివితేటలను కనిపెట్టటంలో ఎంత సరదా వుంటుందో జంతువుల తెలివితేటలను కనిపెట్టటంలోనూ అంత సరదా వుంటుంది.

అన్ని జంతువులలోకీ తోకలేని కోతులతో వేగటం మహాకష్టం. వీటి తెలివి తేటలు కనిపెట్టబోయే శాస్త్రజ్ఞుల తెలివి తేటలనే అవి పరీక్షిస్తాయి. గోరిల్లాలు చేతికి ఏది దొరికితే దాన్ని పుచ్చుకొని యీ శాస్త్రకారుల మీదికి గురిచూసి విసురుతాయి. వీటి గురి సామాన్యంగా 12 అడుగుల దూరంలో తప్పిపోదు. ఒకానొక జ్యూలో వుండే ఒక చింపాంజీ రాయినో రప్పనో పుచ్చుకొని ముందుగా తాను ఎగురుకొంటూ వచ్చి, ఎదురు రొమ్మును బోను వూచలకు తాకించి, అప్పుడు ఆరాతిని చేతి కొద్దీ విసరటం నేర్చుకొన్నది. ఇలా చేసినందువల్ల బాగా 20 అడుగుల దాకా గురి తప్పకుండా కొట్టగలనని తెలుసుకొన్నది. గొరిల్లాలు కూడా యీ శాస్త్రవేత్తలను ఏడ్పించగలవు. ఇవి నోటినిండా నీళ్లు పుక్కిట పట్టివుంచి మనిషి అంత దూరంలో వస్తున్నాడనగానే ఆ నీటినంతా నోటి సందులోనుంచి చిమ్మనగొట్టంలోంచి చిమ్మినట్లుగ చిమ్మి, చికాకు పెట్టేస్తాయి.

డక్టర్ బర్చ్ అనే ఆయన చింపాంజీల విషయంలో కొన్ని పరిశోధనలు చేస్తూ న్యూయర్క్ జ్యూలో కాలం గడుపుతున్నాడు. ఆయన పరిశోధనలకోసం దగ్గిరకు వచ్చినప్పుడల్లా చింపాంజీ ఆయనకు తప్పకుండా స్నానం చేయించేది అయినా సరే - ఆయన ఆ కాస్త దానికి కలవరపడటం ఎందుకులెమ్మని ఎప్పటిలాగే తను పరిశోధనలేవో చేసుకుపోతున్నాడు. ఇలా కొంతకాలం గడిచాక ఒకరోజున ఆ డక్టరుగారి భార్యకు భర్త చేసేపని ఏమిటో చూద్దామని బుద్ధి పుట్టింది. సరే-మంచి విలువైన గౌను తొడుక్కొని ఎన్నెన్నో రకరకాల నగలుపెట్టుకొని భర్తతో పాటు జ్యూకి వచ్చింది. వచ్చీ రావటంతోటే చింపాంజీ తన అలవాటుప్రకారం ఆ డక్టరుగారి మీదకు వుమ్మిజల్లు కురిపించింది. డక్టరుగారైతే యీ విధమైన అతిథి సత్కారానికి అలవాటు పడ్డవాడు కాబట్టి ఆయన ఏమీ అనుకోలేదు. కానీ ఆయన భార్యగారికి అంత విలువైన బట్టలు యిలా పాడైపోయినందుకు చాలా కోపం వచ్చింది. ఆవిడ నిష్పతోక్కిన

కోతికిమల్లే మొగుడిమీద తెగ అరిచింది. "ఈ వెధవ కోతికి మానం మర్యాదా నేర్పలేని నీ చదువు ఎందుకు - తగలెయ్యను!" అన్నది. పాపం - డాక్టరుగారి మనస్సు చివుక్కుమన్నది. నిజమే మరి-తానంటే ఏదో పరిశోధనల గొడవలోపడి యివన్నీ అంత పట్టించుకోలేదు కానీ - అందరూ వూరుకొంటారా! ఆ కోతి చేద యీ చేష్టను మాన్పించలేక పోయిన తరువాత తన చదువు ఎందుకు! ఆలోచించాడు - తెగ ఆలోచించాడు. చివరకు ఒక చక్కని వుపాయం తట్టింది. ఇక అక్కడ నుంచీ ప్రతిరోజూ తాను ఆ చింపాంజీ వుండే ఆవరణలోకి రాగానే అది చూస్తుండగా, ముందుగా తానే నేలమీద తుపుక్కున వుమ్మేసేవాడు. అది చూచి ఆకోతి తనూ నేలమీద వుమ్మి వేయబోయేది. ఆ ప్రయత్నంలో తాను అంతకుముందే యీయన గారికి స్నానం చేయించటానికని భద్రంగా దాచివుంచిన నీళ్లు కాసినీ నేలపాలయ్యేవి.



'నాగస్వరం' ఒంటిగీత బొమ్మ.

—ద్రోణాగుల గోవిందరాజ్ (గుడివాడ)

చింపాంజీలకు ఆశలు చూపించి వాటిచేత గంతులు వేయించటం బలే సరదాగా వుంటుంది. ఒకానొక మానసికశాస్త్రవేత్త యిలాగే ఒకసారి ఒక చింపాంజీని పట్టుకొచ్చి దానికి అందకుండా పైఎత్తున అరటిపళ్లఅత్తం ఒకటి వేలాడగట్టాడు. కోతులకు అరటిపళ్లంటే మహా యిష్టం. అందుకని యీ కోతి వాటిని అందుకోవటానికి ఏం చేస్తుందో చూడాలని ఆయన కనిపెట్టుకు వున్నాడు. దానికి దగ్గరలోనే కొన్ని కొయ్యపెట్టెలు పెట్టించాడు. మనకేదైనా వస్తువు అందకపోతే, ఎలాగైతే కుర్చీకానీ, కొయ్యపెట్టెకానీ తెచ్చుకు వేసుకొని, దానిమీదికి ఎక్కి ఆవస్తువును అందుకోవటానికి ప్రయత్నిస్తామో, అలాగే యీ కోతికూడా ఆ అరటిపళ్ల అత్తాన్ని అందుకోవటానికి యీ కొయ్యపెట్టెలను తెచ్చి ఒకదానిమీద ఒకటి పేర్చి వాటిమీదకు ఎక్కుతుందని యీయన అనుకొన్నాడు. ఆకోతి అలాంటిపని ఏమీ చేయలేదు. ఆ పెట్టెలవైపైనా చూడలేదు. అరటిపళ్లవైపు పళ్లికిలించి చూస్తున్నట్లే చూపి, యీ మానసిక శాస్త్రవేత్త పరాకుగా వున్నప్పుడు చూసి, ఆయన పట్లాం వెనుకభాగాన్ని రెండు గుప్పిళ్లలోనూ యిరికించుకొని, మనిషిని ముందుకు తోసుకువచ్చి, సరిగ్గా ఆ పండ్లగుత్తి కింద నిల్చోబెట్టింది. తనను యిలా నిల్చోబెట్టి, బుజాలమీదికి ఎక్కి ఆపళ్లను అందుకోవాలని యీకోతి ఆలోచిస్తున్నదని ఆ శాస్త్రవేత్త యీలోగా కనిపెట్టేశాడు. సరిగ్గా ఆకోతి భుజాలమీదికి ఎక్కబోయే సరికి, తాను మోకాళ్ల మీద వొంగున్నాడు. దాంతో ఆకోతి వేసిన 'ప్లాను' పాడైపోయింది. ఇంత ఆరాటపడినా, ఆ పళ్లు అందనే లేదు! తనకు తోచిన భాషలో ఆయన్ను పడతిట్టుకొంటూ ఆ కోతి ఆయనభుజాల మీది నుంచి కిందికి దూకేసింది.

(55-వ పేజీ చూడుడు)

ఐంది పెళ్లి

(38–వ పేజీ తరువాయి)

శకుం : అబ్బే-ఇవాళే-చెప్తాను! ఇంటికి రాఘూనే చెప్తాను.

బుచ్చి : నమ్మకపోతే?

శకుం : ఎందుకు నమ్మరూ? తీసినట్లు కనపడు తున్నదిగా-

బుచ్చి : (కొర కొర చూసి) ఏడిశావ్ (అని పోయి దూరంగా కూచ్చున్నాడు)

శకుం : (నవ్వుతూ చప్పట్లు చరుస్తూ) హే హే - వుడుకుడుకు మోతోయ్...వుడుకుడుకు...వుడుకు

బుచ్చి : (కోపంగా) నోర్ముయ్యే. తగల గలదు.

శకుం : నాన్నగారొస్తే తగిలేది నీకో నాకో తెలుస్తుంది.

(బుచ్చి లేచి వెళ్లి పోయాడు. శకుంతల పాట పాడుతూ జడవిప్పు కుంటున్నది)

పాట: అవుతుందండీ - ఇవాళా.

అవుతుందీ మా అన్నయ్య

పెళ్లి బుచ్చికి పెళ్లీ అవుతుందీ-

నాన్నగారి చేతితో అవుతుందీ.

అని (పాడటం మొదలు పెట్టింది.)

(రామయ్యగారు వొచ్చారు)

శకుం : నాన్నగా రండీ-నాన్నగారండీ అన్నయ్యే...మీ పెన్ను తీసి ఇష్టం వొచ్చినట్టు రాసిరాసి గీసి గీసి పారేశాడండీ.

రామ : ఎప్పుడే ?

శకుం : ఇప్పుడే!

రామ : ఏం రాశాడూ?

శకుం : బొమ్మలో, గీతలో ఏమిటో...పిచ్చి పిచ్చి గీతలన్నీ గీసి పారేశాడండీ.

రామ : (సొరుగులాగి పెన్ను తీసి చూసి మళ్లీ పెట్టేశారు)

శకుం : పాళీ అంతా అరిగి పోయింది కదండీ, నాన్నగారూ?

రామ : (చికాగ్గా) పోనీలే నువ్వు వూరుకోవే-తీస్తే తీశాడు.

శకుం : మీ పెన్ను ఎందుకు తియ్యాలండీ ?

రామ : (కోపంగా) వాడిష్టం. వాడికికావాలి-రాసేడు. ఎంత సేపూ వొకడిమీద నేరాలు చెప్పటమే గానీ... (అంటూ 'ఏమేవ్' అని కేకపెట్టి లోపలికి పోయారు)

బుచ్చి : (గెంతుతూ వొచ్చి) ఐంది; అమ్మాయి గారి పని ఐంది చెప్పేవా - తెలిసిందిగా - ఎవర్ని తన్నారో-

శకుం : నన్నేం తన్నలేదు లే.

బుచ్చి : తన్నకపోతేతిట్టారు-ఏం?

శకుం: (కోపంగా) తిడితే తిట్టారు...నీకేం?

బుచ్చి : నాకేం ? నాన్నగారి పెన్ను తీసి దర్జాగా రాసుకుంటాను.

శకుం : ఇప్పుడు తియ్యే-

బుచ్చి : ఇప్పుడా - ?...ఇప్పుడెందుకు తీస్తాను ? నాఇష్టం వొచ్చినప్పుడు తీస్తాను. (నవ్వుతూ) నా ఇష్టం...వొచ్చినప్పుడు...

శకుం : (చురచుర చూసి, ఛివాలున లేచి) ఏడిశావ్ లే - కోతి!

బుచ్చి: వుడుకుడుకు మోతోయ్ వుడుకుడుకు...వుడుకు ...పాపం-నామీద నేరాలు చెప్పి తన్నించాలను కొన్నావేం ?... (నవ్వుతూ) ఐందా...?...ఐందా...?... పెళ్ళి... ...(పాట) పెళ్లి చేసుకొని ఇల్లు నేసుకుని...



డాన్ క్విక్‌సెట్

(34-వ పేజీ తరువాయి)

కొని పిస్సి పిస్సి అయింది. వీళ్లందరూ సంభ్రమాశ్చర్యాలతో ఆమిల్లు చక్రాలకేసీ, పగిలిపోయిన పడవతాలూకు ముక్కలు చెక్కలకేసీ చూస్తూ వుండగా, కొందరు పల్లెవాళ్లు పరుగెత్తుకుంటూ అక్కడకు వచ్చారు. తెగ రొప్పుతూనే, యిలా నష్టమై పోయిన తమ పడవను చూచి లబోదిబోమని గోలపెట్టారు. చెట్టుకు కట్టేసిన పడవను ప్రాడదీసి తీసుకువచ్చి మిల్లు చక్రాల్లో పడేసి పాడు చేసినందుకు నష్టపరిహారంగా తమకేదైనా యిస్తే గాని వీల్లేదని వాళ్లంతా పట్టు పట్టారు. గత్యంతరం లేక డాన్ క్విక్‌సెట్ గారు శాంకో పాంజాను పిలిచి, తాము తెచ్చుకొన్న కొద్దిపాటి రొక్కంలోనుంచీ ఏభైనాణేలు తీసి వాళ్లకు యిచ్చి పంపించి వెయ్యమని చెప్పాడు.

అంతటితో యిక తన ప్రతాపాన్ని ప్రకటించే అవకాశం చేయి దాటిపోయిందని గుర్తించిన డాన్ క్విక్‌సెట్ గారు అక్కడినుంచీ కదిలిపోబోయే ముందు ఆమిల్లుకేసితిరిగి అరడజనుసార్లు దీర్ఘనిశ్వాసాలువదిలి "ఈ గాలికోటలో బందీ వై యిడుమలపాలైన ఓ అపరచితయువతీ ! నాకు ప్రాప్తించిన యీ దురవస్థ కారణముగా నేను నీ చెరను విడిపించలేక పోతిని గదా ! నిన్ను విడుదలచేయు భాగ్యము మరి ఏ వీరునికి సంక్రమించనున్నదో కదా ! నేను మాత్రము అశక్తుడ నైతిని !" అంటూ కన్నీళ్లు జొటజొటా కార్చాడు.

అంత మనిషీ నిలువునా నీరై ఏడుస్తూ వుంటే శాంకో పాంజాకు కూడా కడుపులో చెయ్యిపెట్టి కెలికినట్లు అయింది. దబ్బున తన స్వామిదగ్గిరకు వచ్చి, ఆయనను పడిపోకుండా పట్టుకొన్నాడు. డాన్ క్విక్‌సెట్ గారు వాడి భుజంమీద తల ఆనించి అరగంట సేపు ఎక్కి ఎక్కి ఏడ్చాడు.

"ఊరుకోండి ! ఊరుకోండి ! మీరు ఆపకుండా ఏడుస్తూ వుంటే నాకూ ఏడుపు ఆగటంలేదు...భో... భో...భో..." అంటూ వాడూ ఏడ్చేశాడు. అల్లా కొంతసేపు గడిచాక శాంకో పాంజాగాడు తన కోటు జేబులోకి చెయ్యి పోనిచ్చి మురికిపట్టిన జేబుగుడ్డ తీసి తనకళ్లు తుడుచుకొని, ఆ చేతితోనే ఆయనగారి చెక్కిళ్లు కూడా తుడిచాడు.

ఎట్టకేలకు 'వీరకేసరి' గారి శోకం ఆగిపోయింది. శోకమైతే ఆగింది కాని యిద్దరికీ ఎక్కిళ్లు పట్టుకొన్నాయి. ఇద్దరూ ఆ ఎక్కిళ్లతోనే తలలు దించేసుకొని ఏటిగట్టునే నడిచి, యిందాక తమ వాహనాలను కట్టేసిన చెట్టుదగ్గిరకు వచ్చారు. ఆ మూగజీవాలకు ఏమి అర్థమైందో ఏమో, వీళ్లిద్దరూ కంట పడిందే తడవుగా ఎగిరి గంతులు వెయ్యడం మొదలు పెట్టాయి. ఇద్దరూ తమ తమ వాహనాల దగ్గిరకు పోయి, వాటి మొహాలకు తగిలించిన తాళ్లు విప్పేసి, వీపులమీద ఎక్కి కూర్చొన్నారు.

(ఇంకా వుంది)



కృష్ణాపిక్చర్సువారి "అమ్మలక్కలు"లో లలిత.



"మద్రాసువల్లి, కాలేజీలో చదివేసి, కారెక్కి నువ్వూ, నేనూ, అమ్మా, అంతా సినిమాలకీ, నాటకాలకి, తిరణాలకీ తిరుగుదాం. ఏం మాట్లాడవ్?" అని రాఘవరావు సుశీల నడుగుతున్నాడు.

రాజాప్రొడక్షన్సువారి "పుట్టిల్లు"లో రాజారావు, జమున.

సినిమాలలో కళాకారుడు దర్శకుడే

ఒక చిత్రం విజయవంతం కావడానికి కారకులు నటీనటులా, దర్శకుడా, టెక్నీషియన్లా అనే ప్రశ్న మా పాఠకులు పదే పదే అడుగుతున్నారు. ఈ ప్రశ్న చాలా సహజంగా వచ్చే ప్రశ్న. ఎందుకంటే పూర్తిచిత్రం చూసే ప్రేక్షకులకు చిత్రనిర్మాత గాని, దర్శకుడు గాని, టెక్నీషియన్లు గాని కళ్ళకు కనిపించరు. నటీనటులు మాత్రమే తెరమీద కనిపిస్తారు. చిత్రం బావుందంటే నటీనటులు అద్భుతంగా నటించారనీ, బాగులేకపోతే నటీనటులకు ఏమీ చేతకాదనీ ప్రేక్షకులు భావిస్తారు. సినిమాకళ కొత్తగా వచ్చిన కళ గనక, అనేక శతాబ్దాలనుండీ మన మెరిగినది నాటక కళ గనకా ఈ అభిప్రాయం మనలో పాతుకుపోయి వుంది. మిగతా కళలలో కళాకారుడెవరో మనం చప్పున గుర్తుపడితాము. నాటకప్రదర్శనం బావుంటే నటీనటులు గొప్పగా నటించారనుకుంటాము. నవలగాని, కావ్యంగాని బాగుంటే రచయిత చాలా బాగా రాశాడనుకుంటాము. వైణికుడు వీణ బాగా వాయిస్తే వైణికుణ్ణి మెచ్చుకుంటాము. పెయింటింగ్ బాగా వుంటే చిత్రకారుణ్ణే మెచ్చుకుంటాం. కాని సినిమాల దగ్గిరికి వచ్చేసరికి, తెరమీద మనం చూసే దొకరు; వారిని తెరమీద అవిఘ్నంగా కనిపింపజేసిన దింకొకరు. అందుచేత సినిమాలలో అసలైన 'ఆర్టిస్ట్' ఎక్కడున్నాడో కనుక్కోడం తికమక అవుతుంది. సినిమా నిర్మాణానికి నిర్మాత, నటీనటులు, దర్శకుడు, కెమెరామన్ మున్నగువారంతా బాధ్యులైనప్పటికీ ప్రధాన కళాకారుడు దర్శకుడే. దర్శకుడి పని నటీనటులెల్లా నటించాలో చెప్పటమేనని కొంతకాలం క్రితం వరకూ మనలో ఒక అభిప్రాయం ఉండేది. కాని దర్శకుడి పని సినేరియో రచనముంచి

'కటింగ్ రూమ్' లో సెల్యులాయిడ్ ముక్కలను అతికించటంవరకూ అనేకవిధాలుగా ఉంటుంది.

నిర్మాణంలో దర్శకుడి స్థానాన్ని వివరిస్తూ రష్యన్ దర్శకుడు పుడోవ్కిన్ ఒక పుస్తకంలో కొన్ని తమాషా సంగతులు రాశాడు పాఠకులకు ఉపయోగకారులుగా ఉంటాయనే ఉద్దేశ్యంతో అవి కొన్ని ఇక్కడ పొందుపరుస్తున్నాము. పుడోవ్కిన్ ఇలా రాశాడు:


"నేను సినిమా రంగంలోకి చాలా యాదృచ్ఛికంగా ప్రవేశించాను. 1920 వరకు నేను కెమికల్ ఇంజనీరుగా ఉండేవాణ్ణి. నిజం చెప్పాలంటే, నాకు మిగతా కళలంటే ఎంతో ఆసక్తి ఉన్నప్పటికీ సినిమాలంటే అసహ్యించుకునేవాణ్ణి. ఆ రోజుల్లో చాలమంది లాగే నేనుకూడా సినిమా అనేది కళ అని ఒప్పుకోలేకపోయేవాణ్ణి. నాటకంకంటె సినిమా తక్కువరకమైనదని అనుకునేవాణ్ణి.

ఆ రోజుల్లో వెలువడే చిత్రాలనుబట్టి అటువంటి అభిప్రాయం కలగటంలో ఆశ్చర్యంలేదు. ఇప్పటికీ అలాంటి చిత్రాలు చాలా ఉన్నాయి... ఆ చిత్రాల నిర్మాణ పద్ధతికీ కళా సృష్టికీ ఎటువంటి సంబంధమూ లేదు. వాటి నిర్మాతలకి కావలసిందొకటే—వీలైనంతమంది అందమైన అమ్మాయిల మొహాలను వీలైనన్ని కోణాల లోంచి ఫొటో తియ్యడం, హీరో చేత వీలైనన్ని పోట్లాటలు చేయించి గెల్పించడం, గాఢమైన ముద్దుతో కథను ముగించడం ఇటువంటి చిత్రాలను కళగా గౌరవించక పోవడంలో ఆశ్చర్యంలేదు.

"కాని కులెషావ్ - అనే యువకుణ్ణి యాదృచ్ఛికంగా కలుసుకొని, అతని అభిప్రాయాలను తెలుసుకోవటంతో నా అభిప్రాయాలలో పూర్తి మార్పు కలిగింది. కులెషావ్ చిత్రకారుడు, ఫిల్ముథియరీ బాగా తెలిసినవాడు. అతనివల్లే నేను "మాంటేజ్" అనేమాటను నేర్చుకున్నాను. మా సినిమాకళ అభివృద్ధికి ఈ "మాంటేజ్" అనేది ఎంతో సహాయపడింది.

ఇప్పటి ఫిల్ముథియరీని బట్టి చూస్తే కులెషావ్ అభిప్రాయాలు చాలా పురాతనమైనవిగా కనిపిస్తాయి. అతను చెప్పినదంతా యిది: 'ప్రతికళలోను ముందు ముడివస్తువు ఉండాలి తరవాత ఆవస్తువును ఏ కళలో ఉపయోగిద్దామనుకుంటామో ఆ కళకు తగినట్టుగా అమర్చుకోవాలి.' గాయకుడికి ధ్వనులే వస్తువు. ఆ ధ్వనులను ఏదో ఒక తాళంలో అమర్చుకొంటాడు చిత్రకారుడికి రంగులే వస్తువు. ఆ రంగులను కాగితం మీద సమ్మిశ్రం చేస్తాడు. సినిమా డైరక్టరుకు గల ముడివస్తువేమిటి? దానినతడే విధంగా అమర్చుకుంటాడు?

కులెషావ్ చెప్పిందిది: సినిమాలో సెల్యులాయిడ్ ముక్కలే ముడివస్తువు. ఈ ముక్కలను ఒక ప్రత్యేకమైన, కళాత్మకమైన క్రమంలో అతికించటమే సినిమా డైరెక్టరు చెయ్యవలసినపని. నటీనటులు నటించేటప్పుడుగాని, వివిధ దృశ్యాలను షూట్ చేసినప్పుడుగాని సినిమాకళ ప్రారంభంకాదు అదంతా ముడివస్తువును సిద్ధంచెయ్యటం మాత్రమే. విడివిడి ఫిలింముక్కలను డైరెక్టర్ ఒక నిర్దిష్ట క్రమంలో అతికించటం మొదలుపెట్టినప్పు



జైమినీవారి "చిన్నమ్మకథ"లో శోభనమందిరదృశ్యం—కృష్ణకుమారి, శివరావు.



పద్మినిని వలలో వేసుకునేందుకు రకరకాల కానుకలు సిద్ధంచేస్తున్నాడు అక్రమ్ సింగ్.

రోహిణీవారి "ప్రతిజ్ఞ"లో విలన్‌గా రాజనాల

టినుంచే సినిమాకళ ప్రారంభ మవుతుంది. ఒక్కొక్క రకంగా వాటిని అతికిస్తే ఒక్కొక్క రకం ఫలితాలు పుట్టుకొస్తాయి.

మూడు విడి సెల్యులాయిడ్ ముక్కలు మనదగ్గిర ఉన్నాయనుకోండి. ఒక ముక్కమీద ఒక మనిషి నవ్వుతున్న ముఖం ఉంటుంది. మరొక ముక్కమీద భయపడుతున్న ముఖం ఉంటుంది. ఇంకొకముక్కమీద గురిపెట్టబడిన రివాల్వరు ఉంటుంది.

ఈ మూడుముక్కలను రెండురకాలుగా కలుపుదాం. ముందు నవ్వుతున్న ముఖం, తరవాత రివాల్వరు, తరవాత భయపడుతున్న ముఖం కనిపించేటట్లు అతుకుతాము. రెండోసారి భయపడుతున్న ముఖం, రివాల్వరు, నవ్వుతున్న ముఖం వరసగా అతికిస్తాము. మొదటిదాన్ని చూస్తే ఆ ముఖం తాలూకుమనిషి పిరికివాడనీ, రెండోదాన్ని చూస్తే ధైర్యవంతుడనీ గ్రహిస్తాము. ఈ ఉదాహరణ నిజానికి చాలా 'క్రూడ్' గా ఉన్నది. కాని ఇప్పటి సినిమాలనుబట్టి చూస్తే, షూట్ చెయ్యబడిన సెల్యులాయిడ్ ముక్కలను కళాత్మకంగా కలపటం వల్లనే ప్రేక్షకులలో బలమైన ముద్రను వేయగలమని గ్రహించగలం

నేనూ, కులెషావ్ కలిసి ఒక తమాషా చేశాం. ప్రసిద్ధ రష్యన్ నటుడు మోస్జుకిన్ నటించిన ఒక సినిమానుండి ఒక క్లోజప్ భాగాన్ని కత్తిరించి తీసుకున్నాం. ఈ క్లోజప్‌లోని ముఖంలో ఎటువంటి చైతన్యమూ, భావప్రకటన లేదు. ఈ క్లోజప్ భాగాన్ని మరికొన్ని సెల్యులాయిడ్ ముక్కలతో మూడురకాలుగా అతికించాము. మొదటిసారి క్లోజప్ ముఖం కనిపిస్తుంది. తరవాత టేబిల్ మీద పెట్టిన భోజనం ప్లేటు కనిపిస్తుంది. దాన్ని చూసి ఏమనుకుంటాం. మోస్జుకిన్ భోజనంప్లేటు వంక చూస్తున్నాడనుకుంటాం. రెండోసారి అదే క్లోజప్ ముఖం మళ్లీ కనిపిస్తుంది. తరవాత మరణించిన ఒక స్త్రీ శవపేటికలో పడుకోపెట్టబడిన దృశ్యం కనిపిస్తుంది. మూడోసారి అతికించటంలో అదే క్లోజప్ ముఖం, దాని తరవాత ఒక పసిపిల్ల ఆటవస్తువుతో ఆడుకుంటున్న దృశ్యం కనిపిస్తాయి. ఈ మూడురకాల అతికింపులను కొంతమంది ప్రేక్షకులకు తెరమీద ప్రదర్శించాము. వారికి మేముచేసిన తమాషా తెలియదు. ఆ ప్రదర్శన చూసి ప్రేక్షకులు వెర్రెత్తిపోయారు. మోస్జుకిన్ అత్యద్భుతంగా నటించాడని శ్లాఘించారు. మొదటి అతికింపులో మోస్జుకిన్ ఏదో దీర్ఘాలోచనలో ఉండి ఎదురుగా భోజనం చల్లారిపోతున్నది కూడా గమనించటం లేదని అనుకున్నారు.



ఈస్టిండియావారి "సంక్రాంతి"లో ఆశాలత.

తరవాత అతికింపులో మరణించిన స్త్రీని చూసి ఎంతో గాఢదుఃఖం పొందుతున్నట్లు ప్రేక్షకులు భావించి తాము కూడా పరివేదన పొందారు. మూడో అతికింపులో ఆడుకుంటున్న పిల్లను చూసి కనిపించీ కనిపించని మందహాసం చేస్తున్నట్లు భావించి అతని నటనను మెచ్చుకున్నారు. కాని ఈమూడు అతికింపులలోను ఒకే క్లోజప్ ముఖం ఉపయోగింపబడిందని మాకు మాత్రమే తెలుసు."

పుడోవ్కిన్ పైన వివరించిన దాన్నిబట్టి డైరెక్టరు తలచుకుంటే ఎటువంటి వింతలైనా చేసి అనుకున్న భావాన్ని అనుకున్నవిధంగా ప్రేక్షకుల మనస్సుల్లో ముద్రించగలడని వ్యక్తమవుతున్నది. అంతేకాక నటీనటుల నటనను, ఇతర దృశ్యాలను, కెమేరా పనితనాన్ని డైరెక్టరు ముడివస్తువులుగా మాత్రమే స్వీకరించి వాటినుంచి కళాఖండాన్ని సృష్టిస్తాడనికూడా స్పష్టమవుతున్నది.

పుడోవ్కిన్ సిద్ధాంతాల్లోకల్లా 'మాంటేజ్' సిద్ధాంతం ముఖ్యమైనది. ఈ మాటకు ఇంత ప్రచారం బహుశా అతనివల్లనే వచ్చిందేమో. 'మాంటేజ్' అంటే కళాసౌందర్యం దృష్ట్యా చేయబడిన 'ఎడిటింగ్' (మన స్టూడియోలలో ఫిలిం ఎడిటర్‌కు తగినంత ప్రాముఖ్యం లేదు. 'కటింగ్ రూమ్'లో జరిగే ఎడిటింగ్ ఏదో యాదాలాభంగా అయిపోతుందిగాని అక్కడ కళాసృష్టి జరగదు.) నిజంగా 'ఎడిటింగ్' పనిచెయ్యవలసినవాడు డైరెక్టరే. స్క్రిప్టును తయారుచేసేటప్పుడు కథలోని ఏయే అంశాలను ఏ క్రమంలో అమరిస్తే ద్విగుణీకృతంగా ఫలితాలు కలిగేదీ, షూట్ చెయ్యబడిన ఫిలిం భాగాలను, రికార్డు చెయ్యబడిన శబ్దాలను ఏక్రమంలో అతికిస్తే కథ శక్తివంతమౌతుందీ నిర్ణయించేది డైరెక్టరే. చిత్రకారుడు తన రంగులను, గాయకుడు తన స్వరాలను, కవి తన పదాలను ఎంత యథేచ్ఛాక్రమంలో కలగలుపుతారో డైరెక్టరు ఫిలిం ముక్కలను అంత స్వేచ్ఛాధోరణిలో వాడుకుంటాడు. అక్కడే అతనిలోని సృజనశక్తి బయటికి వస్తుంది. సినిమా కళలో మొట్టమొదటి సూత్రం మాంటేజ్ పద్ధతి. ఈ పద్ధతిని రకరకాలుగా ఉపయోగించటంలో డైరెక్టరు కళాకారుడవుతాడు. కళాకారుడికి ఎంత స్వేచ్ఛ ఉంటే అంత చక్కని కళ సృజించగలడు. ప్రస్తుతం మన సినిమాపరిశ్రమలో దర్శకుడికికంటే పెద్దస్థానం పెట్టుబడిదారుకూ, నిర్మాతకూ, లక్షలరూపాయలు గడించే ఆడ, మగతారలకూ ఉన్నది. ఈ పరిస్థితిలో ఒక చక్కని చిత్రం నిర్మించినదర్శకుడు మరొక నిర్మాతకింద పనిచేసేటప్పుడు అధ్వాన్నపు చిత్రం తయారు చేస్తున్నాడంటే ఆశ్చర్యమేముంది? ★

"పల్లెటూరు" రషెస్.

పీపుల్స్‌ఆర్ట్ ప్రొడక్షన్సువారు తమ "పల్లెటూరు" చిత్రం రషెస్ ఇటీవల పత్రికలవారికి, తదితర అతిథులకు చూపించారు. పలువురు ఈ చిత్రంపట్ల ప్రశంసాభావం వెలిబుచ్చారు. "షావుకారు" చిత్రం తెలుగు సినిమాకళలో ఒక కొత్త వరవడిని ప్రవేశపెట్టింది. దాని తరవాత గ్రామీణ సమస్యలను, సాంఘిక సమస్యలను వాస్తవికంగా, కొత్త దృక్పథంతో చిత్రించవలసిన అవసరాన్ని చాలమంది నిర్మాతలు గుర్తించినట్లు కనిపిస్తుంది. పై విధమైన కొత్త దృక్పథానికి చెందిన చిత్రాల్లో "పల్లెటూరు" ఒకటి. పేరునుబట్టే అది పల్లెటూళ్ళ జీవితాన్ని సమీక్షిస్తుందని తెలుసుకోవచ్చు. అన్నిటికంటే ఎక్కువగా ఈ చిత్రంలో ప్రజలను ఆకర్షించే విశేషమేమంటే-చిత్రమంతటా తెలుగు వాతావరణం దట్టంగా ఉన్నది. తెలుగు చిత్రంలో తెలుగుదనం ఉండటం ఒక గొప్ప విశేషం కాదుగాని, అది లేకపోవటం గొప్ప లోపమనే చెప్పాలి. ఇప్పటి మన చిత్రాల్లో ఎక్కువ భాగం హిందీచిత్రాలకో, తదితరాలకో అనుకరణలు కావటంవల్ల, ఏ కాస్త తెలుగుదనం కనిపించే చిత్రాన్ని చూసినా ప్రాణం లేచివస్తుంది. అందులో తెలుగువాళ్ళ జీవితాన్ని సగర్వంగా ప్రదర్శించే "పల్లెటూరు" లాంటి చిత్రాలు ఇంకా హర్షించవలసినవవుతాయి.

తెలుగు వాతావరణం కల్పించటానికై "పల్లెటూరు" నిర్మాతలు సపరివారంగా తెలుగు ప్రాంతాలకు వెళ్ళి చక్కని పొలాల దృశ్యాలు, పల్లెటూరి దృశ్యాలు తీశారు. సంక్రాంతిపండగ దృశ్యాలు, కోడిపం

దాలు, చెడుగుడు ఆటలు, గ్రామమధ్యంలో రచ్చబండ, కొత్తగా చైతన్యవంతు లవుతున్న యువకులు, రైతులు, గ్రామంలో యువజన గ్రంథాలయం, ఆంధ్రరాష్ట్ర ప్రసక్తి, ప్రజలను దోచే షావుకారు,— ఇలాటి విషయాలన్నిటి మేళవింపు వల్ల నిర్మాతలు తెలుగు వాతావరణం సాధించారు.

ఈ చిత్రంలో ఇంకా కొద్ది దృశ్యాలు మాత్రమే నిర్మించబడవలసి ఉన్నాయి.



సినిమా వార్తలు

గజానన ప్రొడక్షన్సువారు రేవతీ స్టూడియోలో తీస్తున్న "కోడరికం" సాంఘిక చిత్రం నాటికి 75 వంతుల దాకా పూర్తయింది. ఈ చిత్రానికి డైరెక్టరు శ్రీ కె. ఎస్. రామచంద్రరావుగారు. పెద్ద కోడలుగా ఎస్. వరలక్ష్మి, చిన్నకోడలుగా గిరిజ, పెద్దకొడుకుగా రామచంద్ర కాశ్యప, చిన్నకొడుకుగా కొత్తనటుడు చలం నటిస్తున్నారు. రేలంగి, బి. ఆర్. పంతులు, శేషమాంబ, సూర్యకాంతం మున్నగువారు మిగతా నటీనటవర్గం. మాటలు, పాటలు, కథ శ్రీ సదాశివబ్రహ్మం, సంగీత రచన పాండు; ఆర్టు వాలి; కెమేరా పి. ఎల్. రాయ్. ఈ చిత్రంలోని కోడరికం సమస్య పాతదైనా కథ కొత్తఫక్కీలో నడుస్తుంది. ఇద్దరు కోడళ్ళూ విద్యావతులే. పెద్దకోడలు సాధుహృదయం గలది. ఆమెను అత్తగారు హింసిస్తుంది. చిన్నకోడలు స్వతంత్రతత్వం గలది. ఆమె అత్తమామలను సరియైన మార్గానికి దిద్దుకుని వస్తుంది.

* * *

ఎమ్. ఆర్. ఫి. ప్రొడక్షన్సు పేరిట శ్రీమతి కృష్ణవేణి నిర్మిస్తున్న "లేడీ డాక్టర్" మూడింట ఒకవంతువరకూ పూర్తయింది. నాయికగా కృష్ణవేణి, నాయకుడుగా కొత్తనటుడు విజయకుమార్, జగదీశ్వరి నటిస్తున్నారు. దర్శకత్వం, కెమేరా శ్రీధర్. సంగీతం ఘంటసాల. మాటలు, పాటలు శ్రీ తాపీధర్మారావు.

* * *

విజయలక్ష్మి ప్రొడక్షన్సు పేరిట కృష్ణవేణి "గుడ్ ఈవెనింగ్" అనే మరొక చిత్రం నిర్మిస్తున్నది. ఈ నెల 15 నుండీ షూటింగ్ ప్రారంభమవుతోంది. ఇది పూర్తిగా కామెడీ చిత్రమని తెలుస్తోంది. ఇందులో కూడా కృష్ణవేణి, విజయకుమార్ నటిస్తున్నారు. సి. ఎస్. ఆర్. కూడా ఉంటాడట. దర్శకత్వము, కెమేరా కమాల్ ఘోష్. సంగీతం రాజేశ్వరరావు. కథ, మాటలు, పాటలు శ్రీ సదాశివబ్రహ్మం. ఈ చిత్రంలో మూడుపాటలు ఇప్పటికే రికార్డు అయినాయట.

* * *

భరణీవారు తెలుగు, అరవం, హిందీలలో తీస్తున్న "చండీరాణి" అయిదారు రీళ్ళవరకూ తయారైందట, కథ, దర్శకత్వం, నాయికపాత్ర శ్రీమతి భానుమతి. ఎన్. టి. రామారావు, ఎస్. వి. రంగా

వలచి, వలపించుకుని, ఎరికోరి వివాహం చేసుకున్నారు—
గజానన ప్రొడక్షన్సువారి "కోడరికం"లో రామచంద్రకాశ్యప్, ఎస్. వరలక్ష్మి.



ఎమ్. ఆర్. ఏ. వారు తీస్తున్న "లేడీ డాక్టర్"లో
కొత్తహీరో విజయకుమార్

రావు, హేమలత నటిస్తున్నారు. తెలుగులో మాటలు, పాటలు శ్రీ కొండముది గోపాలరాయశర్మ. హిందీలో మాటలు పండిట్ సుదర్శన్, పాటలు విశ్వామిత్ర ఆదిల్. కెమేరా సెల్వరాజ్. ఆర్టు శేఖర్. నిర్మాణం వాహినీ, నెప్ట్యూన్ స్టూడియోలలో జరుగుతున్నది. భానుమతి కోసం పాకంలో నిర్మిస్తున్న భరణీస్టూడియో నిర్మాణం పూర్తికావస్తోంది. దసరాపండగ నాటికి స్టూడియో పనిచెయ్యటం ప్రారంభిస్తుందట. భానుమతి నటిస్తున్న బొంబాయి చిత్రం "షంషీర్"లో ఆమె నటించేభాగం చాలవరకు అయిపోయిందనీ, మరొకసారి బొంబాయి వెడితే పూర్తవుతుందనీ తెలుస్తున్నది.

* * *

మీర్జాపురంరాజాగారు నిర్మిస్తున్న కొత్తచిత్రం చాలవరకు పూర్తయిందట. ("ఎడబాటు" అని దీని తాత్కాలిక నామధేయం) అక్టోబరులో విడుదల కావచ్చునని తెలుస్తోంది. డైరెక్టరు రాజాగారే. లక్ష్మీరాజ్యం, రామచంద్రకాశ్యప్, గిరిజ మున్నగువారు నటిస్తున్నారు. మాటలు, పాటలు శ్రీ తాపీధర్మారావు. సంగీతం శ్రీ ఓగిరాల రామచంద్రరావు.

* * *

సోనా ప్రొడక్షన్స్ పేరిట లలితా, పద్మిని ఒక కొత్తచిత్రం నిర్మిస్తున్నారు. ఇది తెలుగు, అరవం, హిందీలలో తయారవుతుందట. శ్రీ సదాశివబ్రహ్మంగారు తెలుగులో మాటలు, పాటలు రాస్తున్నారు. లలితా, పద్మిని, కొత్తనటుడు విజయకుమార్ ఈ చిత్రంలో నటిస్తారు. కెమేరా శ్రీ వి. ఎన్. రెడ్డి. "బైసికిల్ థీఫ్" నిర్మించిన ఇటాలియన్ దర్శకుడు విట్టోరియా డిసికా బృందంలో పనిచేసిన ఎన్. ఆర్. పిళ్లై ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. రేవతీస్టూడియోలో ఈ నెల 20 నుంచీ షూటింగ్ ప్రారంభమవుతున్నది.

* * *

నేషనల్ ఆర్ట్స్ అనే సంస్థవారు సాంఘిక చిత్ర మొకటి నిర్మిస్తున్నారు. "పల్లెటూరు" దర్శకులైన శ్రీ తాతినేని ప్రకాశరావుగారే దీనికి దర్శకత్వం నిర్వహిస్తున్నారు. కథ, మాటలు, పాటలు శ్రీ అనిసెట్టి సుబ్బారావు. సంగీతం రాజు. ఈ చిత్రంలోవి 6 పాటలు ఇప్పటికి రికార్డు అయినాయట. అక్టోబరు మొదటివారంలో సెట్సు పైకి వెడతారట. నాయకపాత్ర ఎన్. టి. రామారావు ధరిస్తున్నారు.

* * *

అసోసియేటెడ్ ప్రొడ్యూసర్స్ అనే సంస్థవారు అరవం, మళయాళం భాషల్లో ఒక చిత్రం తీస్తున్నారు. స్టూడియో వాహిని. డైరెక్టరు జి. ఆర్. రావు. సంగీతం వి. దక్షిణామూర్తి. బి. ఎస్. సరోజ, గిరిజ, బాలయ్య, కె. రామస్వామి మున్నగువారు ఈ చిత్రంలో పాల్గొంటారట.

"గుండుసూది"

కొత్తగా వెలువడిన "గుండుసూది" సినిమా మాసపత్రిక ప్రారంభ సంచిక (సెప్టెంబరు, 52) మా కార్యాలయానికి చేరింది. విడిప్రతి వెల 0-8-0; సాలుచందా 6-0-0. సంపాదకుడు కె. రాధాకృష్ణ. సినిమాపరిశ్రమకు సంబంధించినవ్యాసాలు, బొమ్మలుకలిగిఆకర్షకంగాఉంది ★

ఒకడు:- మాటల మధ్య 'వెధవ, వెధవ' అని తెగ ఉపయోగిస్తున్నావ్. నన్ను కాదు గదా అనేది.

మరొకడు:-పోరా, నువ్వు తప్ప ఇంకెవరూ వెధవలు లేరనుకుంటున్నావా?

బి. యస్. హనుమంతరావు—మద్రాసు.

'పెళ్ళిచేసి చూడు'లో మూడు జతలకు వివాహమైనట్లు చూపించాడు. కడపటి నాల్గవజతకు చూపించలేదేమండి?

—నాలుగో జతకే అందరికంటె ముందుగా 'ఉత్తుత్తి పెళ్ళి' జరిగింది. కట్నాల పేచీలు, పట్టుదలలు పెద్దవాళ్ళకే ననీ, అమాయికులైన పసిపిల్లలు అటువంటి వాటికి అతీతులని చూపిస్తూ, పెద్దవాళ్ళ ప్రవర్తనపై కోపం కలిగించటానికే చిన్నపిల్లల ఉత్తుత్తి పెళ్ళిని ప్రవేశపెట్టారు.

* * *

శ్రీ యస్. సూర్యనారాయణ—జరజాపుపేట.

పురుషుడు స్త్రీని పెళ్ళాడగా అతనికి వచ్చిన ప్రెస్టేజి ఏమిటి? పెళ్ళి పెడాకులు లేకుండావున్న బ్రహ్మచారికి లేనిదేమిటి? పై రెండింటికి గల తారతమ్యాలు ముఖ్య కారణాలు ఏమిటి?

—'బ్రహ్మచారీ శతమర్కటః' అన్న మాట ఉన్న మాటయే గనుక ఆ మాటకు ఆగ్రహించవద్దు. ఈ సూత్రానికి అక్కడక్కడ మినహాయింపులు ఉండవచ్చు. కాని నూరు కోతులకు ఉన్నంత ప్రతిష్ఠ ఒక్క బ్రహ్మచారికే ఉంది. వివాహం కావలసిన యీడులో వివాహం కాకపోతే, జీవితం వికృతం అవుతుంది. బెండకాయ ముదిరినా బ్రహ్మచారికి ముదిరినా పనికిరావంటారు.

ఏ కథలు చదివినా ఒక్కసారితోనే ముఖం తిరుగుతుంది. దానియందున్న ఉత్సాహం ఉబలాటం సమసిపోతాయి. కాని శ్రీమధిర సుబ్బన్న దీక్షిత కవిగారి కాశీమజిలీలు ఎంత చదివినా యింకా చదవాలనే వుంటూ తనివితీరదు. కారణం ఏమిటి? కవి చాతుర్యమా? కథల మాధుర్యమా సార్?

—కవి చాతుర్యమూ, కథల మాధుర్యమూ ముఖ్య కారణాలు. చదివేవారి అభిరుచి, రసగ్రహణశక్తి దానికి అనుబంధ కారణం.

* * *

ఎమ్. మస్తాన్‌రావు—విజయవాడ.

ప్రస్తుతము యిప్పటి తెలుగుచిత్రాలలో, రేస్ పందెములు పెట్టి, వాటి ద్వారా డబ్బు వ్యయం చేస్తున్నట్లు చూపిస్తున్నారు. వేరెవిధంగా డబ్బు వ్యయం చేయించుటకు డైరెక్టర్లకు తోచలేదా?

—న్యాయప్రకారం సినిమారంగంలో దిగి దివాలా ఎత్తినట్టు కూడా చూపించవచ్చు.

* * *



విజయలక్ష్మీవారి కామెడీ చిత్రం "గుడ్ ఈవెనింగ్"లో కృష్ణవేణి.

ప్రశ్నలు - సమాధానాలు

యం. భూషణం—నంది కొట్కూరు.

విజ్ఞానవీథులయందు జవాబిచ్చే డాక్టరుగారి పూర్తి అడ్రెసు తెల్పుతారా?

—"డాక్టర్" అన్నది ఒక వ్యక్తి పేరు కాదు. ఆయా విజ్ఞానశాఖలలో అధ్యాపక పీఠాలలంకరిస్తూన్న నిత్య విద్యార్థుల ధీశక్తిస్వరూపమే మా పత్రికలో "డాక్టర్" రూపం దాల్చి కనపడుతోంది. 'విజ్ఞాన వీథుల' కిటూ అటూ వున్న కణాదమహర్షి మొదలు రామన్ మహాశయుల వరకూ గల వైజ్ఞానికుల కృషి ఫలితాన్ని ప్రశ్నోత్తర రూపంలో మా 'డాక్టర్' ఆంధ్రులకు అందజేస్తారు. ధీశక్తికి శరీరమే లేకపోగా అడ్రెసు వేరే వుండదని చెప్పనేల? అయినా చెప్పమంటారా? ఇదిగో— "డాక్టర్" సచిత్ర ఆంధ్ర వార పత్రిక, 7 తంబు శెట్టివీధి మద్రాసు 1.

* * *

కె. శేషగిరిరావు—నరసరావుపేట.

ఎట్టి విద్య సర్వోత్తమమైనది?

—మానవత్వాన్ని పెంపొందించటమే లక్ష్యంగాగల విద్య.

వ్యక్తి సమాజము కొరకా? సమాజము వ్యక్తికొరకా? ఎందువల్ల?

—వ్యక్తి సమాజంకొరకే అనేది ఫాసిజం. సమాజం వ్యక్తులకొరకే అనేది ప్రజాస్వామ్యం. మన అందరి లక్ష్యం ప్రజాస్వామ్యమే.

* * *

శ్రీ సి. శేషగిరిరావు —హైదరాబాదు.

కొందరు సినిమాపత్రికలు ఎప్పుడూ చదువుతూ, ప్రతి సినెమాకు వెడుతూ, తారలఫొటోలు భద్రపరచుకుంటూ వుండి కూడా బయటకు సినెమా వారిని దూషిస్తూ వుంటారు. దీనికి కారణం ఏమిటంటారు?

—దాన్ని కారణం చెప్పాలంటే మర్మం విడిచి చెప్పవలసి వస్తుంది. నగ్న సత్యం చెప్పాలంటే నాగరిక మానవుడు నగ్నంగా ప్రవర్తించడం అసభ్యం అంటాడు. కాని నగ్నరూపంలోనే మనస్సు లగ్నం చేస్తాడు.

ఇదంతా సహజ స్త్రీ పురుష మర్మధర్మ మర్మకర్మ.

* * *

కె. కామేశ్వరరావు—విజయవాడ

కొండప్రదేశములమీద చల్లగా వుండడానికి కారణము ఏమిటి?

—కారణాలు మూడూ. ఒకటి! కొండ ప్రదేశాల వైశాల్యము చిన్న పరిమితిగలది. ఆ కాస్త మేరా వేడెక్కినా, చుట్టుపట్ల గాలి అంత వేడెక్కదు. ఈ గాలి వీచి కొండప్రదేశాన్ని చల్లబరుస్తుంది.

రెండోది: దిగువ ప్రదేశాలలో వేడెక్కిన గాలి ఎత్తుకి పోయినా, దానిమీద నున్న గాలియొక్క పీడనము తగ్గడమువల్ల వ్యాకోచించి, చల్లబడుతుంది. అందువల్ల వేడిగాలి వీచే అవకాశము లేదు.

మూడోది. కొండప్రదేశాలు చదునుగా ఉండవు. కనక సూర్యకిరణాలు మధ్యాహ్న ప్రవేళ నిటారుగాపడినా, వాలుగావున్న మేరపడడముచేత అట్టే వేడెక్కించలేవు.

కొండలమీద ఎండలో తిరిగితేమాత్రం బుర్ర వేడెక్కిపోతుంది!

* * *

వి. రామచంద్రరావు—విజయవాడ

3-9-52 వ సంచికలో "జంతుకోటిలో మానవులమేనా-" అను శీర్షిక నందు పిల్లిని గూర్చి వ్రాస్తూ "అపరాధినిగా ఒళ్లు అలవని పనియితేనే చేస్తుంద"ని తెలిపారు. మరయితే నేటి కాలపు మహిళలెందరో ఒళ్ళు వంచి పనిచేసేవారు ఉండగా, ఆవిధంగా వ్రాయటంలో వుద్దేశమేమిటో తెల విస్తారా?

—ఏనాటి మహిళలైనా ఒళ్లు అలవకుండా పనిచేయాలనే రచయిత అభిలాష. అల్లా కాక యీనాటి మహిళలు ఒళ్లు అలిసే పనులే చేస్తే ఎవరుమాత్రం ఏమన గలరు!

* * *

శ్రీ యస్. వి. సూర్యనారాయణరాజు —సింగవరం (ప. గోదావరి).

మా గ్రామములో ఒక కమ్యూనిస్టు వ్యక్తి ఉన్నాడు. ఆయన మీటింగులలోను తదితర చోట్లలోను కమ్యూనిస్టు సిద్ధాంతాలను బోధిస్తాడు. ఆయనకు పెళ్లి సంబంధాలు వస్తున్నాయి. 2 యకరముల కట్నం యిస్తానంటున్నారు. ఈయన 4 యకరాలు యిస్తేనేగాని ఒప్పుకోనంటున్నాడు. ఆయనకు ఎలా బుద్ధిచెప్పాలో తెలియజేస్తారా?

—కన్యాదానం విషయంలో వరునకు కన్య నచ్చినదా? భూదానం విషయంలో వినోబాభావేగారికి విన్నవించండి. ఎవరు, ఎవరికి ఎంత భూమి యివ్వవచ్చునో వారే నిర్ణయించి భూదానయజ్ఞాలు జరిపించుతున్నారు.

* * *

డి. శ్రీనివాసులు—వెంకటగిరి.

విజయా వారి 'పెళ్లిచేసి చూడులో' ప్రయివేటు గోవిందయ్యకు తన భార్య, అమ్మడు ఎవరితోనో లేచిపోయినదని చెప్పినపుడు అతను ఆశ్చర్యముగా వింటూ తన కంటిజోడు కండ్ల పైభాగమున, వుంచుకొని, అంతా వినిన తర్వాత కంటిజోడు ముఖానవున్న సంగతి మరచి తన చుట్టు ప్రక్కల వెదకును తనతో తన భార్యయూ వెదకును. యిట్లు పెట్టుటలో డైరెక్టరు ప్రసాదుగారి వుద్దేశ మేమైవుండవచ్చు? మీ యొక్క వుద్దేశము ఏమి?

—మానవుడు ఒక్కొక్కసారి ఎంత హాస్యాస్పదంగా ప్రవర్తిస్తాడో చూపాలనే ఆ అంశం చొప్పించారు.

* * *

డి. వి. సుబ్బారావు—నెల్లూరు.

పాము పగబట్టుట నిజమా?

—నిజమని చెప్పడానికి శోధించి కనుక్కున్న సాక్ష్యములేదు. అపాయము చేసిన వారిని అప్పడే తరమడము ఎరుగుదురుగాని దెబ్బతిన్న పామే వెతికి వెతికి కరుస్తుందనడానికి సాక్ష్యము నెవరూ ప్రచురించలేదు.

విష సర్పాన్ని తాటి ఉరి తగిలించి పట్టి ఆడించి, ఊరవతలకి తీసుకుపోయి పుట్టదగ్గిర వదిలితే తుర్రుమని దూరిపోతుంది గాని అంతసేవూ తన కిష్టములేకుండా నిర్బంధములో ఉంచిన వారిమీద పగ పట్టదేమో? ఈ బాధకంటె విస్తరాకు పడితే బాధ ఎక్కువా?

* * *

శ్రీ కొర్లపాటి. ఆదినారాయణమూర్తి, కొర్లపాటివారి పాలెం—(తూ. గోదావరి)

మన సంఘంలో వదినె మరదలు మధ్య మధురమైన పరిహాసాలాడుకునే సాంప్రదాయం ఉంది. దీనికి హద్దు ఎక్కడో అది మాత్రం కొంతమందికి తెలియదు. తెలుసకోవాలని కూడా అనుకోరు. ఈ హాస్య పరిహాసాలలో కొన్ని కొన్ని విష బీజాలు పడి అవి తమకు తెలియకుండానే విషవృక్షాలై ఒక్కొక్క సమయంలో కుటుంబ మర్యాద నంతనుకలుషితం చేస్తాయి. మీ ఉద్దేశ్యం ఏమిట?

—వదినా మరదలు సరసాలు వదలిపెట్టడం వదినకు మంచిది. మరచి పోవడం మరిదలుకు మంచిది. సహనం లేనివాళ్లకూ సంస్కారం లేనివాళ్ళకూ సరసములు సర్వదా అయోగ్యం; అపథ్యం; విరుద్ధం; నిషిద్ధం అవుతాయి.

* * *

శ్రీ చేబ్రోలు బదరీనాథ్ :—గుడివాడ.

కీర్తికి ఏవరేజి వయస్సెంత?

—కీర్తి అంటే మనంచేసే గౌరవసంస్మరణ—మానవ జ్ఞాపకశక్తికీ, స్మృతికీ ఉన్న వయస్సే కీర్తికి కూడా ఉంది.

* * *

రెండు మహానగరాలు

(11-వ పేజీ తరువాయి)

కాపలా కాస్తున్నారు. ఈ ముగ్గురూ గేటుదగ్గిరికి రాగానే అక్కడున్న అధికారి: 'ఖైదీ తాలూకు కాయితా లెక్కడ?' అని ఒక గర్జన చేశాడు.

"ఖైదీ" అన్నమాట చెవుల బడగానే, డార్నే కంగారు పడ్డాడు: 'నేను ఖైదీని కాదండీ, స్వతంత్రప్రజకు చెందినవాణ్ణే ఫ్రెంచి పౌరుణ్ణి: దేశం కల్లోలంగా వున్న కారణంగా, ఎందుకైనా మంచిదని అక్కడి అధికారులు సైనికసహాయం యిచ్చి పంపారు' అన్నాడు.

ఆ ఉద్యోగి ఆ మాట వినిపించుకోనే లేదు: 'ఎక్కడ కాయితాలు!' అని మళ్లా అరిచాడు.

మన ప్రౌఢసబోతు దేశభక్తుడు ఆ కాయితాలను నెత్తిమీది టోపిలోనుంచి బయటికి తీశాడు. గాబెల్లీ ఉత్తరం చదువుకుని, ఆ ఉద్యోగి ఎందుకో ఆశ్చర్యంగా డార్నే మొఖంలోకి చూశాడు.

మరు మాట చెప్పకుండా, వాళ్ళ ముగ్గుర్నీ అలా గేటు దగ్గరే వదిలేసి, ఆ కాయితం తీసుకుని లోపలున్న 'గార్డ్ ఆఫీసు' లోకి వెళ్ళాడు. గేటుయివతల గుర్రంమీద కూర్చుని డార్నే పరిస్థితులన్నీ అర్థంచేసుకుంటున్నాడు. గేటుదగ్గిర కాపలావున్న వాళ్ళల్లో కొంతమంది మామూలు పోలీసులూ, కొంతమంది దేశభక్తులూ కూడా వున్నారు. పోలీసులకంటే దేశభక్తులే యెక్కువ మంది వున్నారు. గేటులోపలనుంచి బయటికి రావాలన్నా, బయటినుంచి లోపలికి వెళ్ళాలన్నా దుర్ఘటమైన కార్యం. నగరంలోకి సరుకులు సరఫరాచేసే సామానుబళ్లు వగైరాలు పరాహత్ గా వెడుతూ వస్తూవుంటై. వాటిని ఎవ్వరూ అటకాయించరు. మనుషుల్ని మాత్రం పోనివ్వరు. తమ అవకాశం వచ్చేవరకూ నిరీక్షించుతూ యిటూ అటూ వేలాది ప్రజ పడిగాపులు పడుతున్నారు.

ఆ పరిస్థితులన్నీ అర్థంచేసుకుంటూ, డార్నే ఆ గుర్రంమీద అలాగే దాదాపు అరగంటసేపు కూర్చున్నాడు. వెన్నెముక పట్టుకు పోయింది. అనంతరం ఆ వెళ్లిన అధికారి మీసాలు తడుముకుంటూ తాపీగా వచ్చి, గేటు తీయించి లోపలికి రమన్నాడు. ముగ్గరి గుర్రాలూ లోపలికి రానిచ్చి, ఆ యిద్దరూ సైనికులకు ఒక కాయితం యిచ్చాడు—డార్నేను వప్పగింత చేసినట్టు రశీదు. డార్నేను గుర్రం దిగమన్నాడు. అతను గుర్రంమీదినుంచి దిగగానే ఆ దేశభక్తు లిద్దరూ, డార్నే స్వారీచేసివచ్చిన గుర్రాన్నికూడా తీసుకుని తిరిగి వెళ్లిపోయారు.

డార్నే ఆ ఉద్యోగి వెంట 'గార్డ్ ఆఫీసు'లోకి నడిచాడు. ఆ గది యావత్తూ సారా కంపుతోనూ పొగాకు వాసనతోనూ ఊపిరి సలపకుండా వుంది. దాన్లోవున్న దేశభక్తులూ సైనికులూ, కొందరు నిద్రపోతున్నారు; కొందరు మేలుకునుండే కునికిపాట్లు పడుతున్నారు; కొందరు తప్పదాగి నిద్రామెలుకువా గాని అయోమయావస్థలో వున్నారు. బల్లమీద కొన్ని రికార్డులు పారేసి వున్నయ్. ఆ బల్లదగ్గిర, ఒక జీబుతల ఉద్యోగి కూర్చొని చుట్ట కాలుస్తున్నాడు. ఆ ఉద్యోగి డార్నేను లోపలికి తీసుకొచ్చిన రెండో ఉద్యోగి వంకజూచి:

'డిఫార్జ్ గారూ!—ఎవ్రీమాండ్ అనే పరారీదారు యితనేనా?' అన్నాడు, బల్లమీదవున్న పుస్తకంలో యేదో వ్రాసుకుంటూ.

'అవును—ఇతనే'—

'ఎవ్రీమాండ్!—నీ వయసు?'

'ముప్ఫయియేడు'—

'వివాహమైందా?'

'ఆ'

'వివాహం ఎక్కడ జరిగింది!?

'ఇంగ్లండులో'—

'ఇంగ్లండులో వివాహం జరిగిందనటంలో ఎలాంటి సందేహమూ లేదు?—

'లేదు'—

'భార్య యెక్కడుంది?'

'ఇంగ్లండులో'

'నిస్సందేహంగా?'

'నిస్సందేహంగా'—

'ఎవ్రీమాండ్!—నిన్ను "లాఫోర్స్" జైలుకు పంపించటానికి నిర్ణయించాం'—

'ఏమిటీ?' అన్నాడు, డార్నే తెల్లబోతూ—ఎందుకూ? ఏ శాసనం ప్రకారం?'—

ఆ అధికారి తల ఎత్తకుండానే వ్రాసుకుంటూ!

'నువ్వు వెళ్లిన తరవాత—యిక్కడ కొత్తశాసనాలూ, క్రొత్తనేరాలు అమల్లోకి వచ్చాయి మహాత్మా' — అన్నాడు, అదోవెటకారంగా చిరునవ్వు నవ్వుతూ—

'నా అంతటికి నేను బుద్ధిపూర్వకంగా యిక్కడికి వచ్చాను; యీ విషయాన్ని అర్థం చేసుకోగలరని ఆశించుతున్నాను. సోదర దేశీయుడు ఒకరు ఆ రిలోవుండిఉత్తరం వ్రాస్తే, అతనికోసం వచ్చాను. వెంటనే ఆయన్ను కలుసుకోవాలి. ఆమాత్రం అవకాశంయివ్వలేరా?'

'పరారీదార్లకు హక్కులూ, అవకాశాలూ యేమిటిరో?'— ఆ ఉద్యోగి తాను వ్రాయవలసిందంతా వ్రాసి, కవరులో పెట్టి, అంటించేశాడు. పైన 'రహస్యం' అని వ్రాశాడు. ఆ కవరుడిఫార్జ్ చేతికి అందించాడు.



తెలుగు క్రాసువర్డు పజిలు నెం. 4, కాకినాడ.

తప్పక గెలవండి: రూ 1000 గ్యారంటీ

రైటు ఆన్సరుకి 500/- ఒకతప్పుకి 250/- రెండుతప్పులకు 150/- మూడుతప్పులకు 100/- బహుమతులిచ్చే సొమ్ము రూ 1000 లున్నూ కిసాల్యూషన్నూ కాకినాడ కో-ఆపరేటివు సెంట్రల్ బ్యాంకిలో డిపాజిట్టు చేయడమైనది. 30 కూపన్లుపైగా పంపువార్కి ప్రత్యేక బహుమానములు యిచ్చెదము. దశరా పండుగకు ప్రత్యేక బహుమానములు. రూ 1-0-0 కి మూడు కూపన్లు చొ॥న ఎన్నియైనను పంపవచ్చును. మూడు కూపన్లుకు తక్కువ పంపరాదు.

ఆధారములు అడ్డము. ముగింపు తేది **7-10-52** ఆధారములు నిలువు.

1. ఏ పనినైనా ప్రారంభములో విఘ్నం కాకుండా వుండేందుకు తొలి పూజ వీనికి చేయుట సహజము.
4. ఇది ఎక్కువగా పొందినవాడు పనికి వెళ్ళక పోవచ్చును.
6. స్త్రీ.
7. కొందరు పాపలు దీనిని చూడగా సంతసింతురు.
8. దీనివిలువ తెలుసుకొని సరియైన ప్రజా సేవకునికే యివ్వవలెను.
11. ఇది నష్టము, పొందులాభము అంటారు.
12. ఈ రోజులలో దీని ప్రభావము హెచ్చు కావచ్చును.
13. పూజకు వుపయోగించే పత్రిలో ఒకటి.
16. దీనిపాలు గోవుపాలుకన్న శ్రేష్టమా?
17. దీనికి మించిన దానము చేయరాదంటారు.
19. ఇదిలేని మంగలి పిల్లితల గొరిగెడట.
21. దీనియందు మంచి ఆకర్షణ వున్నదంటారు.
22. పప్పులలో యిది యొకటి.

20. సాధారణముగ వేసవికాలములో దీని ప్రమాదములు కలుగుచుండును.

1. ఇదిలేనినాడు ఎందుకు రానించడంటారు
2. నాగరికత హెచ్చిన కొలది దీని వాడుక వుండక పోవచ్చును.
3. ఇదిలేకుండా గృహస్తులు వుంటారా?
4. పెద్దవార్ని యిలా పిల్చెదరు.
5. ఇంతమంది కలసిన త్రిమూర్తులంటారు.
6. దేవికైనా వెల్లడిచేయకుండా యిలా వుండుట మంచిది.
8. ఎంతకష్టము వచ్చినను యిదియుండుట మంచిది.
9. మహాభారత యుద్ధ వీరులలో మహావీరుడు యితడే యని చెప్పవచ్చు.
10. ఇది లేనివాని బ్రతుకు కష్టమే కావచ్చును.
14. హరికథా కాలక్షేపములలో సాధారణముగ యిది పొందవచ్చును.
15. ఇటువంటివారిని చుల్కనగా చూచెదరు.
17. ఇది నవగ్రహములలో నొకటి.
18. మనకు పన్నీరు ఎంతో దీనికి బురద అంత.
19. ఈసమయములో నిద్రించుట అనారోగ్యము కావచ్చును.

నిబంధనలు :- ప్రవేశరుసుము రూ 1-0-0 కి 3 చొ॥న ఎన్నియైనను పూర్తిచేసి పం. లి. తెల్లకాగితముపై గళ్లువేసి గాని ఎన్నియైనను పంపవచ్చును. 3 కూపన్లుకు తక్కువ పంపరాదు. తుడుపులు, కొట్టివేతలు వున్న కూపన్లు రద్దుచేయబడును. అచ్చుకూపన్లు కావలసినవారికి ఎన్నియైనను వుచితముగా పంపెదము. ప్రవేశరుసుము ముగింపు తేదీకి ముందుగాని, అరోజునగాని అందేలాగున పంపాలి. దీని కీసొల్యూషను నెం 5 పజిలుతో ప్రచురింపజడును. పజిలులో వున్న పదమును అన్నియు తప్పక యుండునని గ్యారంటిచేసి వ్రాసినవారి పేపరు 0-4-0 పోష్టుబిళ్లలు పంపినవారికి పంపెదము. పేపరులో లేని పదములు పజిలులో వుండవు.

మేనేజరు,

తెలుగు క్రాసువర్డు పజిలు నెం. 4

జగన్నాధపురం, కాకినాడ.

తెలుగు క్రాసువర్డు పజిలు

కొవ్వూరు రోడ్డు, జగన్నాయకపురం

కాకినాడ.

నెం. **2** లో బహుమతులు పొందినవారి జాబితా :—

ఆల్ కరక్టు ఒక్కరికి రూ 500/-లు శ్రీ గంగుబోయిన అనే గంగుపాము జోగులు దొరగారు, సీతానగరం. అనకాపల్లి P O. ఒక తప్పు ఒక్కరికి రూ 250/-లు శ్రీ టి. వెంకట్రావుగారు, పిప్పర. రెండు తప్పులు ఒక్కరికి రూ 150/-లు శ్రీ సి. వెంకట్రావుగారు కాకినాడ.

మూడు తప్పులు 20 మందికి రూ 100/-లు ఒక్కొక్కరికి రూ 5/- చొ॥న పంచడమైనది. ఎస్. చంద్రయ్యగారు, పాలకొల్లు, వి. వి. స్వామిగారు, రాజమండ్రి, కె. వీరన్నగారు తణుకు, పి. సూరన్నగారు అమలాపురం, ఎమ్. ఎస్. మూర్తిగారు సామర్లకోట, సి. మల్లయ్యగారు కొత్తపల్లి, ఎమ్. వీరాస్వామిగారు కాకినాడ, జి. వీరాస్వామిగారు కాకినాడ, కె. మల్లయ్యగారు భీమవరం, బి. ప్రకాశంగారు బిట్రగుంట, వై. సత్యనారాయణగారు బెజవాడ, వి. సుబ్బారావుగారు రాజమండ్రి, వి. వి. రాఘవులు గారు ఏలూరు, బి. అప్పారావుగారు తెనాలి, ఎస్. లక్ష్మీకాంతముగారు గుంటూరు, కె. యల్లారంగారు హనుమకొండ, డి. రామచంద్రముగారు బాపట్ల, టి. రామచంద్రరావుగారు నడకుదురు, పి. పాండుగారు గుంటూరు, ఎస్. రత్నంగారు వినుకొండ.

జంతుకోటిలో మానవ లక్షణాలు

(41-వ పేజీ తరువాయి)

మరి కొంతసేపు వూరికే తారట్లాడుతున్నట్లు అక్కడక్కడే తిరుగుతూ తిరుగుతూ అమాంతంగా పోయి ఆయనను వాటేసి వొంగటానికి వీల్లేకుండా కట్టుకొని, ఎకాయెకిని ఆయన భుజాలమీదికి ఎక్కేసి, పళ్ల అత్తాన్ని చేతికి చిక్కించేసుకొని, కిందికి దూకేసి దబదబా ఒక మూలకు పరుగెత్తిపోయి అక్కడ కూర్చొని పండుమీద పండుగా అన్ని పళ్లనూ తినేసింది. మధ్య మధ్య యీయనకేసి తిరిగి పళ్లు యికిలించి కళ్లు చికిలించి, వెక్కిరించింది

మరొక మానసికశాస్త్రవేత్త కూడా యిలాగే తోకలేని కోతితో (ఏప్) యింకొక పరిశోధన చేయబోయాడు. ఆయన కూడా అరటి పళ్ల అత్తాన్ని అంత ఎత్తున కట్టి, చింపాంజీకి చేతివాటు దూరంలో పొడుగాటి కర్రనొక దానిని పడేసి పెట్టాడు. ఆ కోతి పళ్లను ఆ కర్రతో పడగొట్టి తింటుందనుకొన్నాడు. కానీ ఆ కోతి అలా చేయలేదు. కర్రను రెండు చేతులతోనూ పట్టుకొచ్చి, సరిగ్గా ఆ పళ్లగుత్తికి క్రింద కర్ర మొనను నేలకు తాకించి పేటవాలుగా నిలబెట్టుతూనే, తాను ఆ కర్రమీదుగా ఎగబాకి వెళ్లి పళ్లగుత్తిని అందుకొన్నది.

కాబట్టి పై రెండు సందర్భాలలోనూ చింపాంజీలు మానసిక తత్వశాస్త్రవేత్తలు అనుకొన్న దానికంటే ఎక్కువ తెలివి తేటలు కలవనే ఋజువు చేసుకొన్నాయి. తోకలేని కోతి విషయంలో శాస్త్రవేత్త అనుకొన్నట్లుగా ఆ కోతి గనుక కర్రతో పళ్లను పడగొట్టటానికి ప్రయత్నిస్తే, పళ్లు పాడైపోయేవే! ఈ విషయం ఆ శాస్త్రకారుడికి తట్టనే లేదు

(ఇంకావుంది.)

మెట్టవేదాంతం

(35-వ పేజీ తరువాయి)

బిందె కాస్తా చంకన పెట్టుకొని చక్కా పోబోయాడు. దాంతో ఆమె "అయ్యో! అయ్యో; నీళ్లు త్రాగి పొయ్యే వాడివి వూరకే పోక బిందెకూడా చంకన బెట్టుకుపోతావే మయ్యావ్ ?" అంటూ వెంటబడి అరవటం సాగించింది "నే నేమిటి ? నువ్వేమిటి? బిందేమిటి? చేదపమిటి? దొంగిలించడమేమిటి ? అంతా మాయ! జీవులు అన్నీ ఒకటే! ఇందులో నీ, నా భేదం లేదు" పరుగెత్తుతూనే మన వాడు సమాధానం చెప్పాడు. అవధాన్లు భార్య ఆరున్నొక్క రాగం ఆలాపిస్తూ యింటికి పోయింది, తన మండిపోయిన వేదాంతాన్ని తిట్టుకొంటూ; నిక్షేపమయిన బిందెను తలుచుకొంటూ!

★

పరారి

(25-వ పేజీ తరువాయి)

వెనక్కి తిరిగి చూసేసరికి డెవాంట్ నవ్వుతున్నాడు]

డె. నాకు భయమనుకుంటున్నారు కాబోలు లేదులేదు, కాని తీరా వీళ్ళ చేతుల్లో చిక్కడమెందుకనే

యు : అది నాకేం తెలియదు పోనీ ఆ పక్కగా [illegible] ప్రయత్నించకూడదూ.

[తలుపు తట్టిన చప్పుడు. ఇద్దరూ ఉలిక్కి పడతారు.]

యు : ఎవరు ?

గాపీ : (దూరంనించి) నీళ్ళు [illegible]

యు : ([illegible]) నేనే అక్కడే ఉంచు ([illegible]) [illegible] దానికి వినపడ్లేదు కదా ?

డె [illegible] ఏ దారి [illegible] లేకుండా ఒక [illegible] హృదయం ఎంత [illegible] తెలియదు నావల్ల [illegible] రానీయను [illegible] చూసి మరి వెళ్లి [illegible]

[illegible] ?

డె [illegible] పోలీసు [illegible] చూసి దాటేస్తాను

యు [illegible] సన్నగిల్లతే [illegible]

[illegible] లేదు - ఈ [illegible] కొట్లు [illegible] కాని

యు (అతిదివంక తేరిపార చూస్తుంది) [illegible] నేను [illegible] అక్కడ [illegible] అక్కడ [illegible] ఉన్నాయి. చేపలు [illegible] దానికి [illegible] అవి [illegible] నే వున్నాయి నేను [illegible] లేదూ అంటే నువ్వు పారిపోవచ్చు [illegible] అంటే పరుగెత్తుకు పక్కనే [illegible] అక్కడ చేపలు పట్టు [illegible] నింక [illegible] ?

[illegible] ! [illegible] ఈరాత్రే [illegible] ఒకటవుతుందిలే ఇష్టం లేకపోతే మాత్రం ఏం చేస్తారు ? ఇదుగో ఈ చిల్లుండి నా దగ్గర. తీసుకో.

[illegible] చిల్లర తీసి ఇస్తుంది [illegible]]

[illegible] మరిచిపోను.

([illegible])

యు : ఎలా పారిపోగలడో ? బలే ! గమ్మత్తుగా వుందే! ఇలా చూస్తాననుకో లేదు. ★

[తెర]

వెళ్ళొస్తాను

(19-వ పేజీ తరువాయి)

[illegible] గాం వేశాం [illegible] పోనాల్ని [illegible] పోగాముని వచ్చాను. పోనీలే మానేస్తాను. రానని చెప్పిరానా ? కాని, పాపం, వాళ్ళంతా నాకోసం కనిపెట్టుకున్నారు.

కుమా : అబ్బ ! బయలుదేరి వెళ్ళినవాడు పోవాలిగాని, మళ్ళీ వెనక్కి రావటం అంత న్యాయమన్న అదేగాని ఇంకోటి లేదు పోయేను గదా అని ఎవరి పనిలో వాళ్ళున్నారు ఇంకా నయం

కే [illegible] వెళ్ళొస్తాను వెళ్ళొస్తా నన్నందుకు [illegible] మళ్ళీ వచ్చా ! ★

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St Madras




పంచతంత్రం

మిత్రభేదం

కర్త... విశ్వాత్ముల నరసింహమూర్తి



వెంటనె ఆ వడ్రంగి పిట్ట తన ప్రాణమిత్రమగు ఈగ దగ్గరకు వెళ్లి సంగతిని వివరించింది




ఈగా, పిట్టా కప్ప దగ్గరకు పోయి సంగతిని వివరించాయి



ముగ్గురు కూర్చొని ఆలోచించి మంచి వుపాయం వెదికారు




జ్వరతాపంతో మూలుగుతుండే ఏనుగు వద్దకు ఈగ వెళ్లి చెవి దగ్గర ఝుంయని రొద చేసింది చిరాకుతో ఆ ఏనుగు పాపం కళ్లను కొంచెం చికిలించింది.




సమయ మిదే నని వడ్రంగి పిట్టా ఏనుగు కళ్లను పొడిచింది




కళ్లు కానక ఏనుగు భయమున అరిచి అరిచి తెగ అలిసింది




పక్క నె వున్నది అగాధ మొక్కటి దాని అంచునే కూర్చుని ఝషమూ బెక బెక మంటూ అరిచింది




కప్ప అరుపు విని అక్కడ ఏదో కొలనుందనుకొని ఏనుగు వేగమె ముందుకు తడుముకు నడిచింది.




అగాధ ముందని తెలియక ఏనుగు చాపచుట్టుగా దొర్లింది అగాధ మడుగున చచ్చింది




"కనుకనె నాధా! మీరుకూడ ఆ పిచ్చుక లాగే పరుల సహాయం కోరితె కార్యం నెరవేర్తుంది!"



పక్షుల సభలో మగ లేతువు తన కొచ్చిన ఆపద చెప్పింది



సముద్రుడంతటి గొప్పవాడితో శత్రుత్వం సాధించుట ఎట్లో ఎవరికి ఏమీ తోచక పోగా ముసలి బాతునొకదానిని చేరి సలహా యిమ్మని అడిగాయి



"పూర్వమిలాగే బాతులుకొన్నీ ముసలి బాతునొకదానిని సలహా అడిగినట్లులే అడిగారే!"

